


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 6

శుక్రవారం 29-3-2024



క్రీస్తు విధేయతా బలియాగం

క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం - IVలో



పరాగ్ ప్రతాపం

ఢిల్లీపై 12 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ విజయం - 13లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆమ్ ఆద్మీ'ని అంతం చేసే కుట్ర

ఈడీ దోపిడీ రాకెట్ నడుపుతోందని.. ఆప్‌ను అంతమొందించడమే దాని లక్ష్యమని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



సీఎం జైల్లో ఉంటే తప్పేంటి?

అరెస్టయి జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలంటూ దాఖలైన వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది.


వివరాలు 6లో ▸



ఆత్మహత్యకు యత్నించిన ఎంపీ మృతి

లోక్‌సభ టికెట్ దక్కలేదన్న మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన ఎండీఎంకే నేత, ఎంపీ ఎ.గణేశమూర్తి మృతిచెందారు.

వివరాలు 6లో ▸



లాభాలతో ముగింపు

స్టాక్ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 655 పాయింట్లు పెరిగి 73,651 వద్ద స్థిరపడింది.

వివరాలు 12లో ▸

ఫ్యాక్ట్‌చెక్

వినాశకాలే.. విపరీత రాతలే!

- పనిగట్టుకుని రామోజీ దుష్ప్రచారం.. రాష్ట్రంలో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- యకహోమా టైర్స్ కంపెనీలో మహిళలకు ఉపాధి అంటూ ఈనాడులోనే కథనం
- ఆదిత్య బిర్లా గార్మెంట్స్ వంటి పెద్ద పరిశ్రమలు వచ్చినా రాయని రామోజీ
- అమరరాజా ఇక్కడే ఉన్నా వక్రపు రాతలు..

5 లో

నంద్యాలలో జరిగిన మేమంతా సిద్ధం సభలో పాల్గొన్న అశేష జనసందోహంలో ఓ భాగం



చీకటి యుద్ధాన్ని ఎదుర్కొందాం

నంద్యాల బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్



మేనిఫెస్టో అంటే ఎన్నికల తర్వాత చెత్తబుట్టలో వేసే సంస్కృతి చంద్రబాబుది. మనం మాట చెబితే బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి 99 శాతం హామీలు అమలు చేసి చూపించాం. ఈ మార్పుల్లో 10 శాతం లేదా 5 శాతం అయినా చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో తీసుకొచ్చారా? మనం చేసిన దాంట్లో కనీసం 5 శాతం చంద్రబాబు చేసి ఉంటే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5, ఎల్లో మీడియా, ఆయన మనుషులు మా బాబుకు ఒకటి కాదు పది రంగాల్లో నోబెల్ ప్రైజులు, 4 ఆస్కార్‌లు, మెగసెసే అవార్డులు ఇవ్వాలనే వారు. యునైటెడ్ నేషన్స్ సెక్రటరీ జనరల్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు.. ఇద్దరూ కలిసి వచ్చి చంద్రబాబుకు శాలువా కప్పాలని ప్రచారం చేసేవారు.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- సెల్‌ఫోన్ ఉన్న ప్రతి కార్యకర్త ఓ ఎడిటర్, ఓ ఛానల్ ఓనర్
- సోషల్ మీడియా ద్వారా ఎల్లో మీడియాను ఏకేద్దాం
- పొత్తులు, జిత్తులు, ఎత్తులతో మళ్లీ మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబు
- 77 ఏళ్ల స్వతంత్ర దేశంలో ఎవ్వరూ చేయని మార్పులు మనం చేశాం
- 2014 ఎన్నికల మేనిఫెస్టోలోని ఒక్క హామీనైనా చంద్రబాబు నెరవేర్చారా?

7 లో

- ప్రతి గ్రామంలో మనం చేసిన అభివృద్ధి కళ్లెదుటే కన్పిస్తోంది
- పిల్లల భవిష్యత్‌కు దారి చూపాం.. వైద్య రంగంలో సమూల మార్పులు తెచ్చాం
- సామాజిక న్యాయం విషయంలో సువర్ణాధ్యాయాన్ని లిఖించాం
- రాష్ట్రం రూపు రేఖలు మార్చేందుకు మనమంతా సిద్ధమవుదాం
- ఓటుతో మన తల రాతను మనమే రాసుకుందాం

ప్రభం'జనం'

నంద్యాల జిల్లాలో సీఎం జగన్ బస్సు యాత్రకు నీరాజనాలు

జన సంద్రంలా నంద్యాల.. బహిరంగ సభకు పోటెత్తిన జనం

నేడు కర్నూలు జిల్లాలో కొనసాగనున్న యాత్ర

7 లో

పేదల తలరాతలు మార్చే ఎన్నికలివి

ఎర్రగుంట్లలో ప్రజలతో ముఖాముఖిలో సీఎం వైఎస్ జగన్

- ఒక్క గ్రామంలోనే 1,391 మందికి రూ.48.74 కోట్ల మేర లబ్ధి
- 93 శాతం మందికి మన ప్రభుత్వ పథకాలు అందాయి
- ఇన్ని సంక్షేమ పథకాలను చంద్రబాబు ఎందుకు అమలు చేయలేదు?.. 14 ఏళ్లు సీఎంగా ఉండీ ఈ చిన్న పిల్లోడు చేసినంత మేలు ఎందుకు చేయలేకపోయారు?

8 లో

ఇద్దరికీ నో టికెట్

- బీజేపీ నుంచి అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా పాంగి రాజారావు
- టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై పెరుగుతున్న అసంతృప్తి
- ఇటీవలే అబ్రహం ఫైర్.. అదే రూట్లో దొన్నుదొర
- తాడోపేడో తేల్చుకునేందుకు విజయవాడకు దొన్నుదొర
- అరకు అభ్యర్థిగా దొన్నుదొర పేరును మొదట్లోనే ప్రకటించిన చంద్రబాబు
- ఇప్పుడు టికెట్ బీజేపీకి కేటాయించడంపై ఆగ్రహం

3 లో

పచ్చ పార్టీ ప్రలోభాలు

- డబ్బులు ఎరవేసి ప్రత్యర్థి పార్టీ నేతల కొనుగోళ్లు
- గ్రామస్థాయి నేతలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు
- చోటా నేతలకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు
- పార్టీలో చేరిన వారికి రూ.10 వేల చొప్పున చెల్లింపులు
- మండలస్థాయి ప్రజాప్రతినిధులకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఆఫర్
- అద్దంకి, పర్చూరు, రేపల్లె లోనూ టీడీపీ ప్రలోభాలు

11 లో

ఎండల మంటలే!

ఇప్పటికే దేశవ్యాప్తంగా చాలా చోట్ల 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు అదనంగా నమోదు

ఎల్‌నినో ప్రభావం జూన్ వరకు ఉంటుందని వాతావరణశాఖ అంచనాలు

వచ్చే రెండు నెలలపాటు భానుడి భగభగలు తప్పవంటున్న నిపుణులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. సాధారణంతో పోలిస్తే రెండు, మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈ వేసవికాలంలో భానుడి భగభగలు తప్పకపోవచ్చని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ఆసియా ఖండంలోని దేశాల్లో తీవ్ర వర్షాభావం, అధిక వేడికి కారణమయ్యే ఎల్‌నినో పరిస్థితులు జూన్ వరకు కొనసాగవచ్చని పేర్కొంటున్నారు. భారత వాతావరణ శాఖ కూడా దీనిపై ఇప్పటికే ప్రకటన జారీ చేసింది. ఈసారి సాధారణం కంటే

మిగతా 2వ పేజీలో ▸



నిఘా పెంచండి

అక్రమ మద్యం, గంజాయిపై ఉక్కుపాదం మోపండి

- వీటిని సరఫరా చేసే వారిని గుర్తించి పీడీ యాక్టు కింద అరెస్టు చేయండి
- ఆపరేషన్ పరివర్తన్ ద్వారా గంజాయి సాగును నియంత్రించి.. ప్రత్యామ్నాయం చూపాలి
- అధికారులకు సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అక్రమ మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) డా.కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అక్రమ మద్యం, గంజాయి తదితర మాదక ద్రవ్యాల రవాణా, వాడకంపై ఉక్కుపాదం మోపేందుకు సరిహద్దు రాష్ట్రాల డీజీపీలతో సమన్వయం చేసుకోండి. వీటితో సంబంధం ఉన్న కింగ్ పిన్‌లను గుర్తించి పీడీ యాక్టు కింద అరెస్టు చేయండి. రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులలో నిఘాను మరింత పటిష్టం చేయండి. ముఖ్యంగా గంజాయి సాగు చేసే గిరిజనులను

మిగతా 2వ పేజీలో ▸



చంద్రబాబుకు అమ్ముడుపోయిన

మంద కృష్ణకు బుద్ధిచెబుతాం

ఏపీ మాదిగ సంఘాల నాయకులు

వర్గీకరణ పేరుతో 30 ఏళ్లుగా మాదిగలకు వెన్నుపోటు పొడుస్తున్న మంద కృష్ణ ఎన్నికలు వచ్చేసరికి చంద్రబాబుకు తమ జాతిని తాకట్టు పెట్టడానికి సిద్ధమవుతాడని మాదిగ సంఘాలు మండిపడ్డాయి. బాబుకు ప్యాకేజీకి అమ్ముడుపోయిన మంద కృష్ణ ఈ నెల 30న గుంటూరు సభకు ఎలా వస్తాడో చూస్తామని హెచ్చరించాయి.

9 లో

ఇంకా చెప్పాలంటే (కార్టూన్ శీర్షిక)



సభ కొనసాగించాలనుకుంటున్నాం సార్! అందుకే మీ స్పీచ్ తీసేశాం!!

కూటమిలో వేరు కుంపట్లు

స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి సీనియర్ నాయకులు

- హిందూపురం ఎంపీగా పరిపూర్ణానందస్వామి పోటీ?
- రాప్తాడు బరిలో నిలిచేందుకు వరదాపురం సూరి సన్నాహాలు
- కదిరిలో కూటమికి దూరంగా విష్ణువర్ధన్‌రెడ్డి వర్గం
- ధర్మవరంలో సత్యకుమార్‌కు పరిటాల శ్రీరామ్‌కు మధ్య దూరం
- పుట్టపర్తిలో కనిపించని 'గ్లాసు', 'కమలం'

2 లో



తూర్పుగోదావరి జిల్లా రామవరంలో టీడీపీ నేత నల్లమిల్లి నివాసం వద్ద టీడీపీ ప్రచార సామగ్రి తగలబెడుతున్న ఆ పార్టీ కార్యకర్తలు

'తూర్పు'లో తలకిందులు!

తెలుగుదేశం 'మూడు' ముక్కలు

మూడు వంతుల సీట్లలో ముసలం

బాబు విధానాలతో విసుగెత్తిన నేతలు

తలో దారీ వెతుక్కుంటున్న తమ్ముళ్లు

2 లో

నమ్మక ద్రోహం.. సైకిల్ దహనం

11 లో

కాపులను విస్మరించిన బీజేపీకి గుణపాఠం

చెబుతాం

కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ విడుదల

రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి తదితర కాపు ఉప కులాలను పూర్తిగా విస్మరించిన బీజేపీకి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కాపు ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఆరు ఎంపీ, పది ఎమ్మెల్యే సీట్లలో ఒక్కటి కూడా కాపులకు ఇవ్వలేదని మండిపడింది. పురందేశ్వరి, చంద్రబాబు కలిసి కాపులకు చేసిన అన్యాయంపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు బహిరంగ లేఖ విడుదల చేసింది.

9 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సంతోషంగా వ్యవసాయం

మాది వ్యవసాయ కుటుంబం. సొంత భూమి లేకపోయినా పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కిమ్మి గ్రామంలో మూడెకరాలు కౌలుకు తీసుకుని మా ఆయన శంకరరావు సాగు చేస్తున్నారు. అందులో వరి, చెరకు పండిస్తున్నాం. ఏటా వ్యవసాయానికి పెట్టుబడి అవసరం ఉంటుంది. అప్పుడు తప్పని సరిగా అప్పు చేయడం.. పంట చేతికొచ్చాక తీర్చేయడం అలవాటు. అయితే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత అప్పు చేయాల్సిన అవసరం తప్పింది. ఇప్పుడు రైతు భరోసా వస్తోంది. మా మామగారికి వృద్ధాప్య పింఛన్ వస్తోంది. మా అత్తకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పు అందింది. మా అత్త చేయి ఆపరేషన్‌కు పైసా ఖర్చు లేకుండా ఆరోగ్య శ్రీ పథకం ద్వారా చేయించుకోగలిగాం. మాకు ఇద్దరు పిల్లలు. వారు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు.



పాప పేరున మూడేళ్లుగా అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వంతున వస్తోంది. మా కుటుంబానికి ఇంత మేలు జరిగిందంటే కారణం ఈ ప్రభుత్వమే. సీఎం జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– అలుజు రజిని, కిమ్మి
(కొలిపాక సింహాచలం, విలేకరి, వీరఘట్టం)

ఇంటి స్థలం ఇచ్చి ఆదుకున్నారు

మాది నిరుపేద కుటుంబం. మాకు ఏ విధమైన ఆస్తులూ లేవు. ఉండటానికి సొంత ఇల్లు కూడా లేని పరిస్థితి. అటువంటి మాకు ఒకటిన్నర సెంటులో ఇంటి స్థలం ఇచ్చి మా కుటుంబాన్ని జగన్ సర్కారు ఆదుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురుకు చెందిన మా కుటుంబానికి నవరత్నాల ద్వారా ఎంతో లబ్ధి చేకూరింది. నా భర్త వెంకటేశ్వరరావు కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రూ.రెండు లక్షలు విలువైన ఇంటి స్థలం ఇచ్చారు. మా అబ్బాయి జగదీశ్‌కు జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.23,850 అందించారు. వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.68 వేలు అందింది. మా కుటుంబం ఈ రోజు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కారణమైన ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.



– యడ్ల దుర్గ, మామిడికుదురు
(యేడిద బాలకృష్ణ, విలేకరి, మామిడికుదురు)

అమ్మాయి చదువు బెంగతీరింది

మా ఆయన విజయనగరం జిల్లా బాడంగి మండలం గూడెపువలస గ్రామంలో చిల్లర వ్యాపారం చేసేవారు. ఆయన సంపాదనతోనే మా కుటుంబం గడిచేది. అనుకోకుండా గతేడాదే ఆయన కన్ను మూయడంతో అక్కడ వ్యాపారాన్ని మూసేసి బాడంగిలో టీ కొట్టు పెట్టుకుని ఒక్కగానొక్క కుమార్తెను చదివించుకుంటున్నా. వచ్చిన ఆదాయంతో మా పాపకు ఉన్నత చదువులు అందించగలనా.. అన్న భయం ఉండేది. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం రావడంతో ఆ భయం తీరిపోయింది. మా అమ్మాయి సాహితి ప్రస్తుతం బాడంగిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమెకు అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు అందుతోంది. దీనివల్ల అమ్మాయి చదువు బెంగ తీరింది. నాకు వైఎస్సార్ పింఛన్ కానుక ప్రతి నెలా ఒకటో తేదీనే అందుతోంది. వైఎస్సార్



ఆసరా ద్వారా ఇప్పటి వరకూ రూ.90 వేలు, సున్నా వడ్డీ కింద రూ.12 వేలు అందింది. ప్రస్తుతానికి మేము ఆర్థికంగా కుదుటపడగలిగాం. ఇందుకు కారణమైన జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– బండి సంతోషి, గూడెపువలస
(గొట్టాపు కృష్ణమూర్తి, విలేకరి, బాడంగి)

తూర్పులో తలకిందులు!

తలో దారీ వెతుక్కుంటున్న కూటమి నేతలు.. పార్టీల శ్రేణుల్లో నిస్తేజం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రజల్లో ఆదరణ కోల్పోయిన తెలుగుదేశం పార్టీ తిరిగి జవసత్వాలు నిలుపుకునేందుకు జనసేన, బీజేపీతో కలిసి కట్టిన కూటమితో మొదటికే మోసం వచ్చేలా ఉందని తెలుగు తమ్ముళ్లు కలవరపడుతున్నారు. ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన దగ్గర నుంచి నియోజకవర్గాల కేటాయింపు వరకూ చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తెలుగుదేశం పార్టీ పునాదులు కదిలిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 21 నియోజకవర్గాల్లో దాదాపు మూడు వంతుల నియోజకవర్గాల్లో టీడీపీ మూడు ముక్కలైపోయింది. ఆ పార్టీ నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు తలో దారీ వెతుక్కుంటున్నారు. అభ్యర్థుల ఎంపిక, కూటమిలో ఉన్న బీజేపీ, జనసేనలకు సీట్ల కేటాయింపు వంటి పరిణామాలు పార్టీ నేతల మధ్య మరింత అగ్గి రాజేశాయి. వైఎస్సార్ సీపీ ఆవిర్భావానికి ముందు వరకూ టీడీపీకి పట్టుగొమ్మగా నిలిచిన ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కోవడానికి సైకిల్ పార్టీ తలకిందులుగా తపస్సు చేస్తోంది. తొలి నుంచీ నియోజవకర్గాల్లో పార్టీని నడిపిస్తున్న నేతలను విస్మరించి, పైసలున్న వారికే సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వడంతో నేతల మధ్య వర్గ వైషమ్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వీటిని చక్కదిద్దలేక అధిష్టానం చేతులెత్తేయడంతో పార్టీ శ్రేణులు డోలాయమానంలో పడ్డాయి. ద్వితీయ శ్రేణి నాయకత్వం చెల్లాచెదురు కావడంతో క్షేత్ర స్థాయిలో టీడీపీ పేకమేడలా కూలిపోతోంది. రాజకీయాల్లో తూర్పు సెంటిమెంట్‌ను బలంగా విశ్వసించే తుని మొదలు గోదావరికి అవతల ఒడ్డున కొవ్వూరు వరకూ ఏ అసెంబ్లీ సెగ్మెంట్ చూసినా వర్గ వైషమ్యాలతో కొట్టుమిట్టాడుతున్న తెలుగు దేశం పార్టీనే కనిపిస్తోంది.



- కొవ్వూరులో ఉమ్మడి అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు బరిలో ఉంటే.. పోటీగా అదే పార్టీ నుంచి మాజీ మంత్రి, టీడీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ బస్తీ మే సవాల్ అంటున్నారు. సీటు ఇవ్వలేదనే ఆగ్రహంతో ఉన్న జవహర్‌కు చంద్రబాబు తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి కట్టబెట్టారు. అంతటి పదవి జవహర్‌కు ఇవ్వడం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన పెండ్యాల అచ్చిబాబు వర్గానికి సుతరామూ ఇష్టం లేదు. ఈ రెండు గ్రూపులతో ద్వితీయ శ్రేణి నేతలు తలోదారిలో పయనిస్తుండటంతో పార్టీ ముక్కలైంది.
- ఇదే జిల్లాలో జనసేనకు కేటాయించిన నిడదవోలులోనూ టీడీపీ ముక్కలైంది. ఇక్కడి నుంచి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గ టీడీపీలో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కుందుల సత్యనారాయణ గ్రూపులు నడుస్తున్నాయి. మొదట్లో బెట్టు చేసిన శేషారావు అనంతర పరిణామాల్లో దుర్గేష్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. శేషారావుతో తొలి నుంచి ఉన్న వైరుధ్యంతో కుందుల సత్యనారాయణ ఎడముఖంపెడముఖంగా ఉంటున్నారు. దుర్గేష్‌కు మాజీ ఎమ్మెల్యే శేషారావు సహకరిస్తుండటాన్ని కుందుల వ్యతిరేకిస్తున్నారు. శేషారావును నమ్ముకుంటే దుర్గేష్‌ను నట్టేట ముంచేస్తారని కుందుల వర్గీయులు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు.

- పిఠాపురంలో ఉమ్మడి అభ్యర్థిగా పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ నెల 30న ప్రచారం కూడా ప్రారంభిస్తామని చెప్పుకున్నారు. ఆయనకు మద్దతు ఇచ్చేది లేదన్న టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ తరువాత మాట మార్చి, లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించే బాధ్యత తీసుకుంటానని ప్రకటించడంతో పార్టీ నేతలను విస్మయానికి గురి చేసింది. తదనంతరం పిఠాపురంలో తనను కాదని నిర్ణయం తీసుకోవద్దనే హెచ్చరికలతో తెలుగు తమ్ముళ్లు దూరమై మరో వర్గంగా విడిపోయారు. ఇలా ఉమ్మడి జిల్లాలో అనేకచోట్ల టీడీపీ మూడు ముక్కలైపోవడంతో పార్టీలో నిస్తేజం ఆవరించింది.

- గోపాలపురం నియోజకవర్గంలోనూ వర్గపోరు కనిపిస్తోంది. ఉమ్మడి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజుకు వ్యతిరేకంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గం పని చేస్తోంది. 'మద్దిపాటి వద్దు.. మరెవరైనా ముద్దు' అనే నినాదంతో బాపిరాజు వర్గం మద్దిపాటిని మార్చకుంటే నాలుగు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిస్తోంది. ఫలితంగా ఈ నియోజకవర్గంలో టీడీపీ రెండుగా చీలిపోయింది. సర్వేలో మద్దిపాటి గ్రాఫ్ పడిపోయిందని, అభ్యర్థిని మారుస్తున్నట్లు చంద్రబాబు చెప్పి చివరిలో మోసం చేశారని పేర్కొంటూ వ్యతిరేక వర్గం వేరుకుంపటి పెట్టింది.
- కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం సీటును పొత్తులో భాగంగా జనసేనకే కేటాయిస్తారని ఆది నుంచి ఆ పార్టీ కో–ఆర్డినేటర్ శెట్టిబత్తుల రాజబాబు ఆశించి భంగపడ్డారు. చివరకు దీనిని టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు కేటాయించారు. టీడీపీలో మొదటి నుంచి ఈ సీటు ఆశిస్తున్న పరమట శ్యామ్ రేసులో ఉన్నా ఫలితం దక్కలేదు. పదేళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నా కనీస గుర్తింపూ లేదంటూ శ్యామ్ వర్గం తిరుగుబాటు జెండా ఎగురవేసి, ఆనందరావు ఓటమే ధ్యేయంగా పని చేస్తామని చెబుతోంది.

- అనపర్తిని బీజేపీకి కేటాయించిన నేపథ్యంలో టీడీపీలో అసమ్మతి సెగ రాజుకుంది. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి మొదటి జాబితాలో టీడీపీ నుంచి సీటు ప్రకటించారు. అనంతర పరిణామాల్లో చివరకు బీజేపీకి చెందిన శివరామకృష్ణరాజు పేరు ప్రకటించారు. దీంతో చంద్రబాబుపై నియోజక వర్గ తెలుగు తమ్ముళ్లు నిప్పులు చెరుగుతూ శాపనార్థాలు పెడుతున్నారు. నల్లమిల్లితో పొసగని పెండ్యాల నళినీకాంత్ వర్గం బీజేపీ అభ్యర్థి శివరామకృష్ణ రాజును బలపరుస్తూ, ప్రత్యర్థి వర్గాన్ని దెబ్బ తీసేందుకు యత్నిస్తోంది. దీంతో అనపర్తిలోనూ టీడీపీ నిట్టనిలువునా చీలిపోయినట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

- చంద్రబాబు ఆదేశాలతో రామచంద్రపురంలో మకాం పెట్టి, సీటుపై గంపెడాశలతో దాదాపు రెండేళ్లుగా టీడీపీకి సేవ చేస్తున్న బీసీ నాయకుడు, శాసన మండలి మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యానికి చివరకు మొండిచేయి చూపించారు. అకస్మాత్తుగా టీడీపీ తీర్థం పుచ్చుకున్న వాసంశెట్టి సుభాష్‌కు కేవలం ధన బలం ఉందనే కారణంతో ఈ సీటు ఇచ్చారు. దీంతో సుబ్రహ్మణ్యం వర్గం రగిలిపోతోంది. ఇక్కడ కూడా పార్టీలోని ముఖ్య నేతలంతా రెండు వర్గాలుగా విడిపోయారు.
- కాకినాడ రూరల్‌లోనూ టీడీపీ ముక్కలైంది. ఈ సీటును జనసేనకు కేటాయించారు. టీడీపీలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఆమె భర్త సత్యనారాయణ ఒక వర్గంగా, జెడ్పీటీసీ పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసుదాసు మరో వర్గంగా, పెంకే శ్రీనివాసబాబా మరో వర్గంగా ఉండటంతో ఇక్కడ కూడా టీడీపీ 3 వర్గాలుగా మారింది.

- తునిలో యనమల రామకృష్ణుడు సోదర ద్వయం మధ్య తలెత్తిన తీవ్ర విభేదాలతో టీడీపీ రెండుగా విడిపోయింది. ఇక్కడ సీటు ఆశించి భంగపడిన కృష్ణుడిని అన్న రామకృష్ణుడు, ఆయన కుమార్తె, ప్రస్తుత అభ్యర్థి దివ్య దూరం పెట్టారు. దీంతో రగిలిన వైషమ్యాలు కాస్తా పార్టీ నిట్టనిలువుగా చీలిపోయే దిశగా తీసుకెళ్తున్నాయి.

- కాకినాడ సిటీ సీటును మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు కేటాయించారు. ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న మాజీ మేయర్ సుంకర పావని వర్గం దూరంగా ఉంది. కొండబాబు కోసం పని చేసేది లేదని తెగేసి చెబుతోంది. మరోవైపు ఈ సీటు ఆశించిన కొండబాబు అన్న సత్యనారాయణ కుటుంబమూ పైకి సోదరుడితో కలిసి ఉన్నట్టు కనిపిస్తున్నా తెర వెనుక గోతులు తీస్తోంది.

ఎండల మంటలే!

▶ మొదటి పేజీ తరువాయి

అధికంగా వడగాడ్పులు వీయవచ్చని కూడా అంచనా వేసింది. పరిస్థితులు కూడా ఇందుకు అనుగుణంగానే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం (మార్చి చివరివారంలో) ఉండాల్సిన సాధారణ ఉష్ణోగ్రతల కంటే రెండు, మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి.

చాలా చోట్ల 40 డిగ్రీలకుపైనే నమోదు

దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ గణాంకాలు చెప్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ భారత రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌లలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తీవ్రమవుతున్న ఎండల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రజలకు హెచ్చరికలు, మార్గదర్శకాలు జారీ చేసింది. తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించాయి. ఉత్తర భారతంలోనూ పలు ప్రాంతాల్లో ఎండలు మండుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సాధారణం కంటే మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆరుబయట పనిచేసేవారు, ఏదైనా పని కోసం బయటికి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని చెప్తున్నారు. తరచూ నీళ్లు తాగాలని, డీహైడ్రేషన్ తలెత్తకుండా చూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. ఇంకా వైద్యులు సూచనలు ఇవీ..

- బయటికి వెళ్లేవారు తెలుపు, లేత రంగుల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి. తలపై టోపీ పెట్టుకోవాలి. లేదా రుమాలు చుట్టుకోవాలి.
- నీళ్లు, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగుతూ ఉండాలి.
- వేడిలో అధికంగా పనిచేయకూడదు. ఇబ్బందిగా అనిపిస్తే చల్లని ప్రదేశంలో సేదతీరాలి.
- అధిక వేడి వల్ల ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటివి తింటే డయేరియాకు గురయ్యే ప్రమాదం ఉంటుంది.
- పిల్లలు, గర్భిణులు, వృద్ధులు మధ్యాహ్నం పూట బయటికి వెళ్లొద్దు.

'ఉపాధి' కూలీల రోజు వేతనం పెంపు

- ప్రస్తుతం రూ.272 చెల్లింపు... ఏప్రిల్ నుంచి రూ.300
- దాదాపు 46లక్షల పేద కుటుంబాలకు లబ్ధి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కూలీలకు చెల్లించే రోజువారీ వేతనాన్ని ప్రభుత్వం భారీగా పెంచింది. ప్రస్తుతం రూ.272 చొప్పున అందే రోజువారీ గరిష్ట వేతనాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి రూ.300కు పెంచింది. మొత్తంగా రోజు వారీ గరిష్ట కూలీ రేటును రూ.28 పెంచడం గమనార్హం. రాష్ట్రంలో ఏటా గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉండే దాదాపు 46 లక్షలకు పైగా పేద కుటుంబాలు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకం పనుల మీద ఆధారపడుతుంటాయి. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబం ఏడాదికి గరిష్టంగా వంద రోజులపాటు పనులు చేసుకునే వెసులుబాటు



ఉన్న నేపథ్యంలో ఈ తాజా పెంపు నిర్ణయం ద్వారా ఒక్కొక్క కుటుంబ గరిష్టంగా రూ.2800 దాకా అదనపు లబ్ధి పొందే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

నిఘా పెంచండి

▶ మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్ పరివర్తన్ కింద ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించండి. ఎన్నికల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం వచ్చే అవకాశాలున్నందున సరిహద్దులతో పాటు రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల్లో నిఘాను అధికం చేసి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మాదక ద్రవ్యాల సేవనం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోండి' అని ఆదేశించారు. ఎస్ఈబీ కమిషనర్ యం.రవిప్రకాశ్ మాట్లాడుతూ.. గంజాయికి సంబంధించి 90 శాతం ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా నుంచి.. 10 శాతం కోరాపుట్ నుంచి ఏపీలోకి వస్తోందని తెలిపారు. ఒడిశా డీజీపీ సమన్వయంతో గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు. గంజాయి రవాణాకు సంబంధించి 25 మంది కింగ్ పిన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.4.38 కోట్ల విలువైన అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ.. మద్యం సరఫరాకు సంబంధించి రాష్ట్రంలోని ప్రతి డిస్టిలరీకి ఒక సహాయ కమిషనర్ స్థాయి అధికారిని ఇన్‌చార్జ్‌గా పెట్టామని చెప్పారు. మద్యం రవాణా చేసే వాహనాలను జీపీఎస్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అధికారులు దేవకుమార్, వాసుదేవరావు, రజత్ భార్గవ, డా.మల్లిఖార్జున, ఢిల్లీ రావు, రవిశంకర్ అయ్యన్నార్, కాంతిరాణా టాటా, విజయ సునీత, రవి సుభాష్, తుహిన్ సిన్హా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించొద్దు

రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కేఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. 'నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయండి. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు.. ప్రతిరోజూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలి. తాగునీటి సరఫరా విధానాన్ని పర్యవేక్షించేందుకు రూపొందించిన యాప్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి' అని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. 9 జిల్లాల్లో తాగునీటికి ఇబ్బంది లేదని కలెక్టర్లు నివేదించినట్లు చెప్పారు. మిగిలిన 17 జిల్లాల్లో ఇబ్బందులను అధిగమించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపేందుకు అవసరమైన నీటిని కాలువల ద్వారా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు రూపొందించిన యాప్‌ను శుక్రవారం అందుబాటులోకి తెస్తామన్నారు. గ్రామ స్థాయిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంబంధిత ఇంజనీర్ ఆమోదంతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా డిమాండ్‌ను యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా కలెక్టర్ ద్వారా పంపిస్తే ఆమోదిస్తామని తెలిపారు. సమావేశంలో ఉన్నతాధికారులు ఎస్ఎస్ రావత్, కేవీవీ సత్యనారాయణ, నారాయణరెడ్డి, జాన్ సత్యరాజ్, బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

జీసస్ జీవితమే మానవాళికి గొప్ప సందేశం

- మానవాళి కోసం కరుణామయుని మహాత్యాగమే గుడ్ ఫ్రైడే సందేశం
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మానవాళి కోసం కరుణామయుని మహాత్యాగమే గుడ్ ఫ్రైడే సందేశం అని, జీసస్ జీవితమే మానవాళికి గొప్ప సందేశం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభిప్రాయపడ్డారు. ఏసు ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రైడే రోజు, ఆ తరువాత ఆయన పునరుజ్జీవించిన ఈస్టర్ సండే రోజు... ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపుతిప్పిన ఘట్టాలు అని సీఎం జగన్ పేర్కొన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం... ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా జీసస్ లోకానికి ఇచ్చిన సందేశాలు అని ఆయన తెలిపారు.



కూటమిలో వేరు కుంపట్లు

స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి సీనియర్లు?


సాక్షి, పుట్టపర్తి: జెండాలు జత కట్టాయి.. నేతలు కూటమిగా ఏర్పడ్డారు.. సీట్లు పంచుకున్నారు.. అభ్యర్థులను ఖరారుచేశారు.. కానీ, అసలైనది అయిన సహకారం వీరి మధ్య కరువైంది. ప్రధానంగా మిత్రపక్షాల నుంచి టీడీపీకి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇదే అదనుగా బీజేపీకి చెక్ పెట్టాలని టీడీపీ నేతలు స్కెచ్ వేస్తున్నారు. మరోవైపు.. తమకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని జనసేన కార్యకర్తలూ అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా పార్టీల పెద్దలు కలుసుకునేందుకు మాత్రమే కూటమి వేదికగా మారినట్లు స్పష్టమవుతుండగా క్షేత్రస్థాయిలో మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. కూటమిలో టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్లు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగేందుకు ఎవరికి వారు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలోని హిందూపురం పార్లమెంటు సీటుతో పాటు ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడులో వేరు కుంపట్లు ఉంటాయని చెబుతున్నారు. మూడు పార్టీల నాయకుల మధ్య సఖ్యత లేకపోవడంతో ఎవరికి వారుగా పోటీచేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రాప్తాడు నుంచి వరదాపురం సూరి?




బీజేపీ తరఫున ధర్మవరం టికెట్ ఆశించిన వరదాపురం సూరి (గోనుగుంట్ల సూర్యనారాయణ)కి కూడా నిరాశే ఎదురైంది. బీజేపీ అధిష్టానం ధర్మవరం టికెట్‌ను వై. సత్యకుమార్‌కు ఖరారు చేసింది. దీని వెనుక పరిటాల శ్రీరామ్ హస్తం ఉందని భావిస్తున్న సూరి తనకు టికెట్ రాకుండా టీడీపీ అధిష్టానం వద్ద అడ్డుపుల్లలు వేసిన పరిటాల కుటుంబ సభ్యులను ఓడించేందుకు ఆయన కంకణం కట్టుకున్నారు. వచ్చే ఎన్నికల్లో రాప్తాడు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి.. పరిటాల సునీతను ఓడించేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

'స్వతంత్రం'గా పరిపూర్ణానందస్వామి..



హిందూపురం ఎంపీగా బీజేపీ తరఫున పోటీచేస్తానని రెండు నెలలుగా పరిపూర్ణానందస్వామి ప్రచారం చేసుకున్నారు. అయితే, కూటమిలో భాగంగా టీడీపీ నేత బీకే పార్థసారథికి ఆ ఎంపీ టికెట్ ఖరారుచేశారు. కానీ, పరిపూర్ణానందస్వామి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని.. కార్యకర్తలు అందరూ సహకరించాలని ఆయన కోరుతున్నారు. టీడీపీ–జనసేన తనను మోసం చేశాయని ఆయన మండిపడుతున్నారు.

ప్రచారానికి శ్రీరామ్ దూరం?



ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ తరఫున ప్రచారం చేసేందుకు సుముఖంగా లేరని తెలుస్తోంది. రాప్తాడులో పరిటాల సునీత గెలుపు కోసం బిజీబిజీగా గడపాల్సి ఉందని.. ఇతర పార్టీ నేతల గెలుపు కోసం తానెందుకు సమయం వృథా చేసుకోవాలని తన అనుచరుల వద్ద శ్రీరామ్ చర్చించినట్లు సమాచారం. అలాగే.. జనసేన నేత చిలకం మధుసూదన్‌రెడ్డి కూడా సత్యకుమార్‌కు మద్దతిచ్చే పరిస్థితి కనిపించలేదు.

కదిరిలో అంటీముట్టనట్లుగా విష్ణు..



ఇక కూటమి నిర్ణయాలు తనను నిరాశపరిచాయని కదిరి బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరుల వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో.. రానున్న ఎన్నికల్లో కదిరిలో టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం చేయకపోవచ్చని సమాచారం. కర్ణాటక రాజధాని బెంగళూరు వెళ్లి.. అక్కడ బీజేపీ పార్లమెంటు అభ్యర్థుల తరఫున ప్రచారానికి ఆయన ప్లాన్ చేసుకుంటున్నట్లు చెబుతున్నారు.

పుట్టపర్తిలో టీడీపీకి సహాయ నిరాకరణ..

కలిసి పోటీచేయాలన్న లక్ష్యంతో టీడీపీ–బీజేపీ –జనసేన కూటమిగా ఏర్పడినా.. పుట్టపర్తిలో మాత్రం ఆ దిశగా ఆయా నాయకులు ముందుకెళ్లడంలేదు. అక్కడ జనసేన నాయకుల అడ్రస్‌లేదు. బీజేపీ నేతలు ఎక్కడ ఉన్నారో కనిపించని పరిస్థితి. కేవలం టీడీపీ అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. అనంతపురం నుంచి ఉద్యోగం మాదిరిగా ఉదయం వచ్చి సాయంత్రం వెళ్తున్నట్లు 'తమ్ముళ్లు' చెబుతున్నారు.



రజత పతక విజేతలకు
డీజీపీ అభినందన

సాక్షి, అమరావతి: అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాలు సాధించిన రాష్ట్ర పోలీసు అధికారులు ఎస్.బి.వి. సుధాకర్, పి.వి. మారుతిరావులను డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి గురువారం అభినందించారు. హైదరాబాద్‌లో ఈనెల 17 నుంచి 23 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో 18 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు, కేంద్ర పోలీసు బలగాలకు చెందిన మొత్తం 499మంది పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన సీఐడీ డీఎస్పీ ఎస్.బి.వి. సుధాకర్, డీఎస్పీ పి.వి.మారుతిరావు రజత పతకాలు సాధించారు.



టీడీపీలో ఇద్దరికీ నో టికెట్

- బీజేపీ నుంచి అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా పాంగి రాజారావు
- కష్టపడ్డ వారిని విస్మరించారంటూ చంద్రబాబుపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం
- ఇటీవలే అబ్రహం ఫైర్.. అదే రూట్లో దొన్నుదొర

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): చంద్రబాబు క్షుద్ర రాజకీయంపై అరకు అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణులు విస్తుపోతున్నారు. ఇక్కడ ఇద్దరు ఆశావహులను నమ్మించి ప్రోత్సహించి చివరకు మొండిచేయి చూపడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా జనవరి 20నే చంద్రబాబు సియారి దొన్నుదొర పేరును ప్రకటించారు. దీంతో పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లేదంటూ దివంగత మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుమారుడు సివేరి అబ్రహం ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తానని అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేశారు. అనుచరులతో ఆయన ప్రచారమూ ప్రారంభించారు. ఫలితంగా పార్టీ వర్గాలుగా విడిపోయింది. బాబు ప్రకటనతో సియారి దొన్నుదొర కూడా ప్రచారం ప్రారంభించిన తరుణంలో బీజేపీ తన అభ్యర్థిగా పాంగి రాజారావు పేరును ప్రకటించింది. దీంతో దొన్నుదొరతోపాటు టీడీపీ కార్యకర్తలు ఖిన్నులయ్యారు. చంద్రబాబు క్షుద్ర రాజకీయాలకు పార్టీని బలిపీఠం ఎక్కిస్తున్నారని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తాడోపేడో తేల్చుకునేందుకు దొన్నుదొర విజయవాడ బయలుదేరారు. ఇప్పుడు సివేరి అబ్రహంతోపాటు సియారి దొన్నుదొర కూడా రెబల్‌గా బరిలో నిలిచే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. కార్యకర్తలు చెదిరిపోయే పరిస్థితులు లేకపోలేదని విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం చేస్తున్న టీడీపీ రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం చంద్రబాబు తనకు చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరిస్తున్నారు.





ఆయన తాను సృష్టించిన ప్రతి దానిని ఉత్తమరీతిలో చేశాడు.
మరియు మానవ సృష్టిని మట్టితో ప్రారంభించాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 29 మార్చి 2024

మంచు ఎడారిలో నిరసన మంట

ఆమిర్‌ఖాన్ '3 ఇడియట్స్' సినిమా చాలామందికి తెలుసు. కానీ, అందులో ఆమిర్ పోషించిన ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్రకు స్ఫూర్తినిచ్చిన ఇంజనీర్, విద్యాసంస్కరణవేత్త సోనమ్ వాంగ్‌ఛుక్ గురించి బహుశా కొందరికే తెలుసుంటుంది. ఇటీవల చేసిన నిరవధిక నిరాహార దీక్ష పుణ్యమా అని ఆయన పేరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లోకెక్కింది. ప్రపంచమంతటా మారుమోగిపోయింది. హిమాలయ ప్రాంతంలోని లద్దాఖ్‌లో శరీరం గడ్డకట్టే మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో ఆయన సాగించిన నిరశన ఉద్యమానికి మద్దతుగా వేలాది జనం ముందుకు రావడం విశేషం. 21 రోజుల అనంతరం మంగళవారం ఆయన నిరాహార దీక్ష ముగిసినప్పటికీ, లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి నుంచి అలవిమీరిన అభివృద్ధితో అపాయంలో పడుతున్న ఆ ప్రాంత జీవావరణం దాకా అనేక అంశాలు చర్చలోకి రాగలిగాయి. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లేకున్నా, ప్రస్తుతానికైతే లద్దాఖ్ ప్రజలు తమ డిమాండ్లను పాలకుల ముందు మరోసారి ఉంచి, ఒత్తిడి తేగలిగారు.

నిజానికి, దాదాపు 3 లక్షల జనాభా గల లద్దాఖ్‌లో మొత్తం 8 తెగల వాళ్ళుంటారు. 2019 ఆగస్ట్ 5న మునుపటి జమ్మూ – కశ్మీర్ నుంచి విడదీసి, కేంద్రపాలిత ప్రాంతం చేశారు. భారత ఈశాన్య సరిహద్దు కొసన ఉండే ఈ ప్రాంత ప్రజలు లద్దాఖ్‌కు పూర్తి రాష్ట్రప్రతిపత్తి ఇవ్వాలనీ, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనీ, స్థానికులకు ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రత్యేకంగా ఓ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలనీ, తమ ప్రాంతానికి ఇద్దరు ఎంపీలు ఉండాలనీ డిమాండ్ చేస్తున్నారు. 2020 నుంచి వారు చేస్తున్న నిరసనలకు పరాకాష్ఠ – తాజా ఉద్యమం. లద్దాఖ్ ప్రాంతపు ఉన్నత ప్రాతినిధ్య సంస్థ, అలాగే కార్గిల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 'కార్గిల్ డెమోక్రాటిక్ అలయన్స్' (కేడీయే) మద్దతుతో నెలన్నర క్రితమే ఫిబ్రవరి మొదట్లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీలో కూర్చొని లద్దాఖ్‌ను ఆడించాలనుకుంటే కుదరదంటూ ప్రజల్లోని అసమ్మతిని ఆ ప్రదర్శన తేటతెల్లం చేసింది. కీలకమైన విధాన నిర్ణయాలలో తమ స్థానిక స్వరాలకు చోటులేకపోవడమే ఈ నిరసనలకు ప్రధాన ప్రేరకమైంది.

ఒకప్పుడు నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జమ్మూ-కశ్మీర్ విధాన పరిషత్‌కు స్పీకర్, ఎంపీ... ఇంతమంది ప్రజా ప్రతినిధులు ఆ ప్రాంతానికి ఉండేవారు. అలాంటిది ప్రస్తుతం అక్కడంతా లెఫ్టినెంట్ గవర్నర్ నేతృత్వంలోని ప్రభుత్వ అధికార గణపాలన. లద్దాఖ్‌కు మిగిలింది ఇప్పుడు పోర్ట్ ఫోలియో లేని ఒకే ఒక్క ఎంపీ. జిల్లాకు ఒకటి వంతున రెండు స్వతంత్ర పర్వత ప్రాంత అభివృద్ధి మండళ్ళు ఉన్నప్పటికీ, అధికారాల పంపిణీపై స్పష్టత లేదు. ఇక, ఆర్టికల్ 370 రద్దు అనంతరం తీసుకున్న ప్రశ్నార్థమైన పాలనాపరమైన నిర్ణయాలు అనేకం. దానికి తోడు ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో జనం గగ్గోలు పెడుతున్నారు. భూ హక్కులలో మార్పులు, అలాగే స్థానిక ప్రయోజనాలకు విరుద్ధమైన పారిశ్రామిక విధాన రూపకల్పన లాంటివి ప్రజాగ్రహాన్ని పెంచాయి. లద్దాఖీ ఉద్యమకారుడు వాంగ్‌ఛుక్ దీక్షకు అంతటి స్పందన రావడానికి అదే కారణం.

సముద్ర మట్టానికి ఎంతో ఎత్తున దాదాపు మంచు ఎడారిలా జనావాసాలు తక్కువగా ఉండే లద్దాఖ్ పర్యావరణ రీత్యా సున్నిత ప్రాంతం. అక్కడ అభివృద్ధి పేరిట ప్రభుత్వం చేపట్టిన అజెండాపైనా విమర్శలున్నాయి. పర్యాటకం ఆ ప్రాంత ఆర్థికవ్యవస్థలో కీలకమే కానీ, దాన్ని అంతకు అంత పెంచాలని పర్యావరణానికి హాని కలిగిస్తే మొదటికే మోసం. లే ప్రాంతంలో మెగా ఎయిర్‌పోర్ట్, ఛంగ్‌థాంగ్ బయళ్ళలో 20 వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో సోలార్ పార్క్ లాంటి ప్రణాళికలపై ప్రభుత్వం పునరాలోచించాలని వాంగ్‌ఛుక్ లాంటివారు కోరుతున్నది అందుకే. పర్యావరణానికీ, స్థానికుల ప్రయోజనాలకూ అనుగుణంగానే అభివృద్ధి ఉంటే మేలు. లద్దాఖ్ సాంఘిక, సాంస్కృతిక ప్రత్యేకతల్ని పరిరక్షించేలా ఆరో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌నూ పాలకులు గుర్తించాలి. లద్దాఖ్, కార్గిల్‌లు రెండూ ఒక కేంద్రపాలిత ప్రాంతంగా, ఒకే ఎంపీ ప్రాతినిధ్యానికి తగ్గిపోవడమూ చిక్కే. ఈ రెండు విభిన్న ప్రాంతాలకు చెరొక పార్లమెంటరీ స్థానంపై ఆలోచించాలి.

చైనాతో సరిహద్దులో నెలకొన్న లద్దాఖ్ కీలకమైనది. అందులోనూ హిమాలయ ప్రాంతంలో తన పరిధిని విస్తరించుకోవాలని డ్రాగన్ తహతహలాడుతున్న వేళ వ్యూహాత్మకంగానూ విలువైనది. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకొనే భయాలున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం మరింత జాగరూకతతో వ్యవహరించాలి. లద్దాఖ్ ప్రజల నమ్మకాన్ని చూరగొని, వారిని కలుపుకొని ముందుకు సాగడం ముఖ్యం. గతంలో శ్రీనగర్ నుంచి, ఇప్పుడేమో ఢిల్లీ నుంచి పాలిస్తున్నారే తప్ప స్వపరిపాలన సాగనివ్వడం లేదనే భావనను వారి నుంచి పోగొట్టడం ముఖ్యం.

ఈ ఏడాది జనవరి మొదట్లో కేంద్ర హోమ్ శాఖ ఉన్నతాధికార సంఘాన్ని (హెచ్‌పీసీ) వేసింది. గత శనివారంతో కలిపి 3 భేటీలు జరిగినా పురోగతి లేదు. హెచ్‌పీసీ హోమ్ మంత్రి లేకపోగా, తాజా భేటీకి సహాయ మంత్రి సైతం గైర్హాజరు కావడంతో సమస్యలు పరిష్కరించేందుకు సర్కారు వారికి చిత్తశుద్ధి ఉందా అన్నది అనుమానాలు రేపుతోంది. గత నాలుగేళ్ళుగా ప్రభుత్వ పాలనలోని పలు వైఫల్యాలను సహించి, భరించిన లద్దాఖ్ ప్రజలు గాంధేయ మార్గంలో శాంతియుతంగా తమ నిరసన తెలిపారు. స్థానిక ఆకాంక్షలకు తగ్గట్టు న్యాయబద్ధమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. ఢిల్లీ పాలకులు సైతం ప్రజాభీష్టాన్ని గుర్తించి సరైన నిర్ణయం తీసుకోవడం మేలు. లద్దాఖ్ ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని మాటల్లోనే కాదు... చేతల్లోనూ చూపడం అవసరం. లేదంటే, ముమ్ముందు వాంగ్‌ఛుక్ దీక్షల లాంటివి మరిన్ని తలెత్తక తప్పదు.

లోక కల్యాణమే హితంగా...



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

రామకృష్ణ మిషన్ అధ్యక్షులు, అత్యంత సీనియర్ సాధువు అయిన స్వామి స్మరణానంద తన 94వ యేట మార్చ్ 26న పరమపదించడం చాలా మందిని విషాదంలోకి నెట్టింది. సంపూర్ణ జీవితం గడిపిన స్మరణానంద... రామకృష్ణ పరమహంస, శారదామాత, స్వామి వివేకానంద ఆలోచనల వ్యాప్తికి తమ జీవితాన్ని అంకితం చేశారు. భారతదేశ ఆధ్యాత్మిక స్ఫృహను పెంచుతూనే... విద్యాభివృద్ధికీ, గ్రామీణాభివృద్ధికీ రామకృష్ణ మిషన్ చేస్తున్న కృషి మనందరికీ స్ఫూర్తిదాయకం. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అనేక దశలలో, మన మాతృభూమిని ఎందరో సాధువులు ఆశీర్వదించారు. 'ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ' అనే సిద్ధాంతానికి స్వామి స్మరణానంద జీవితం చెరగని ఉదాహరణ.

లోక్ సభ ఎన్నికల ఘన పండుగ హడావిడిలో ఓ వార్త మనసులో కొన్ని క్షణాల పాటు అలజడిని సృష్టించింది. భారత దేశ ఆధ్యాత్మిక చింతనలో అగ్రగణ్యులైన శ్రీమత్ స్వామి స్మరణానంద జీ మహారాజ్ గతించడం (మార్చ్ 26) వ్యక్తిగత నష్టం లాంటిది. కొన్ని సంవత్సరాల క్రితం, స్వామి ఆత్మస్థానంద జీ మరణం, ఇప్పుడు స్వామి స్మరణానంద శాశ్వతంగా నిష్క్రమించడం చాలా మందిని విషాదంలోకి నెట్టింది. కోట్లాది మంది భక్తులు, సాధువులు, రామకృష్ణ మఠం, మిషన్ అనుచరుల మాదిరిగానే నా హృదయం కూడా బాధగా ఉంది.

ఈ నెల ప్రారంభంలో బెంగాల్ పర్యటనకు వెళ్లినప్పుడు స్వామి స్మరణానంద జీ ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు ఆస్పత్రికి వెళ్లాను. స్వామి ఆత్మస్థానంద జీ మాదిరిగానే, స్వామి స్మరణానంద జీ... ఆచార్య రామకృష్ణ పరమహంస, మాతా శారద మరియు స్వామి వివేకానంద ఆలోచనల ప్రపంచవ్యాప్తికి తమ జీవితాన్ని అంకితం చేశారు. ఈ వ్యాసం రాస్తున్నప్పుడు ఆయనతో జరిపిన సమావేశాలు, ఆయనతో నా సంభాషణలు, ఆ జ్ఞాపకాలు నా మదిలో సజీవంగా కదలాడుతున్నాయి.

2020 జనవరిలో బేలూరు మఠంలో ఉన్న సమయంలో స్వామి వివేకానంద గదిలో కూర్చొని ధ్యానం చేశాను. ఆ పర్యటనలో నేను స్వామి స్మరణానందతో స్వామి ఆత్మస్థానంద గురించి చాలాసేపు మాట్లాడాను.

రామకృష్ణ మిషన్‌తో, బేలూరు మఠంతో నాకు ఎంత సన్నిహిత సంబంధం ఉందో మీకు తెలుసు! ఒక ఆధ్యాత్మిక సాధకుడిగా, గత ఐదు దశాబ్దాలుగా నేను వివిధ సాధువులను, మహాత్ములను కలిశాను, అనేక ప్రదేశాలకు వెళ్ళాను. రామకృష్ణ మఠంలో కూడా ఆధ్యాత్మికతకు తమ జీవితాలను అంకితం చేసిన సాధువులతో నాకు పరిచయం ఏర్పడింది. వారిలో స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వంటి ప్రముఖులు ఉన్నారు. వారి పవిత్రమైన ఆలోచనలు, జ్ఞానం నా మనస్సుకు నిరంతర సంతృప్తినిచ్చాయి. జీవితంలో అత్యంత ముఖ్యమైన కాలంలో, అటువంటి సాధువులు నాకు 'ప్రజా సేవయే దేవుని సేవ' అనే నిజమైన సూత్రాన్ని బోధించారు.



స్వామి స్మరణానందతో నరేంద్ర మోదీ

'ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ' (స్వీయ విముక్తి కోసం మరియు లోక కల్యాణం కోసం) అనే రామకృష్ణ మిషన్ సిద్ధాంతానికి స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద జీవితాలు చెరగని ఉదాహరణ.

విద్యాభివృద్ధికీ, గ్రామీణాభివృద్ధికీ రామకృష్ణ మిషన్ చేస్తున్న కృషి మనందరికీ స్ఫూర్తిదాయకం. భారతదేశ ఆధ్యాత్మిక స్ఫృహ, విద్యా సాధికారత, మానవతా సేవ సంకల్పానికి రామకృష్ణ మిషన్ పని చేస్తోంది. 1978లో బెంగాల్‌ను వరదలు ముంచెత్తినప్పుడు రామకృష్ణ మిషన్ తన నిస్వార్థ సేవతో అందరి హృదయాలను గెలుచుకుంది. 2001లో కచ్ భూకంపం వచ్చినప్పుడు విపత్తు నిర్వహణకు రామకృష్ణ మిషన్ అన్ని విధాలుగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉందని నాకు ఫోన్ చేసి చెప్పిన మొదటి వ్యక్తుల్లో స్వామి ఆత్మస్థానంద ఒకరు. ఆయన సూచనల మేరకు రామకృష్ణ మిషన్ భూకంప విపత్కర సమయంలో ప్రజలకు ఎంతో సాయం చేసింది.

నివాళి

కొన్నేళ్లుగా స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వివిధ పదవుల్లో ఉంటూ సామాజిక సాధికారతకు పెద్దపీట వేశారు. ఆధునిక విద్య, నైపుణ్యం, మహిళా సాధికారత పట్ల ఇలాంటి మహానుభావులు ఎంత గంభీరంగా ఉండేవారో వీరి జీవితాలు తెలిసిన వారికి తప్పకుండా గుర్తుండే ఉంటుంది.

స్వామి ఆత్మస్థానందజీ మహోన్నత వ్యక్తిత్వంలోని ప్రత్యేకత నన్ను బాగా ఆకట్టుకుంది. ప్రతి సంస్కృతి, ప్రతి సంప్రదాయం పట్ల ఆయనకున్న గౌరవం, ప్రేమ దీనికి కారణం. ఆయన భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో చాలాకాలం గడిపారు. నిరంతరం ప్రయాణించేవారు. గుజరాత్‌లో ఉంటూ గుజరాతీ మాట్లాడటం నేర్చుకున్నారు. నాతో కూడా ఆయన గుజరాతీలోనే మాట్లాడేవారు. ఆయన గుజరాతీ మాట్లాడుతుంటే వినడం నాకు బాగుండేది.

భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో అనేక దశలలో, మన మాతృభూమిని స్వామి ఆత్మస్థానంద, స్వామి స్మరణానంద వంటి ఎందరో సాధువులు ఆశీర్వదించారు. వారు సామాజిక మార్పు గురించి మనకు కొత్త చైతన్యాన్ని అందించారు. సమాజ శ్రేయస్సు కోసం కలిసికట్టుగా పనిచేయాలని ఈ సాధువులు మనకు దీక్షను అందించారు. ఈ సూత్రాలు ఎప్పటికీ శాశ్వతమైనవి. రాబోయే కాలంలో ఈ ఆలోచనలు అభివృద్ధి చెందిన భారతదేశానికి, అమృత్ కాలానికి సంకల్పశక్తిగా మారతాయి.

అలాంటి మహనీయులకు యావత్ దేశం తరఫున మరోసారి నివాళులర్పిస్తున్నాను. రామకృష్ణ మిషన్‌తో సంబంధం ఉన్నవారంతా ఆయన చూపిన మార్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారనే నమ్మకం ఉంది.

ఓం శాంతి.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్త సమస్య



ఇండియాలోని యువ విద్యావంతులకు కొత్త ఆందోళన. సెకండరీ, అంతకంటే ఎక్కువ చదువున్న వాళ్లలో నిరుద్యోగం 35.2 శాతం (2000) నుంచి 65.7 శాతానికి (2022) పెరిగింది. సాధారణ మానవులు దీన్ని గమనిస్తున్నారనుకుంటాను.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

ఉండకూడదా?



విస్తృత, వైవిధ్యమైన సమాజంలాంటి మన దేశంలో ప్రధాని పదవీకాలం మీద కచ్చితంగా పదేళ్ల పరిమితి ఉండాలి. ప్రజాస్వామ్య సంస్థలను పెంచడం, కాపాడటానికి ఇది మంచి మార్గం. హేతుబద్ధమే కదా?

– ఎం.కె. వేణు, సంపాదకుడు

అందుకు ముఖ్యం



ఫ్రెండ్స్, దీన్ని స్పష్టంగా చెప్పనివ్వండి: మ్యాడ్రిడ్, న్యూయార్క్, పారిస్, లండన్ నగరాల్లోని రాడికల్ ఇస్లామిక్ తీవ్రవాదులు ఈ యుద్ధాన్ని గమనిస్తున్నారు. ఒకవేళ హమాస్ మీద విజయం సాధించడంలో ఇజ్రాయెల్‌ను అడ్డకుంటే, అది వాళ్లందరికీ ప్రేరణ కలిగిస్తుంది. మనం హమాస్‌ను నిర్వీర్యం చేయగలిగితేనే, భయోత్పాతం కలిగించాలన్న వాళ్ల ఆశలను ధ్వంసం చేయగలుగుతాం. మీరు సురక్షితంగా ఉంటారు.

– అయాన్ హిర్సీ అలీ, మానవ హక్కుల కార్యకర్త

ఎవరు చెబుతారు?



ఎర్ర సముద్రంలో చైనీస్ చమురు ట్యాంకర్‌ను హౌతీలు ఢీకొట్టారు. చైనీస్, రష్యన్ నౌకల మీద తాము దాడి చేయమని వాళ్లు ఇంతకుముందు చెప్పినప్పటికీ ఎం.వి.హువాంగ్ మీద ఈ దాడి జరిగింది. హౌతీల తరఫున చైనీయులకు ఇరాన్ క్షమాపణ చెబుతుందా?

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

వెనక్కి తగ్గవు



ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేయడం గురించి జర్మనీ, యూఎస్ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ విషయంలో నా ఆలోచన: గుర్పత్‌వంత్ సింగ్ పన్నూ కేసులో లాగానే, యూఎస్ తన వైఖరిలో వెనక్కి తగ్గదు. నేను అనుకున్నట్టుగానే అవి పునరుద్ఘాటించాయి కూడా. 'ప్రజాస్వామ్యాలకు తల్లి' అని చెప్పుకొంటూ, సవతి తల్లిలా ఇండియా ప్రవర్తించకూడదు.

– కె.సి. సింగ్, మాజీ దౌత్యవేత్త

అసలైన భారత్



నేనొక ప్రసిద్ధ అమెరికా చరిత్రకారుడితో మాట్లాడుతున్నాను. గత దశాబ్దాల గురించి ఆయన ఏం చెప్పారంటే: 1947 తర్వాత విద్యారంగం వలసవాదుల నియంత్రణలో ఉంది. వినోద రంగం నెమ్మదిగా నేర మాఫియాల చేతుల్లోకి వెళ్లిపోయింది. జర్నలిజంలో కమ్యూనిస్టుల ఆధిపత్యం కొనసాగింది. భారత్ ఇప్పుడే మేలుకుంటోంది; పరిస్థితులు అందరికీ సానుకూలంగా మారుతాయి.

– సుభాష్ కాక్, రచయిత

ఎందుకో చెప్పరా?



భారత ఆర్థిక వ్యవస్థ 2023–24లో దృఢంగా ఉందని బీజేపీ చెబుతోంది. కానీ ఎఫ్‌డీఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు)ల రాక 31 శాతం ఎందుకు తగ్గిందో మాత్రం వివరణ లేదు. ఒక దేశం మీద, అక్కడి ప్రభుత్వం, రాజకీయాల మీద విదేశీ ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకానికి ఎఫ్‌డీఐలు ఒక కొలమానం. కానీ అలాంటి నమ్మకం తగ్గింది.

– పి. చిదంబరం, కేంద్ర మాజీ ఆర్థికమంత్రి

ఇన్ బాక్స్

విడదీయరాని బంధం

మన ప్రధాన మంత్రికి ఇటీవల ఓ విదేశీ అత్యున్నత పురస్కారం రావడం ముదావహం. భారత్‌లో 'భారత రత్న' ఎంత అత్యున్నతమైనదో 'ఆర్డర్ ఆఫ్ ది డ్రుక్ గ్యాల్పో' భూటాన్‌లో అంత అత్యున్నత పౌర పురస్కారం. దక్షిణ ఆసియాలో భూటాన్‌కు పెద్ద దిక్కు భారత్. ఎన్నో సహాయ సహకారాలు అందిస్తూ వుంది. కోవిడ్ సమయంలో తీవ్రంగా నష్టపోయిన దేశాలలో భూటాన్ ఒకటి. అటువంటి విపత్కర సమయంలో భారత్ చేయూత అందించింది. దాదాపు ఐదు లక్షల కోవిడ్ వ్యాక్సిన్‌లు అందించి పెద్ద మనసు చాటుకుంది. మొత్తం మీద 'భారత్–భూటాన్ సంబంధాల అభివృద్ధికి చేసిన కృషికీ, భూటాన్ దేశానికీ, ఆ దేశ ప్రజలకూ చేసిన అపూర్వ సేవకు ప్రధాని మోదీకి ఈ జీవన సాఫల్య పురస్కారం ఇస్తున్నట్లు' ఆ దేశం పేర్కొంది. రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్ చుక్ చేతుల మీదుగా అందుకున్న ఈ అవార్డును ప్రధాని మోదీ 140 కోట్ల భారతీయులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఒక విదేశీయునికి భూటాన్ ఈ పురస్కారం అందించడం ఇదే మొదటి సారి కావడం గమనార్హం.

భూటాన్ రాజు మాట్లాడుతూ, రెండు దేశాలు భేషజాలు లేకుండా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పర్యటనలోనే వ్యవసాయం, పర్యావరణం, పర్యాటక రంగాలలో కొన్ని ఒప్పందాలు ఇరు దేశాల మధ్య కుదిరాయి. వీటి అమలు ద్వారా రెండు దేశాలూ ప్రయోజనం పొందుతాయి. భారత్ సహకారం ఉన్నంత వరకు భూటాన్‌కు వచ్చిన ముప్పేమి ఉండదు. భూటాన్‌లో భారత్ నిధులతో ఓ ఆసుపత్రి నిర్మించడం ఆనందదాయకం.

భూటాన్ పర్యటనకు రావడం ఇది మూడవసారి, భూటాన్‌లో శక్తిమంతమైన బౌద్ధ మఠం సందర్శన కొత్త అనుభూతిని ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. భూటాన్ రాజు 'భారత్ మాకు పెద్దన్న' అని కొనియాడారు. 'భారత్‌లో ప్రభుత్వాలు మారినా భారత్ మాకు ఎప్పుడూ అండగానే ఉంటుంది. భారత్‌ను మేము ప్రేమిస్తాం' అని పేర్కొనడం ఇరు దేశాల మధ్య ఎటువంటి దౌత్య బంధం ఉందో అర్థం చేసుకోవచ్చు. అవి పటిష్ఠం అని రెండు దేశాలకూ తెలుసు.

– కనుమ ఎల్లారెడ్డి, ఆస్టిన్, అమెరికా

జగన్ వెంటే జనం!

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూటికి 99 శాతానికి పైగా అమలు చేసిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి కుటుంబం జగన్ ప్రభుత్వ పథకాల వల్ల ప్రయోజనం పొందినదే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. విలువలు గల కమిట్‌మెంట్ రాజకీయాలు నడపడంలోనూ, ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక మార్పులు తీసుకురావడంలోనూ జగన్ చేసిన ఈ ఐదేండ్ల కృషి అద్వితీయం, అనుపమానం. ఈ రోజు నిరుపేద కుటుంబాల్లోంచి వచ్చిన పిల్లలు, ఈ దేశంలోని పేద బహుజనుల చిరకాల స్వప్నమైన ఇంగ్లీషు మీడియం విద్యను అభ్యసిస్తున్నారు. లక్షలాదిమంది విద్యార్థులకు విదేశీస్థాయి కార్పొరేట్ విద్య ఉచితంగా లభిస్తోంది. అలాగే వాలంటీర్ల వ్యవస్థను తీసుకురావడం మరో అద్భుతమైన, విప్లవాత్మకమైన చర్య. దీంతో అధికార వికేంద్రీకరణ జరిగింది.



చంద్రబాబు తన ఐదేండ్ల పాలనలో విభజన హామీల సాధన కోసం ఏ ప్రయత్నం చేయకపోగా, ఆంధ్రప్రదేశ్‌కు వెన్నెముక లాంటి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూడా చేయలేకపోయారు. అమరావతి పేరు చెప్పి పాలనను నిర్లక్ష్యం చేశారు. దాంతో పోలవరం ఒక్కడుగు కూడా ముందుకు నడు వలేదు. ఈ అవకతవకలన్నీ సరిచేసి కొత్త టెండర్లనాహ్వానించి వేలకోట్ల ప్రజాధనాన్ని కాపాడారు జగన్.

వైద్యరంగంలోనూ జగన్ ఆంధ్రప్రదేశ్‌లో తీసుకొచ్చిన మౌలిక మార్పులు దేశానికే ఆదర్శప్రాయం. అనేక ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, దవాఖానాలు తెరిచి ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలిచారు. ఆరోగ్యశ్రీ సేవలను మరిన్ని జబ్బులకు వర్తింపజేసి, ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్ స్థాయికి పెంచడం ముదావహం.

ఇలా ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికీ, అనేక మౌలిక మార్పులకూ.... ముఖ్యంగా దళిత, బహుజన, పేదవర్గాల్లో ఆత్మగౌరవం పెంచడానికీ, సామాజికన్యాయం చేయడానికీ తన ఐదేండ్ల కాలాన్ని పూర్తిగా వినియోగించారు జగన్. రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చింతర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలనకు శాశ్వతంగా తెరపడ్డట్టే... జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలనకు శాశ్వత తెరపడుతుంది.

ఈ భయంతోనే చంద్రబాబు జనసేన, బీజేపీలతో అనైతిక పొత్తు పెట్టుకొని ఎన్నికలల్లో గెలవాలని చూస్తున్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రి అనుభవం, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడు తాను ప్రజలకేమైనా చేసి ఉంటే అవి చెప్పుకోవచ్చు కదా! అది మాని అనైతిక పొత్తులతో జగన్‌తో ఎన్నికల రణరంగంలో తలపడుతున్నారు చంద్రబాబు.

మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నా జగన్ ఒంటరిపోరే చేస్తున్నారు. తానే ప్రజల కోసమైతే పని చేస్తున్నారో, అద్భుత పథకాల ద్వారా వాళ్ల మనసులు గెలుచుకున్నారో ఆ ప్రజలే తనను గెలిపిస్తారన్న దృఢ విశ్వాసముంది కాబట్టే ఒంటరిగా పోరాడుతున్నారు. జగన్ తన ఎన్నికల ప్రచారంలో చెబుతుంది ఒకే ఒక మాట 'అన్నలారా! అక్కలారా! మీకు నా ఈ ఐదేళ్ల పాలన నచ్చితేనే మీ జగనన్నను గెలిపించండి' అని.

ఇంతకంటే వినయ సంపన్నత రాజకీయాల్లో మరేముంటుంది? జగన్ ఒంటరివాడు కాదు. ఏడున్నరకోట్ల ఆంధ్ర ప్రజలు ఆయన వెంటున్నారు. వాళ్లే ఆయనను కాపాడుకుంటారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత । 91829 18567

జీవన్ముక్తికి సోపానం

సందర్భం



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

'సంఘంలో మనలేని మానవుడు పశువైనా కావాలి, పరమాత్మయినా కావాలి' అంటాడు అరిస్టాటిల్. సమాజం కోసం జీవించడం అంటే లోకాన్ని ఉద్ధరించటం. లోకాన్ని ఉద్ధరించటం అంటే సమాజాభివృద్ధికీ, సమాజ శ్రేయస్సుకూ జీవితం త్యాగం చేయడం. అలా జీవితాన్ని ఫణంగా పెట్టి లోకానికి ఒక సందేశమిచ్చి మరణాన్ని జయించి లేచినవాడు ఏసుక్రీస్తు. ఏసు జననమే ఒక విచిత్రం. ఆయన మరణమూ విచిత్ర ఘటన. కరుడు కట్టిన దాష్టీకాన్నీ, మూఢ అంధ విశ్వాసాల్నీ, హేతువు లేని బోధలనూ వ్యతిరేకించి లోకానికి ఒక కొత్తబాట వేశాడు ఏసు క్రీస్తు. పవిత్ర దేవాలయ నిర్వాహకుల మత మౌఢ్య దురహంకార వ్యాపార దుర్మార్గ చర్యలను నిరసించి ప్రజా చైతన్యం గావించినందువల్ల ఆయనపై దేశద్రోహం నేరం ఆరోపించి సిలువ శిక్షకు గురిచేశారు.



ఏసు సిలువపై పలికిన చివరి ఏడు మాటలను 'సిలువ ధ్యానం'గా గుడ్ ఫ్రైడే నాడు ఆచరిస్తారు. ఏసు సిలువపై మరణానికి ముందు పలికే ఏడు వాక్కులు ప్రేమకు, బాధ్యతకు, సమాజ శ్రేయస్సుకు, విశ్వాస జీవన గమనానికి మార్గదర్శకాలు. తొలి మాటలోనే ఆయన్ని క్రూరంగా హింసిస్తున్న వాళ్లని 'వీళ్లేమి చేస్తున్నారో వీళ్లకు తెలియదు... వీళ్లని క్షమించ'మని ప్రార్థించాడు. రెండో మాటలో ఆయనతోపాటు సిలువశిక్ష అనుభవిస్తున్న మరో వ్యక్తి దిస్మస్ 'దేవా! నీ రాజ్యంలో నన్నూ చేర్చుకో' అని అడుగగా ఏసు వేదన అనుభవిస్తూ కూడా 'నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉంటావు' అని అభయమిచ్చాడు. మూడో వాక్కులో తల్లిని చూసి, 'అమ్మా! ఇదిగో నీ కుమారుడు' అని తన ప్రియశిష్యుడు, సోదర సమానుడైన యోహానుకు బాధ్యత అప్పగించాడు. నాలుగో మాటలో తన మరణం ఆసన్నమయిందని తెలిసి, 'నా దేవా! నా దేవా! నన్నెందుకు చేయి విడిచావు' అని పరలోక సందేశం పంపాడు. ఐదో మాటలో ప్రపంచానికి దాహార్తి తీర్చిన తండ్రిని తనకు దాహం వేస్తుందని 'దప్పిగొనుచున్నాను' అని సమాజాన్ని అడిగాడు. ఆరో మాటలో తాను ఈ లోకానికి వచ్చిన పని 'సమాప్తమైనది' అనీ, కర్తవ్య నిర్వహణ సక్రమంగా నెరవేర్చాననీ చివరి పలుకుగా తన తండ్రి అయిన యెహోవా దేవునికి 'నా ఆత్మను నీ చేతికి అప్పగిస్తున్నాన'ని ప్రాణం విడిచాడు. అనంతరం లోకమంతా చీకటి కమ్మింది.

ఏసుతోపాటు మరో ఇద్దరికి కూడా సిలువ వేశారు. నిజానికి ఏసు ఒక్కడికే సిలువ వేయాలి. కాని ఏసును యూదుల రాజుగా గుర్తించాడు పిలాతు. ఆనాటికి రోమ్ పరిపాలనలో ఆయనే న్యాయమూర్తి. శిక్షార్హుడయిన వారి వివరాలు వారి మెడలోనే, సిలువ మీద రాసే సంప్రదాయం ఉంది. అందుకే లాటిన్, హీబ్రూ, గ్రీకు భాషల్లో ఐఎన్ఆర్ఐ అని ఇంగ్లిష్ అక్షరాల్లో రాశారు. అంటే 'ఈసూస్ నజరేనస్ రెక్స్ ఇవాడేరమ్' అంటే యూదుల రాజైన నజరేయుడగు ఏసు (యోహాను 19:19–22) అని రాయమని తీర్పు ఇచ్చాడు పిలాతు. అందువల్ల రాజుతోపాటు మరో ఇద్దరు సిలువ వేతకు గురయ్యారు.

ఏసు సిలువ వేతకు ముందు నలభై రోజులు ఉపవాసాన్ని 'లెంట్' దినాలుగా ధ్యానిస్తారు. లెంట్ అనే లాటిన్ మాటకు నలభై అని అర్థం. నలభై రోజులు అత్యంత నిష్ఠగా దైవ ధ్యానంలో అన్ని కార్యకలాపాలు పవిత్రంగా ఆచరిస్తూ ప్రార్థనలో గడుపుతారు. ఈ కాలంలో సాత్విక ఆహార నియమాలతోపాటు సర్వజీవన క్రమాన్ని పవిత్రంగా వ్యక్తిగత క్షాళన చేసుకుని శారీరకంగా, మానసికంగా దైవ జీవన్ముక్తికీ, సమాజ ప్రేమ జీవనసౌందర్యానికీ, అంతఃశ్శుద్ధికీ ప్రాధాన్యతనిస్తారు.

గుడ్ ఫ్రైడే అనంతరం వచ్చే ఆదివారాన్ని ఈస్టర్ పండుగగా ఆచరిస్తారు. విశ్వవ్యాప్త క్రైస్తవ విశ్వాసులకు గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలు పవిత్ర జీవనక్రమానికీ, ముక్తిమార్గ సోపానానికీ ప్రతీకలు.

వ్యాసకర్త పరిశోధకులు, రచయిత । 98481 23655
(నేడు గుడ్ ఫ్రైడే)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.చవితి సా.5.17 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** విశాఖ సా.5.56 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.10.06 నుండి 11.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.25 నుండి 9.13 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.18 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.32 నుండి 10.13 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 6.08.

ముగ్గురు ప్రత్యేక ఎన్నికల పరిశీలకుల నియామకం

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక ఎన్నికల పరిశీలకులను భారత ఎన్నిక సంఘం నియమించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా చెప్పారు. 1987వ బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రామ్‌మోహన్‌మిశ్రాను స్పెషల్ జనరల్ అబ్జర్వర్‌గా, 1984వ బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రాను స్పెషల్ పోలీస్ అబ్జర్వర్‌గా, 1983వ బ్యాచ్‌కు చెందిన రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి నీనా నిగమ్‌ను ప్రత్యేక వ్యయ పరిశీలకులుగా నియమించినట్లు తెలిపారు. వీరు వచ్చే వారం నుంచి రాష్ట్రంలో పర్యటిస్తారని చెప్పారు. ఎన్నికల నిర్వహణ కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఈసీ మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేసే అంశంతో పాటు సరిహద్దు ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడతారని.. ఓటర్లను వివిధ తాయిలాలతో ప్రలోభాలకు గురిచేయకుండా నియంత్రిస్తారని తెలిపారు. జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో ఎన్నికల సంఘం నిర్వహించే సమావేశాల్లో పాల్గొని.. తమ సూచనలు, సలహాలు ఇస్తారని చెప్పారు

ప్రాణం నిలిపిన సీహెచ్‌సీ

- గుండెపోటుకు గురైన వృద్ధుడికి ఖరీదైన ఇంజెక్షన్



సీహెచ్‌సీలో బసిరెడ్డికి వైద్యసేవలు

పొదలకూరు: గుండెపోటు వచ్చిన వారికి వెంటనే ఖరీదైన ఇంజెక్షన్ వేసేందుకు ఆస్పత్రుల్లో సీఎం వైఎస్ జగన్ చేయించిన ఏర్పాట్లతో ఓ వృద్ధుడి ప్రాణం నిలిచింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలువాయి మండలం చినగోపవరం గ్రామానికి చెందిన పి.బసిరెడ్డి అనే వృద్ధుడు ఆయాసంగా ఉందని గురువారం పొదలకూరు సీహెచ్‌సీకి వెళ్లారు. సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ పర్యవేక్షణలో వైద్యులు గుండెపోటుగా నిర్ధారించారు. నెల్లూరు జీజీహెచ్ డాక్టర్లను సంప్రదించారు. టెనెక్టెరల్ 40 ఎంజీ (రక్తం గడ్డకట్టకుండా వేసే ఖరీదైన ఇంజెక్షన్)ను ఇచ్చి టెలిమెడిసిన్ ద్వారా సేవలందించారు. బసిరెడ్డికి ప్రాణాపాయం తప్పగా 108 అంబులెన్స్‌లో వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తొలిసారిగా సీహెచ్‌సీలో గుండెపోటుకు అందుబాటులో ఉన్న ఇంజెక్షన్ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ ఇంజెక్షన్ బయట కొనుగోలు చేయాలంటే రూ.42 వేలు వెచ్చించాల్సి ఉంటుంది.

దర్శి నుంచి తొలి ప్యాసింజర్ రైల్ ట్రయల్ రన్



దర్శి: దర్శి రైల్వేస్టేషన్ నుంచి తొలి ప్యాసింజర్ రైలును రైల్వే అధికారులు గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రాక్‌పై ఎంత స్పీడ్ వెళ్తుంది, ట్రాక్ సామర్థ్యం తెలుసుకోవడానికి ఈ ట్రయల్ రన్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. రైలును చూసేందుకు స్థానికులు భారీగా రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అధికారులు పచ్చ జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఏప్రిల్ మొదటి వారంలో దర్శి నుంచి రోజూ రైలు సర్వీసులు ఉంటాయని, కురిచేడు మండలం బయ్యారం, దేకనకొండ మీదుగా పిడుగురాళ్ల, నడికుడి రూట్‌లో, వినుకొండ నుంచి గుంటూరు, విజయవాడ రూట్‌లో సర్వీసులు నడుస్తాయని తెలిపారు. మరికొద్ది రోజుల్లో దర్శి నుంచి శ్రీకాళహస్తి వరకు చేస్తున్న ట్రైన్ ట్రాక్ పనులు పూర్తయితే తిరుపతి వైపునకు కూడా రైళ్లు నడుస్తాయి. ఈ పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు తిరుపతి, చెన్నై, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు కూడా రైలు ప్రయాణం సులభతరం కానుంది.

వినాశకాలే.. విపరీత రాతలే!

పనిగట్టుకుని రామోజీ దుష్ప్రచారం

తప్పుడు రాతల పూనకంలో రామోజీ ఊగిపోతున్నారు. కరోనా సమయంలో దేశమంతా విపత్కర స్థితిలో ఉంటే, ఆ సమయంలోనూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు వచ్చాయి. ఈ సంగతి రామోజీకి తెలుసో లేదో మరి. తెలిసినా నిజాలు రాస్తే ఆయన రామోజీ ఎందుకవుతారు? నిజాలు చెబితే చంద్రబాబు తల వేయి ముక్కలవుతుందనే శాపముందని దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో చమత్కరించేవారు. రామోజీకీ బహుశా అలాంటి శాపమే ఉన్నట్లుంది. సీఎంగా జగన్ చొరవ, పట్టుదల, కృషి వల్లనే రాష్ట్రంలో పెట్టుబడులు మూడు రెట్లు పెరిగాయని జాతీయ ఆంగ్ల పత్రికలు కోడై కూస్తున్నాయి. అవన్నీ కార్యరూపం దాలుస్తున్నాయి. టాటాలు, అంబానీ, అదానీలు ఉత్సాహభరితంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తున్నారు. మూడేళ్లుగా సులభతర వాణిజ్యంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తున్నా, దానికి రామోజీ అబద్ధాల పరదాలు కడుతున్నారు.

సాక్షి, అమరావతి: గత ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధిలో వేగంగా దూసుకువెళుతోంది. టాటాలు, బిర్లాలు, అదానీ, అంబానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే రాష్ట్రంలో పెట్టుబడులు మూడు రెట్లు పెరిగాయని జాతీయ ఆంగ్ల దిన పత్రికలు ప్రముఖంగా కథనాలు ప్రచురిస్తున్నాయి. అయినా రామోజీ అనే రాష్ట్ర వినాశకారి ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'జగన్ అనే నేను ఒక వినాశకారి' శీర్షికతో ఒక సిగ్గుమాలిన కథనాన్ని వండి వార్చారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 పెట్టుబడుల ఒప్పందాల ద్వారా రూ.13.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను జగన్ ఆకర్షించారు. ఈ ఐదేళ్లలో 130 భారీ ప్రాజెక్టుల ద్వారా రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వాస్తవరూపంలోకి వచ్చినా రామోజీ రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెళ్లిపోయాయంటూ దిగజారుడు రాతలు రాసిపారేశారు. ఒక పక్క పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంపై నమ్మకం పెరగడంతో గత మూడేళ్ల నుంచి పూర్తిగా 100 శాతం పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు ఆధారంగా నిర్వహిస్తున్న సులభతర వాణిజ్యం సర్వేలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తున్నా, పారిశ్రామికవేత్తలు వెళ్లిపోతున్నారంటూ రాయడం ఒక్క రామోజీకే చెల్లుతుంది. జీఎస్‌డీపీలో పరిశ్రమల వాటా పెరగడం, ప్రజల తలసరి ఆదాయం పెరగడమే రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి నిలువెత్తు సాక్ష్యం. 2019–20లో రాష్ట్ర జీఎస్‌డీపీలో 22.04 శాతంగా ఉన్న పరిశ్రమల వాటా 2022–23 నాటికి అది 23.36 శాతానికి



జగన్ అనే నేను.. ఒక వినాశకారి!

చేరింది. గతేడాదితో పోలిస్తే దేశంలో తలసరి ఆదాయం సగటున రూ.23,476 పెరిగితే మన రాష్ట్రంలో రూ.26,931కు పెరిగింది. 2021–22లో రూ.1,92,587గా ఉన్న రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం 2022–23 నాటికి రూ.2,19,518కు చేరింది. ఇదే సమయంలో రాష్ట్ర వాణిజ్య ఎగుమతులు 10.59 శాతం వృద్ధితో రూ.1.59 లక్షల కోట్లకు చేరడం ద్వారా ఆరో స్థానానికి ఎగబాకింది. ఇలా అన్ని రంగాల్లో వేగంగా విస్తరిస్తుంటే పరిశ్రమలపై పగ అంటూ ఈనాడు వంకరరాతలు రాసింది.

అమర్‌రాజా తరలిపోయిందని తప్పుడు ప్రచారం

వ్యూహాత్మక వ్యాపార విస్తరణలో భాగంగా అమరరాజా గ్రూపు తెలంగాణలో కొత్తగా పెట్టుబడులను పెట్టింది. రాష్ట్రంలో ప్రస్తుత పెట్టుబడులను కొనసాగిస్తూ ఇక్కడా విస్తరణ కార్యక్రమాలను చేపడుతోంది. ఇదే విషయాన్ని అమరరాజా గ్రూపే స్వయంగా ప్రకటించింది. కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం వివిధ రాష్ట్రాలు దేశాల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. రామోజీకి చెందిన మార్గదర్శి గ్రూపు కర్ణాటకలో కొత్తగా బ్రాంచీలను ఏర్పాటు చేసింది. అంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి మా గ్రూపు వెళ్లిపోయిందని రాయగలవా రామోజీ...?తెలుగుదేశం ఎంపీ గల్లా జయదేవ్ ఈ మధ్య పార్లమెంటు సమావేశాల్లోనే రాజకీయాల్లోకి రావడం వల్ల కేంద్ర ఈడీ సంస్థల నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నా అన్నారే కాని ఎక్కడా రాష్ట్ర ప్రభుత్వం తనను ఇబ్బంది పెట్టిందని చెప్పలేదు. అయినా రాష్ట్ర ప్రభుత్వ వేధింపుల వల్ల అమరరాజా వెళ్లిపోయిందంటూ కుందేళ్లు, కొరివి దెయ్యాలు..రాక్షసులు అంటూ రామోజీ చందమామ కథలు రాస్తున్నారు.

అక్క చెల్లెమ్మలకు ఉపాధి

గత ప్రభుత్వం పెట్టుబడుల ఒప్పందాలు అంటూ కేవలం మాటలకే పరిమితమయింది...దీనికి భిన్నంగా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికోసం అహరహం జగన్ శ్రమిస్తున్నారు. ఈ క్రమంలోనే జగన్ ప్రభుత్వం వాస్తవ పెట్టుబడులను తీసుకొచ్చి ప్రత్యక్షంగా ఉపాధిని కల్పిస్తోంది. దీనికి తార్కాణమే ఆదిత్య బిర్లా గార్మెంట్స్ యూనిట్. రూ. సుమారు రూ.110.38 కోట్ల వ్యయంతో 2112 మందికి ఉపాధి కల్పించే విధంగా పులివెందులలో యూనిట్ ఏర్పాటు చేయడమే కాకుండా పలు అంతర్జాతీయ బ్రాండ్‌ల దుస్తులు అక్కడ తయారవుతున్నాయి. రామోజీ వీటి గురించి ఒక్క మాటా రాయరు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ఒప్పందం కుదుర్చుకుని పెట్టుబడులు పెట్టకుండా వెళ్లిపోయిన జాకీ పరిశ్రమ గురించి పదేపదే జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ విషపూరిత కథనాలను అల్లుతారు. గత ప్రభుత్వంలో అనంతపురం జిల్లాలో మంత్రిగా ఒక వెలుగు వెలిగిన వారు భూకేటాయింపుల్లో భారీగా లంచాలను అడగటంతో జాకీ పరిశ్రమ వెళ్లిపోయిందన్న సంగతి అందరికీ తెలుసు. జాకీ ఒప్పందాన్ని చంద్రబాబు ప్రభుత్వం ఎందుకు వాస్తవ రూపంలోకి తీసుకురాలేకపోయిందన్న విషయాన్ని చెప్పకుండా ఆ బురదను ఈ ప్రభుత్వానికి అంటగట్టే విధంగా దిక్కుమాలిన రాతలతో పత్రికను నింపేస్తున్నారు. విశాఖ సమీపంలోని అచ్యుతాపురం వద్ద జపాన్‌కు చెందిన యకహోమా టైర్స్ కంపెనీలో స్థానిక మహిళలు రూ.22,000 పైగా జీతంతో పనిచేస్తున్నారు అంటూ రెండు రోజుల క్రితం ఈనాడు వసుంధర పేజీలో '' ఆ చక్రాలను నడిపించేది వాళ్లే'' అంటూ రాసిన కథనమే అక్క చెల్లెమ్మలకు ఈ రాష్ట్రంలో ఏ విధంగా ఉపాధి లభిస్తోందో చెప్పడానికి ప్రబల సాక్ష్యం.

దుర్గమ్మ సన్నిధిలో జస్టిస్ బి.కృష్ణమోహన్



జస్టిస్ కృష్ణమోహన్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ గురువారం దర్శించుకున్నారు. దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ ఈవో కెఎస్.రామారావు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల ఆలయం ఎదుట మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, కుటుంబసభ్యులు

తిరుమల: మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ గురువారం తిరుమల వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం తిరుమలలోని పుష్పగిరి మఠంలో జస్టిస్ దుప్పల వెంకటరమణ సోదరుడి కుమారుడు భానుప్రకాష్, సౌజన్యల వివాహం జరిగింది. నూతన వధూవరులు, కుటుంబసభ్యులతో కలిసి హైకోర్టు న్యాయమూర్తి గురువారం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు కూడా గురువారం తిరుమలేశుని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

ఈసీలపైనా గుడ్డి రాతలేనా?

- ఒక్క మార్చిలోనే జరిగిన రిజిస్ట్రేషన్లు 2.62లక్షలు
- రాష్ట్ర వ్యాప్తంగా జారీ అయిన ఈసీలు 1,53,035
- కానీ కబోదిలా ఈనాడులో తప్పుడు రాతలు
- వాస్తవాలను దాచిపెట్టి అబద్ధాలు అచ్చేస్తున్న రామోజీ

సాక్షి, అమరావతి: ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూపి... అదే పనిగా రాష్ట్ర ప్రభుత్వంపైకి తప్పు నెట్టేయడం ఈనాడుకు... దానిని నడుపుతున్న రామోజీకి నిత్యకృత్యంగా మారింది. తాజాగా ఈసీల జారీలో ఎలాంటి ఇబ్బందులు లేకున్నా... అవి అందించలేకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయంటూ ఓ అబద్ధాన్ని అందంగా అచ్చేశారు. కానీ వాస్తవానికి ఒకటి కాదు.. రెండు కాదు.. ఒక్క మార్చిలోనే రాష్ట్రంలో 2,62,807 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆన్‌లైన్‌లో 1,26,123 ఉచితంగా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 26,912 ఈసీలు జారీ అయ్యాయి. ఇక్కడ లక్షల్లో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు, ఈసీల జారీ కనిపిస్తుంటే.. రాజగురువు రామోజీ మాత్రం కళ్లుండి ధృతరాష్ట్రుడిలా మారిపోయారు. రాజకీయంగా చతికిలపడిన తన పార్ట్‌నర్ చంద్రబాబు గ్రాఫ్‌ను పైకి లేపేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈనాడులో నిత్యం అసత్య కథనాలు వండివారుస్తూ దిగజారిపోతున్నారు. దేశంలోనే రిజిస్ట్రేషన్ల విధానంలో ఏపీ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్ అమలులోకి వచ్చిన తర్వాత రిజిస్ట్రేషన్ల సేవలు మరింత సులభంగా, సురక్షితంగా సాగుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ సక్సెస్‌ను జీర్ణించుకోలేని రామోజీ ప్రైమ్ సాఫ్ట్‌వేర్ సమస్య కారణంగా పది రోజులుగా ఈసీలు నిలిచిపోయాయంటూ కుట్రపూరిత కథనాన్ని అల్లేశారు.

అవాస్తవాలే అందులో వార్తలు

రాష్ట్రంలో ఈసీల జారీ నిలిచిపోలేదు. క్రయవిక్రయాలు ఆగలేదు. రిజిస్ట్రేషన్లు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. www.registration.-ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా ఈసీలు అందుతున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల కౌంటర్ల ద్వారా ప్రజలు నిర్దేశిత దరఖాస్తు నింపి, నిర్ణీత రుసుము చెల్లింపులతో సబ్‌రిజిస్ట్రార్ ఈ–సైన్‌తో కూడిన ఈసీలను పొందుతున్నారు. మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు అందించేవారికి జారీ చేస్తున్న విధానం ప్రస్తుతం సాంకేతిక భద్రతా ప్రమాణాల ఆడిటింగ్ కారణంగా తాత్కాలికంగా నిలిచింది. మిగిలిన విధానాల్లో యథావిధిగా ఈసీల జారీ కొనసాగుతోంది. కానీ, వాస్తవాలను పక్కన పెట్టి ఈనాడు యథావిధిగా అసత్యాలను అచ్చేసింది. సెక్యూరిటీ ఆడిట్ పూర్తయిన వెంటనే మీసేవ ద్వారా కూడా ఈసీల జారీ పునఃప్రారంభమవుతుంది. దీనితో పాటు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్ ద్వారా 30వ తేదీ నుంచి డిజిటల్ సర్టిఫైడ్ ఈసీలు, డాక్యుమెంట్ సర్టిఫైడ్ కాపీలు ఆన్‌లైన్‌లో నిర్ణీత రుసుము చెల్లింపులతో పొందవచ్చు. కానీ కేవలం అబద్ధాలే అచ్చేసే ఈనాడు ఈ విషయంలోనూ జనాన్ని తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తోంది.

సరుకు రవాణాలో 'వీపీఏ' దూకుడు

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ(వీపీఏ).. సరకు రవాణా విషయంలో ఎప్పటికప్పుడు తన రికార్డుల్ని తిరగరాస్తూ వస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగింపునకు 4 రోజులు మిగిలి ఉండగానే పోర్టు చరిత్రలోనే తొలిసారి 80.05 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును హ్యాండ్లింగ్ చేసి రికార్డు సృష్టించింది. పోర్టు చరిత్రలో ఇప్పటి వరకూ 73 మిలియన్ మెట్రిక్ టన్నుల రవాణాయే అత్యధికం కాగా.. దాన్ని పోర్టు అధిగమించింది. అత్యధికంగా సరుకు రవాణా చేయడంలో పలు రకాలైన కార్గో హ్యాండ్లింగ్‌లోనూ పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది హ్యాండ్లింగ్‌లో క్రూడ్ ఆయిల్ 27%తో తొలిస్థానంలో నిలవగా.. ఇనుప ఖనిజం 12%, ఎరువులు 6% వృద్ధి రేటు నమోదు చేశాయి.

భారత ఆర్కిడ్స్ సొసైటీ ఉపాధ్యక్షునిగా డాక్టర్ జానకీరామ్



సాక్షి, అమరావతి: ఆర్కిడ్ పూల సాగు, పరిశోధనా కార్యక్రమాలు నిర్వహించే జాతీయ సంస్థ ఆర్కిడ్ సొసైటీ ఆఫ్ ఇండియా (టీఓఎస్ఐ)ఉపాధ్యక్షునిగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ టి.జానకీరామ్ వరుసగా రెండోసారి నియమితులయ్యారు. నూతన సాంకేతిక పద్ధతుల ద్వారా అరుదైన ఆర్కిడ్ రకాలను పరిరక్షిస్తూ దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఆర్కిడ్ సాగును ప్రోత్సహించేందుకు ఈ సంస్థ కృషి చేస్తుంది.

'ఆమ్ ఆద్మీ'ని అంతం చేసే కుట్ర

అపూర్వ ప్రకటనలతో సీఎం స్థాయి వ్యక్తిని అరెస్టు చేస్తారా?

- నా పేరు చెప్పగానే మాగుంట రాఘవకు బెయిల్ ఇచ్చారు
- రూ.100 కోట్లు అంటున్నారు.. అది ఎక్కడా లేదు: కేజ్రీవాల్
- రౌజ్ అవెన్యూ కోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన వైనం
- కేజ్రీవాల్ కస్టడీని మరో నాలుగు రోజులు పొడిగించిన ప్రత్యేక కోర్టు


కోర్టులో హాజరుపరిచాక కేజ్రీవాల్‌ను బయటకు తీసుకొస్తున్న దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దోపిడీ రాకెట్ నడుపుతోందని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. అవినీతి అనే పొగతో కప్పేసి ఆప్‌ను అవినీతి పార్టీగా చిత్రీకరించి, అంతమొందించడం ఈడీ లక్ష్యాల్లో ఒకటని చెప్పారు. తాను ఈడీ దర్యాప్తును వ్యతిరేకించడం లేదని అన్నారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు తనను ఈడీ కస్టడీలో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఏడు రోజుల కస్టడీ ముగియడంతో సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు గురువారం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపర్చారు. తొలుత ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు, న్యాయవాది జోహెబ్‌హుస్సేన్ వాదనలు వినిపించారు. మద్యం కుంభకోణం కేసులో స్వాధీనం చేసుకున్న ఫోన్లు, ఇతరత్రా డేటాను పరిశీలించాల్సి ఉందని ధర్మాసనానికి రాజు తెలియజేశారు. ఇతర నిందితులతో కలిపి కేజ్రీవాల్‌ను విచారించాల్సి ఉందన్నారు. గోవా నుంచి సమన్లు అందుకొన్న కొందరితో కలిపి కేజ్రీవాల్‌ను విచారించాలన్నారు. లిక్కర్ కేసులో దర్యాప్తునకు కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా సహకరించడం లేదని ఆరోపించారు. మరో ఏడు రోజులపాటు కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి అనుమతించాలని న్యాయమూర్తిని కోరారు. అనంతరం స్వయంగా వాదనలు వినిపించుకోవడానికి కేజ్రీవాల్‌కు అవకాశం ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది గుప్తా కోరగా, న్యాయమూర్తి అనుమతించారు. కేజ్రీవాల్ తన వాదనలు హిందీలో కొనసాగించారు. 2022లో సీబీఐ కేసు నమోదైందని, తనని ఎవరూ అరెస్టు చేయలేదని, ఏ కోర్టు కూడా తనను దోషిగా గుర్తించడం గానీ లేదా ఆరోపణలు చేయడం గానీ జరగలేదని స్పష్టం చేశారు.

ట్రాప్ చేయడమే ఈడీ అసలు ఉద్దేశం

ఈ కేసులో సీబీఐ ఇప్పటిదాకా 31,000 పేజీలను కోర్టులో ఫైల్ చేసిందని, 294 మంది సాక్ష్యులను విచారించిందని, ఈడీ 162 మందిని విచారించిందని, 25,000 పేజీల రిపోర్టును ఫైల్ చేసిందని చెప్పారు. తన పేరు కేవలం 4 స్టేట్‌మెంట్లలోనే ఉందని తెలిపారు. తననెందుకు అరెస్టు చేశారో చెప్పాలన్నారు. అయితే, ఈ వివరాలన్నీ అఫిడవిట్ రూపంలో ఇస్తే రికార్డుల్లో చేరుస్తానని న్యాయమూర్తి సూచించారు. దీంతో, తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కేజ్రీవాల్ అభ్యర్థించారు. తాను ముఖ్యమంత్రినని, తన నివాసానికి మంత్రులు వస్తుంటారని, గుసగుసలాడుతుంటారని, దీని ఆధారంగా సిట్టింగ్ ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. దీనిపై ఎస్.వి.రాజు అభ్యంతరం వ్యక్తం చేయగా... ''రాజు గారు, మీ ఆశీర్వాదం నాకు కావాలి. నన్ను మాట్లాడనివ్వండి'' అని కేజ్రీవాల్ కోరారు. ఐదు నిమిషాలు మాత్రమే సమయం ఇవ్వగలనని న్యాయమూర్తి చెప్పడంతో కేజ్రీవాల్ తన వాదనలు కొనసాగించారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి పేరును ప్రస్తావించారు. తనకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇచ్చే వరకూ అతడి నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుంటూనే ఉన్నారని, దీన్నిబట్టి తనని ట్రాప్ చేయడమే ఈడీ అసలు ఉద్దేశమని అర్థమవుతోందని చెప్పారు. కొంతమంది నిందితులు అప్రూవర్లుగా మారిన అనంతరం ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. మాగుంట రాఘవ ఇచ్చిన స్టేట్‌మెంట్లను ప్రస్తావిస్తూ... ఆయన ఐదు స్టేట్‌మెంట్లు ఇచ్చారని తెలియజేశారు. ఈడీ ఏం చెబితే అదే వాంగ్మూలంగా ఇచ్చారని అన్నారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి స్టేట్‌మెంట్ మార్చుకోగానే ఆయన కుమారుడు మాగుంట రాఘవ బెయిలు పొందారని కేజ్రీవాల్ ఆరోపించారు. స్టేట్‌మెంట్లలో రాఘవ చెప్పింది ఏదీ కూడా ఈడీ రికార్డుల్లోకి తీసుకోలేదని ఆరోపించారు. ఈడీ కార్యాలయంలో లక్ష పేజీలు ఉన్నప్పటికీ, తనకు అనుకూలంగా ఉన్న ఒక్క అంశాన్ని కూడా రికార్డుల్లోకి తీసుకోలేదన్నారు. రూ.100 కోట్ల కుంభకోణం అంటున్నారని, అయితే ఆ సొమ్ము ఎక్కడా లేదని చెప్పారు. ఈడీ దర్యాప్తు తర్వాతే మద్యం కుంభకోణం అనేది మొదలైందని విమర్శించారు. ఈడీ అంతిమ లక్ష్యం ఆమ్ ఆద్మీ పార్టీని అంతమొందించడమేనని పేర్కొన్నారు. దీనిపై ఈడీ తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. దర్యాప్తు సంస్థలపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

నా వద్ద ఆధారాలున్నాయి

బీజేపీకి శరత్‌చంద్రారెడ్డి రూ.55 కోట్లు విరాళంగా ఇచ్చారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ రాకెట్ నడుస్తోందనడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. ఈడీ తనని ఎన్నిరోజులు రిమాండ్‌లో ఉంచుకున్నా అభ్యంతరం లేదన్నారు. ఈడీపై పదేపదే అవే విమర్శలు చేయడం ద్వారా ప్రజల మద్దతు కూడకట్టుకోవాలని కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని ఎస్.వి.రాజు ధర్మాసనానికి తెలిపారు. ఈడీ కార్యాలయంలో తనకు అనుకూలంగా పేజీలు ఉన్నాయని కేజ్రీవాల్ ఎలా భావిస్తున్నారు? ఇదంతా ఊహాజనితం అని అన్నారు. లంచం ద్వారా వచ్చిన సొమ్ములు గోవా ఎన్నికల్లో కేజ్రీవాల్ వినియోగించారని తెలిపారు. ఈ సొమ్మంతా హవాలా రూపంలో సౌత్ గ్రూపు నుంచి వచ్చిందేనని, అదంతా ఒక చైన్ లాంటిదని, అందుకే దాని గురించి కేజ్రీవాల్ మాట్లాడడం లేదని తెలిపారు. బీజేపీకి శరత్‌చంద్రారెడ్డి విరాళం ఆరోపణలపై రాజు బదులిస్తూ... దీనికి, మద్యం కుంభకోణానికి సంబంధం లేదన్నారు. ఎందుకంటే ఢిల్లీలో మద్యం విధానాన్ని రూపొందించే హక్కు బీజేపీకి లేదన్నారు. ముఖ్యమంత్రి అయినంత మాత్రాన వెంటనే క్లీన్‌చిట్ రాదని, దర్యాప్తును ఎదుర్కోవాలని, సామాన్యుడికి, సీఎంకు అరెస్టు విషయంలో తేడా ఉండదని రాజు పేర్కొన్నారు. మద్యం కుంభకోణం కేసులో ప్రశ్నించడానికి కేజ్రీవాల్‌కు మరో వారం రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించాలని కోరారు. అనంతరం, రాజు వాదనలకు తాను స్పందించవచ్చా? అని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది గుప్తా కోరగా.. ఇప్పటివరకూ స్పందించారుగా ఇక అప్రస్తుతం అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇది అప్రస్తుతం, అసందర్భం అని ఎలా అంటారని గుప్తా ప్రశ్నించగా... గట్టిగా మాట్లాడొద్దని హెచ్చరిస్తూ అందరి వాదనలు విన్నానని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

4 రోజులపాటు ఈడీ కస్టడీకి

మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ ఈడీ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు మరో 4 రోజులపాటు పొడిగించింది. ఆయనను ఏప్రిల్ 1న ఉదయం 11 గంటల్లోగా తమ ఎదుట హాజరుపర్చాలని ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఈడీ అధికారులను ఆదేశించారు. కేజ్రీవాల్‌ను ఏడు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరగా, న్యాయమూర్తి నిరాకరించారు. కేవలం 4 రోజులపాటు కస్టడీకి అనుమతించారు. గత ఐదు రోజులపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించామని, తప్పించుకొనేలా ఆయన సమాధానాలిచ్చారని రిమాండ్ పిటిషన్‌లో ఈడీ వెల్లడించింది.

సీఎం జైల్లో ఉంటే తప్పేంటి?

సీఎం పదవి నుంచి కేజ్రీవాల్‌ను తొలగించాలన్న పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ: అరెస్టయి జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని జైలు నుంచే నడిపించడాన్ని అడ్డుకునే చట్టపరమైన నిబంధనలను పిటిషనర్ సుర్జీత్‌సింగ్ యాదవ్ కోర్టుకు వెల్లడించని కారణంగా ఆ పిల్‌ను కొట్టేస్తున్నట్లు ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. 'నిజానికి సీఎం జైలులో ఉండటమనేది చాలా సంక్లిష్టమైన వ్యవహారమే. వాస్తవంలో ఇది ఎన్నో ఇబ్బందులను తెచ్చిపెట్టొచ్చని మేం కూడా భావిస్తున్నాం. అయితే సీఎం జైలులో ఉంటే న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయా?' అని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వరంగ విభాగాలే పరిశీలించాలి. ఇంతకు మించి వ్యాఖ్యానాలు చేయబోం' అని కోర్టు వ్యాఖ్యానించింది. 'స్వయంగా సీఎం జైలులో ఉంటే ప్రభుత్వ విశ్వసనీయతే దెబ్బతింటుంది. చట్టబద్ధపాలనకు ఆటంకాలు తలెత్తుతాయి. ఇది చివరకు ఢిల్లీ రాష్ట్రంలో పాలనావ్యవహారాల స్తంభనకు దారితీస్తుంది' అని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. 'రాష్ట్రపతి పాలన విధించాలనో, గవర్నర్ పాల కొనసాగాలనో మేం ఆదేశాలు ఇవ్వలేము. ఈ అంశాన్ని కేంద్రప్రభుత్వమే పరిశీలించాలి.

ఈడీ విచారణకు మహువా డుమ్మా

కోల్‌కతా: విదేశీ మారక ద్రవ్య నిర్వహణ(ఫెమా) చట్టం ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ దాఖలైన కేసులో తమ ఆఫీస్‌లో విచారణకు హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన సమన్లను తృణమూల్ కాంగ్రెస్ నేత మహువా మొయిత్రా బేఖాతరు చేశారు. గురువారం ఢిల్లీలోని ఈడీ ఆఫీస్‌కు రాకుండా పశ్చిమబెంగాల్‌లో తాను పోటీచేస్తున్న కృష్ణనగర్ ఎంపీ స్థానంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఫెమా కేసులో మొయిత్రాతోపాటు దుబాయ్ వ్యాపారి దర్శన్ హీరానందానీకి విడివిడిగా ఈడీ తాజాగా సమన్లు జారీచేయడం తెల్సిందే. ఈడీ ఆఫీస్‌లో గైర్హాజరుపై కృష్ణనగర్‌లో ప్రచారంలో మొయిత్రా మాట్లాడారు. 'ఈడీ పని ఈడీ చేస్తుంది. నా పని నేను చేసుకుంటా. నాతోపాటు ప్రచారంలో కొనసాగేది ఎవరు?' అని 49 ఏళ్ల మొయిత్రా వ్యాఖ్యానించారు. గతంలోనూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మొయిత్రాను రెండుసార్లు విచారణకు పిలవగా ఇతర అధికారిక పనులు ఉన్నాయని సాకుగా చూపి ఆఫీస్‌కు రాలేదు.

గురుద్వారా చీఫ్‌ను కాల్చి చంపిన దుండగులు



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని ఉద్ధమ్ సింగ్ నగర్ జిల్లాలోని ప్రముఖ నానక్ మత సాహిబ్ గురుద్వారా సాహిబ్ కర సేవా చీఫ్ తార్సెమ్ సింగ్‌ను గుర్తు తెలియని దుండగులు కాల్చి చంపారు. గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో గురుద్వారా ఆవరణలో కూర్చుని ఉండగా బైక్‌పై ఇద్దరు దుండగులు అక్కడికి చేరుకున్నారు. అందులో ఒకడు రైఫిల్‌తో ఆయనపైకి దగ్గర్నుంచి కాల్పులు జరిపాడు. అనంతరం బైక్‌పై పరారయ్యారు. తీవ్రగాయాలతో కిందపడిపోయిన తార్సెమ్ సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సీసీ టీవీ ఫుటేజీలో ఘటన నమోదైందని సీనియర్ ఎస్పీ మంజునాథ్ తెలిపారు. దుండగులిద్దరూ సిక్కులేనని తెలుస్తోందన్నారు.

బెంగళూరు కేఫ్‌లో పేలుడు.. కీలక సూత్రధారి అరెస్ట్

న్యూఢిల్లీ: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో ఈ నెల ఒకటో తేదీన సంభవించిన పేలుడు ఘటన దర్యాప్తులో కీలక అడుగు పడింది. ఈ ఘటనలో కీలక సూత్రధారిగా భావిస్తున్న ముజమ్మిల్ షరీఫ్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బుధవారం అరెస్ట్ చేసింది. సుమారు 18 ప్రాంతాల్లో సోదాలు చేపట్టి కుట్రదారుల్లో ఒకడైన షరీఫ్‌తోపాటు కర్ణాటకలో 12 మందిని, తమిళనాడులో ఐదుగురిని, ఉత్తరప్రదేశ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ తెలిపింది.

పంజాబ్ సీఎం మాన్ తండ్రయ్యారు!

చండీగఢ్: పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు కుమార్తె పుట్టింది. ఈ విషయాన్ని ఆయన గురువారం స్వయంగా ప్రకటించారు. 'ఆ సర్వేశ్వరుడు నాకు కుమార్తెను బహుమతిగా ఇచ్చారు. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారు' అని ఎక్స్‌లో తెలిపారు. కూతురు ఫొటోను షేర్ చేశారు. మొహాలీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్ ప్రసవించారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. మాన్, గుర్‌ప్రీత్‌లకు 2022లో వివాహమైంది. సీఎం మాన్ 2015లో మొదటి భార్య నుంచి విడాకులు తీసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పుత్రికోత్సాహం కలిగిన మాన్‌కు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో విచారణకు హాజరై వెళుతూ సీఎం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు.

న్యాయ వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు!

- స్వార్థ ప్రయోజనాల కోసం కోర్టులు, జడ్జీలపై కొన్ని వర్గాల ఒత్తిళ్లు
- ఇలాంటి వ్యవహారాలపై కఠినచర్యలు తీసుకోండి
- సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు 600 మంది సీనియర్ లాయర్ల లేఖ

న్యూఢిల్లీ: దేశంలో న్యాయ వ్యవస్థను అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కొన్ని వర్గాలు స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి జ్యుడీషియరీపై ఒత్తిడి పెంచుతున్నాయని సీనియర్ న్యాయవాదులు ఆరోపించారు. ప్రధానంగా రాజకీయ నాయకులు అవినీతికి సంబంధించిన కేసుల్లో న్యాయ వ్యవస్థపై ఒత్తిడి అధికంగా ఉంటోందని పేర్కొన్నారు. ఇలాంటి అనుచిత వ్యవహారాలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ మేరకు సీనియర్ అడ్వొకేట్ హరీష్ సాల్వే, బార్ కౌన్సిల్ చైర్‌పర్సన్ మనన్‌కుమార్ మిశ్రా సహా 600 మందికిపైగా సీనియర్ న్యాయవాదులు ఈ నెల 26వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు లేఖ రాశారు. దేశంలో న్యాయ వ్యవస్థను దెబ్బతీసే కుతంత్రాలు సాగుతున్నాయని లేఖలో ఆరోపించారు. రాజకీయ నేతలకు సంబంధించిన కేసుల్లో ఒత్తిళ్ల ద్వారా కోర్టు తీర్పులను సైతం ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కుయుక్తులు మన న్యాయస్థానాల ప్రతిష్ట దెబ్బతీస్తున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి కఠినమైన సమయంలో వెంటనే చొరవ తీసుకొని, అవాంఛనీయ ధోరణులను అడ్డుకట్ట వేయాలని సీజేఐకి న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు దృఢంగా వ్యవహరించాలని కోరారు. స్వార్థపరుల పట్ల 'గౌరవప్రదమైన మౌనం' వహించడానికి ఇది సమయం కాదని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థలోని ఓ వర్గం న్యాయవాదులను లక్ష్యంగా చేసుకొని సీనియర్ లాయర్లు ఈ లేఖ రాసినట్లు తెలుస్తోంది. వారి పేర్లను ప్రస్తావించకుండా లేఖలో పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఘనత వహించిన కొందరు న్యాయవాదులు పగటి పూట అవినీతి రాజకీయ నాయకులను సమర్థిస్తూ, రాత్రిపూట మీడియా ద్వారా జడ్జిలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని లేఖలో మండిపడ్డారు. కోర్టు నుంచి తీర్పులు అనుకూలంగా రాకపోతే వెంటనే బహిరంగంగా విమర్శలు చేస్తున్నారని, సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. తద్వారా న్యాయమూర్తులపై ఒత్తిడి పెంచి, అనుకూలంగా తీర్పులు ఇప్పించుకొనే కుట్రలు సాగిస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రముఖ రాజకీయ నాయకులపై నమోదైన కేసుల్లో సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న సమయంలో సీజేఐకి లాయర్లు ఈ లేఖ రాయడం సంచలనాత్మకంగా మారింది.

అది కాంగ్రెస్ సంస్కృతి: ప్రధాని మోదీ

ఇతరులపై నిందలు వేయడం, భయపెట్టడం, దూషించడం, వేధించడం పాతకాలపు కాంగ్రెస్ పార్టీ సంస్కృతి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ''5 దశాబ్దాల క్రితం కాంగ్రెస్ నేతలు నిబద్ధత కలిగిన న్యాయ వ్యవస్థ కోసం పిలుపునిచ్చారు. వారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిస్సిగ్గుగా ఇతరుల నుంచి నిబద్ధతను కోరుకుంటారు. కానీ, దేశం పట్ల చూపాల్సిన నిబద్ధతకు దూరంగా ఉంటారు. అందుకే 140 కోట్ల మంది భారతీయులు కాంగ్రెస్‌ను తిరస్కరించడంలో ఆశ్చర్యం'' లేదు అని మోదీ గురువారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీనియర్ లాయర్లు లేఖ రాసిన వార్తను ఈ పోస్టుకు ట్యాగ్ చేశారు.

అవినీతికి చట్టబద్ధత కల్పించిన మోదీ: జైరామ్ రమేశ్

ప్రధాని మోదీ న్యాయ వ్యవస్థను సమర్థించే ముసుగులో అదే వ్యవస్థపై సిగ్గులేకుండా దాడి చేస్తున్నారని, ఇది కపటత్వానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గురువారం మండిపడ్డారు. సీజేఐకి లాయర్ల లేఖ నేపథ్యంలో 'ఎక్స్'లో మోదీ తాజా చేసిన పోస్టును తప్పుపట్టారు.


నింగిలో చక్కర్లు కొడుతున్న తేజస్ మార్క్ 1ఏ యుద్ధవిమానం

తేజస్ మార్క్ 1ఏ సక్సెస్

సాక్షి, బెంగళూరు: అధునిక యుద్ధసామర్థ్యాలను సంతరించుకున్న నూతన తేజస్ మార్క్1ఏ తేలికపాటి యుద్ధవిమానం తన తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. గురువారం బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) కేంద్రం నుంచి టేకాఫ్ తీసుకుని 18 నిమిషాలపాటు గాల్లో నిర్దేశిత 'పథం'లో చక్కర్లు కొట్టింది. దీంతో తన లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. తేజస్ ఎంకే1ఏ సిరీస్‌లో ఎల్ఏ5033 మొట్టమొదటి తేలికపాటి యుద్ధ విమానం. హెచ్ఏఎల్‌లోని చీఫ్ టెస్ట్ పైలెట్ గ్రూప్ కెప్టెన్ కెకె వేణుగోపాల్(రిటైర్డ్) ఈ విమానాన్ని నడిపారు. విమాన ప్రయాణం విజయవంతమవడంతో త్వరలోనే ఈ సిరీస్‌తో అధునాతన యుద్ధవిమానాలను తయారుచేసి భారత వాయుసేనకు అప్పగించనున్నారు. ''అంతర్జాతీయ పరిణామాలు, ఆయుధాల సరఫరా వ్యవస్థపై ఒత్తిడి నెలకొన్న ఈ తరుణంలో వేగంగా అధునాతన డిజైన్‌తో స్వదేశీ 4.5 నూతనతరం యుద్ధ విమానాన్ని తయారుచేయడంలో హెచ్ఏఎల్ సఫలీకృతమైంది. ఈ విజయంలో కీలక భాగస్వాములైన రక్షణ శాఖ, భారత వాయుసేన, రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థకు కృతజ్ఞతలు' అని హెచ్ఏఎల్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనంతకృష్ణన్ చెప్పారు. గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణులు, ఆయుధాలు, ఆధునిక ఎలక్ట్రానిక్ రాడార్, కమ్యూనికేషన్ సిస్టమ్, స్వీయ రక్షణకు జామర్ పాడ్‌లను దీనిలో అమర్చారు. 2028 ఫిబ్రవరిలోపు 83 తేజస్ మార్క్1ఏలను తయారుచేసి భారత వాయుసేనకు అందించనుంది. భారత వాయుసేనలో ఇప్పటికే తేజస్ 'ఫ్లయింగ్ డ్యాగర్', 'ఫ్లయింగ్ బుల్లెట్' పేరుతో రెండు బృందాలు ఉన్నాయి.

గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీ మృతి



లక్నో: జైలు శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్, ఉత్తరప్రదేశ్ రాజకీయ నాయకుడు ముఖ్తార్ అన్సారీ(63) గురువారం గుండెపోటుకు గురై బందా మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో మృతి చెందారు. అంతకుముందు, రాత్రి 8.25 గంటల సమయంలో అన్సారీ ఆరోగ్యం విషమించడంతో అధికారులు బందా జిల్లా జైలు నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల బృందం చికిత్సలు చేస్తుండగానే ఆయన గుండెపోటుకు గురై చనిపోయినట్లు బందా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ సునీల్ కౌశల్ పీటీఐకి తెలిపారు. దీంతో, ఉన్నతాధికారులు ఆస్పత్రి వద్ద భారీగా పోలీసులను మోహరించారు. రాష్ట్రవ్యాప్తంగా సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు విధించారు. బందా, మౌ, గాజీపూర్, వారణాసి జిల్లాల్లో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. పొట్టలో నొప్పిగా ఉందని చెప్పడంతో మంగళవారం కూడా ఆస్పత్రిలో 14 గంటలపాటు ఉంచినట్లు అధికారులు చెప్పారు. జైలులో ఆయనపై విష ప్రయోగం జరిగిందని ఇతడి సోదరుడు, ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఆరోపించారు.

5సార్లు ఎమ్మెల్యే.. 60కిపైగా కేసులు

మౌ సదర్ స్థానం నుంచి రెండుసార్లు బీఎస్పీ తరఫున, రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా, ఒకసారి సొంతపార్టీ క్వామీ ఏక్తా దళ్ తరఫున మొత్తం ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వివిధ ఆరోపణలపై యూపీ, పంజాబ్ జైళ్లలో 2005 నుంచి శిక్ష అనుభవిస్తున్నారు. ఈయనపై 60కి పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. యూపీలోని వివిధ కోర్టులో 2022 నుంచి ఇతడిపై ఉన్న 8 కేసుల్లో తీర్పులు వెలువరించాయి. ప్రస్తుతం బందా జైలులో ఉన్నారు.

ప్రముఖ సైకాలజిస్ట్ డేనియల్ కానమన్ కన్నుమూత



న్యూజెర్సీ: ప్రపంచ ప్రఖ్యాత మనస్తత్వవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డేనియల్ కానమన్ (90) బుధవారం కన్నుమూశారు. ఈ విషయాన్ని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రకటించింది. 1993వ సంవత్సరం నుంచి కానమన్ అక్కడే పనిచేస్తున్నారు. ఆర్థిక శాస్త్రం చదవకపోయినా ప్రవర్తనా ఆర్థిక శాస్త్రానికి ఆయన పర్యాయపదంగా మారారు. ఆయన రాసిన పుస్తకం 'థింకింగ్, ఫాస్ట్ అండ్ స్లో' ఎంతో ప్రజాదరణ పొందింది. డేనియల్ కానమన్ సిద్ధాంతాలు సామాజిక శాస్త్రాలను చాలా మటుకు మార్చివేశాయని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్డార్ షాఫిర్ పేర్కొన్నారు. 1934లో ఇజ్రాయెల్‌లోని టెల్‌అవీవ్‌లో కానమన్ జన్మించారు.

ఎలక్షన్ బీట్

మహార్యాలీకి కాంగ్రెస్ సన్నాహాలు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ భారీ ప్రదర్శనకు సిద్ధమైంది. ఈ నెల 31న దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో తలపెట్టిన మహార్యాలీకి కాంగ్రెస్ పార్టీ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ఆమ్ ఆద్మీ పార్టీ సహా ఇండియా కూటమిలోని పార్టీల నేతలు పాల్గొని ర్యాలీలో పాల్గొని సంఘీభావం ప్రకటించనున్నారు. రామ్‌లీలా మైదాన్‌లో మార్చి 31న జరిగే ర్యాలీకి హాజరు కావాలని ఆప్ నాయకులు ఇప్పటికే శ్రేణులకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మహార్యాలీని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం రాత్రి ఢిల్లీ, హరియాణా రాష్ట్రాల పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఐటీ, సీబీఐ తదితర సంస్థలను ఉసిగొల్పుతున్న కేంద్రం తీరును ఇండియా కూటమి నేతలు ఈ ర్యాలీ వేదికగా ఎండగట్టనున్నారు.

టికెట్ దక్కలేదని మనస్తాపం.. ఆత్మహత్యకు యత్నించిన ఎంపీ మృతి



సాక్షి, చెన్నై: వచ్చే లోక్‌సభ ఎన్నికలకుగాను టికెట్ రాలేదన్న మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం(ఎండీఎంకే) సీనియర్ నేత, ఈరోడ్ ఎంపీ ఎ.గణేశమూర్తి(77) చనిపోయారు. ఈ నెల 2వ తేదీన తన నివాసంలో గుర్తు తెలియని విష మాత్రలు తీసుకుని, అస్వస్థతకు గురైన ఆయన్ను స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు ఆ తర్వాత కోయంబత్తూర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. గణేశమూర్తి ఎండీఎంకే టిక్కెట్‌పై 1998లో పళని నుంచి, 2009లో ఈరోడ్ నుంచి ఎంపీ అయ్యారు. అనంతరం 2019లో డీఎంకే గుర్తుపై పోటీ చేసి ఈరోడ్ నుంచి మరోసారి ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే, సీట్ల పంపకాల్లో భాగంగా ఈసారి ఆయనకు టిక్కెట్ దక్కలేదు. తీవ్ర మనస్తాపంతో ఆయన ఆత్మహత్యకు యత్నించినట్లు చెబుతున్నారు. ఆయనకు ఇద్దరు సంతానం. గణేశమూర్తి ఆకస్మిక మరణంపై సీఎం స్టాలిన్, ఎండీఎంకే చీఫ్ వైకో సంతాపం వ్యక్తం చేశారు.

బీజేపీలో చేరిన సావిత్రీ జిందాల్

చండీగఢ్: కాంగ్రెస్‌కు చెందిన హరియాణా మాజీ మంత్రి సావిత్రీ జిందాల్(84) బీజేపీలో చేరారు. ఆమె కుమారుడు, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ కూడా ఇటీవలే బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. గురువారం హిసార్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం నాయబ్ సింగ్ సైనీ, మాజీ సీఎం ఖట్టర్‌ల సమక్షంలో కుమార్తె సీమాతో కలిసి కాషాయ కండువా కప్పుకున్నారు. దివంగత పారిశ్రామికవేత్త, మాజీ మంత్రి ఓపీ జిందాల్ భార్య అయిన సావిత్రి ఈ ఏడాది ఫోర్బ్స్ ఇండియా ప్రకటించిన భారత మహిళా కుబేరుల జాబితాలో సుమారు రూ.2.42 లక్షల కోట్ల ఆస్తులతో అగ్రస్థానంలో ఉన్నారు. గతంలో కాంగ్రెస్‌కు చెందిన భూపీందర్ హుడా ప్రభుత్వంలో ఆమె మంత్రిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో హిసార్‌లో బీజేపీకి చెందిన కమల్ గుప్తా చేతిలో ఆమె ఓటమి పాలయ్యారు. సావిత్రీ జిందాల్ కుమారుడు నవీన్ కాంగ్రెస్ తరఫున 2004–14 కాలంలో కురుక్షేత్ర నుంచి ఎంపీగా పనిచేశారు. కాంగ్రెస్‌ను వీడిన ఆయనకు బీజేపీ మళ్లీ కురుక్షేత్ర టికెట్ ఇవ్వడం గమనార్హం.

44 మందితో సీపీఎం మొదటి జాబితా

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గాను సీపీఎం గురువారం 44 మంది అభ్యర్థుల పేర్లతో మొదటి జాబితా ప్రకటించింది. ఇందులో కేరళలోని అలప్పుజ నుంచి సిట్టింగ్ ఎంపీ ఏఎం ఆరిఫ్, ఆరోగ్యశాఖ మాజీ మంత్రి కేకే శైలజ, రాజ్యసభ ఎంపీ ఇ.కరీం తదితర 17 మంది పేర్లున్నాయి. అదేవిధంగా, పశ్చిమబెంగాల్‌కు చెందిన ముర్షీదాబాద్ నుంచి ఎండీ సలీం తదితర 17 మందికి చోటుదక్కింది. తమిళనాడులో మదురై సిట్టింగ్ ఎంపీ ఎస్.వెంకటేశన్, దిండిగల్ నుంచి ఆర్.సచ్చిదానందంతోపాటు బిహార్, జార్ఖండ్, అస్సాం, అండమాన్ నికోబార్ దీవులు, పంజాబ్, రాజస్తాన్, తెలంగాణ, త్రిపురలోని ఒక్కో స్థానానికి అభ్యర్థుల పేర్లను ప్రకటించింది.

శివసేనలో చేరిన నటుడు గోవిందా



ముంబై: బాలీవుడ్ నటుడు, మాజీ ఎంపీ గోవిందా రాజకీయాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు. గురువారం ఉదయం బాలాసాహెబ్ భవన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో సమావేశమైన అనంతరం ఆయన సమక్షంలో శివసేనలో చేరారు. అనంతరం గోవిందా మాట్లాడుతూ.. మళ్లీ రాజకీయాల్లోకి వస్తానని తాను ఊహించలేదన్నారు. శిండే ముఖ్యమంత్రి అయిన తరువాత ముంబై మరింత సుందరంగా మారిందని, అభివృద్ధిలో దూసుకుపోతోందని కొనియాడారు. నార్త్‌వెస్ట్ ముంబై లోక్‌సభ నియోజకవర్గం నుంచి గోవిందా పోటీ చేయనున్నట్లు శివసేన వర్గాల సమాచారం. గత వారం సీఎం శిందేతో గోవిందా భేటీ అయిన నాటినుంచే ఆయన శివసేనలో చేరతారనే ఊహాగానాలు మొదలయ్యాయి.

నకుల్‌నాథ్ ఆస్తులు రూ.700 కోట్లు

భోపాల్: మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్ నాథ్ కుమారుడు, రాష్ట్రంలో ఏకైక కాంగ్రెస్ ఎంపీ నకుల్‌నాథ్ రూ.700 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ఈయన్ను ఛింద్వారా నుంచి మరోసారి కాంగ్రెస్ నామినేట్ చేసింది. లోక్‌సభ ఎన్నికల మొదటి దశ ఎన్నికలకు గాను మధ్యప్రదేశ్‌లో నామినేషన్లు వేసిన 113 మందిలో నకుల్ ఒకరు. 2019లో లోక్‌సభకు ఎన్నికైన 475 మంది కోటీశ్వరుల్లో నకుల్ నాథ్ మొదటి స్థానంలో ఉన్నట్లు స్వచ్ఛంద సంస్థ అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫామ్స్(ఏడీఆర్) తెలిపింది. గత అయిదేళ్లలో నకుల్ ఆస్తులు రూ.40 కోట్ల మేర పెరిగినట్లు ఏడీఆర్ విశ్లేషించింది.

డీకే సురేశ్ ఆస్తులు రూ.593 కోట్లు

బెంగళూరు: కాంగ్రెస్‌కు చెందిన బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్ రూ.593 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ డీకే శివకుమార్ సోదరుడైన సురేశ్ రూ.339 కోట్ల ఆస్తులున్నట్లు 2019 ఎన్నికలప్పుడు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీన్ని బట్టి, ఐదేళ్లలో ఈయన ఆస్తుల విలువ 75 శాతం మేర పెరిగినట్లు తెలుస్తోంది. మూడు పర్యాయాలు ఎంపీగా పనిచేసిన సురేశ్ మరోసారి ఎన్నికల బరిలో ఉన్నారు.

6న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

జైపూర్: వచ్చే నెల ఆరో తేదీన జైపూర్‌లో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను విడుదలచేయనుంది. ఆ రోజున జైపూర్‌లో జరిగే భారీ బహిరంగ సభలో పార్టీ అగ్రనేతలు ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తారు. ఈలోపు ఈనెలాఖరున ఢిల్లీలో పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఇంకా ప్రకటించని లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేసి వారందరి పేర్లను ప్రకటిస్తారు.

చీకటి యుద్ధాన్ని ఎదుర్కొందాం

నంద్యాల బహిరంగ సభలో సీఎం వైఎస్‌ జగన్‌

> "ఈ ఎన్నికల్లో ఓటు వేసి మన ఐదేళ్ల ఇంటింటి ప్రగతిని వచ్చే ఐదేళ్లు కూడా ముందుకు తీసుకెళ్తూ కొనసాగించాలా? లేక చంద్రబాబుకు ఓటు వేసి పదేళ్లు వెనక్కు వెళ్లాలా? అనేది ప్రతి కుటుంబం ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఈ ఓటుతో మన తల రాతను మనమే రాసుకుంటున్నాం. మీకు, మీ కుటుంబానికి ఎవరి పాలనలో మంచి జరిగిందో ఓటు వేసే ముందు ఆలోచించండి. మంచి చేసిన మనకు ఈ ఎన్నికలు ఓ జైత్రయాత్ర అయితే, మోసం చేసిన బాబుకు చివరి ఎన్నికలు కావాలి."
>
> – సీఎం వైఎస్‌ జగన్‌


సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్‌


సభలో సీఎం జగన్‌ పిలుపు మేరకు సెల్‌ఫోన్‌లోని టార్చ్‌లైట్లను ఆన్‌చేసి మేము సిద్ధం అంటూ నినదిస్తున్న ప్రజలు

సాక్షిప్రతినిధి, కర్నూలు : పొత్తులు, జిత్తులు, ఎత్తులతో మరోసారి మోసం చేసేందుకు వస్తున్న చంద్రబాబు మాటలను పొరపాటున కూడా నమ్మొద్దని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సూచించారు. విశ్వసనీయతకు, వంచనకు మధ్య.. ధర్మానికి, అధర్మానికి మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో ఈ ప్రభుత్వం వల్ల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సైనికులేనన్నారు. చీకటి రాతలు రాసేందుకు మనకు ఈనాడు, ఏబీఎన్, టీవీ–5.. ఇంకా ఇలాంటి వారు తోడు లేరని.. ఎల్లో ఛానెల్స్, పత్రికలను బాబులాగా పోషించలేదని చెప్పారు. అందువల్ల సెల్‌ ఫోన్‌ ఉన్న ప్రతి ఒక్కరూ మనకు ఒక ఎడిటర్‌ అని, ఒక ఛానల్‌ ఓనర్‌ అని దిశా నిర్దేశం చేశారు. సోషల్‌ మీడియా ద్వారా ఎల్లో మీడియాను ఎదుర్కోవాలని చెప్పారు. మనందరి ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రతి ఇంటా వివరించాలని కోరారు. పేదవాడి భవిష్యత్‌కు అండగా నిలబడేందుకు, మంచి చేసిన మన ప్రభుత్వానికి తోడుగా ఉండేందుకు, 175 ఎమ్మెల్యేలు, 25 ఎంపీలు గెలిపించేందుకు, రాష్ట్రం రూపు రేఖలు మార్చేందుకు మళ్లీ మనమంతా సిద్ధమై ఈ చీకటి యుద్ధాన్ని ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. ఓటుతో మన తల రాతను మనమే రాసుకుందామని చెప్పారు. 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్ర చేపట్టిన సీఎం జగన్‌ గురువారం ఆళ్లగడ్డ నుంచి నంద్యాలకు చేరుకుని బహిరంగ సభలో ప్రసంగించారు. జనం గుండెల్లో గుడి కట్టుకున్న మనల్ని ఎదుర్కొనేందుకు వారు జెండాలతో జత కట్టారని.. సంక్షేమాన్ని, ఇంటింటి అభివృద్ధిని కాపాడుకునేందుకు తరలి వచ్చిన ప్రజా సైన్యంతో నంద్యాల ఒక సముద్రంలా మారి 'సిద్ధం' అంటోందన్నారు. సీఎం జగన్‌ ఇంకా ఏమన్నారంటే..

డబుల్‌ సెంచరీ సర్కారును స్థాపిద్దాం

- గతంలో చంద్రబాబు అబద్ధాలు, మోసాల పాలన చూసిన తర్వాత.. అందుకు భిన్నంగా ఐదేళ్లుగా మన ప్రభుత్వం చేసిన మంచిని చూసిన తర్వాత.. ఒక నరకాసురుడు, రావణుడు, దుర్యోధనుడు మరోసారి పైకి లేచి తాము సింహాసనం ఎక్కుతామంటే ప్రజలు ఎలా ఒప్పుకోరో, అలాగే నారా వారి పాలన మళ్లీ తీసుకువస్తానంటే ఒప్పుకోం అంటూ నంద్యాల నుంచి ఏలూరు వరకు, కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజలంతా నినదిస్తున్నారు.
- ప్రజల రాజ్యాన్ని, రైతు రాజ్యాన్ని, ఇంటింటి అభివృద్ధిని, మహిళ, అవ్వాతాతల సంక్షేమ రాజ్యాన్ని కూలగొడతామని మూడు పార్టీలు చూస్తున్నాయి. వీరికి తోడు పరోక్షంగా మరో జాతీయ పార్టీ కూడా 'అదృశ్య హస్తం'గా తోడుగా ఉంది. ఇటువైపు చూస్తే జగన్‌ ఒకే ఒక్కడు. అటువైపు చంద్రబాబు, దత్తపుత్రుడు వీరికి తోడు బీజేపీ. పరోక్షంగా మరో పార్టీ కాంగ్రెస్‌. వీరు సరిపోనట్టు ఓ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5. ఇంతమంది కేవలం ఒకే ఒక జగన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. వీరిని అడ్డుకునేందుకు మీరంతా సిద్ధమా? (సిద్ధమే అని జనం నినాదాలు చేశారు).
- పేదవాడి భవిష్యత్తును వెలుగు నుంచి చీకటిలోకి తీసుకుపోదామని పొత్తులమారి, జిత్తుల మారి, ఎత్తులమారి పార్టీలన్నీ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయి. ఆ కుట్రలను, కుతంత్రాలను ఎదుర్కొనేందుకు అందరం సిద్ధమవుదాం. మరోసారి ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేసి, వేయించి 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీలకు 25 స్థానాలు మొత్తంగా 200 స్థానాలు సాధించి డబుల్‌ సెంచరీ సర్కారును స్థాపించేందుకు సిద్ధమవుదాం.

విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం

- మీ జగన్‌ అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లలో 77 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో ఏ ప్రభుత్వం తీసుకురాని మార్పులను తీసుకువచ్చాడని గర్వంగా చెబుతున్నా. మీ గ్రామంలోనే మార్పు కన్పిస్తోంది. ఈ రోజు గ్రామంలోకి, పట్టణంలోకి అడుగుపెట్టిన వెంటనే గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం.. అందులో పది మంది అదే ఊరి పిల్లలు పని చేస్తూ కనిపిస్తారు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే సెలవైనా, ఆదివారమైనా వలంటీర్లు అవ్వాతాతల వద్దకు వచ్చి పింఛన్‌ ఇస్తున్నారు.
- రైతు భరోసా కేంద్రం, నాడు–నేడు ద్వారా మారిన ఇంగ్లిష్‌ మీడియం స్కూళ్లు, విలేజ్‌ క్లినిక్‌లు కన్పిస్తాయి. బర్త్‌ సర్టిఫికెట్, పింఛన్, రేషన్‌ కార్డు లాంటి ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ వెళ్లి తలుపుతట్టి అందిస్తున్న పాలన మీ బిడ్డ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్న తర్వాతే జరుగుతోంది.
- రూ.2.70 లక్షల కోట్లు బటన్‌నొక్కి అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి రూపాయి లంచం, వివక్ష లేకుండా అర్హులకు పథకాలు అందించాం. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, సున్నావడ్డీ, విద్యా దీవెన, వసతి దీవెన, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, పింఛన్‌ కానుక, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, జగనన్నతోడు, చేదోడు, 31 లక్షల ఇళ్లపట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం, చదువులకు అనుసంధానం చేస్తూ కళ్యాణమస్తు, షాదీతోఫా అందిస్తున్నాం.
- అక్కచెల్లెమ్మల ఫోన్‌లలో దిశ యాప్‌ను పెట్టాం. బటన్‌ నొక్కితే చాలు, ఆపదలో ఉంటే పది నిమిషాల్లో పోలీసులు నేరుగా వచ్చి ఆదుకుంటున్నారు.
- నాడు–నేడులతో ప్రభుత్వ బడులను మార్చింది.. గోరుముద్ద, విద్యాకానుక, ఇంగ్లిషు మీడియం, బైజూస్‌ కంటెంట్, పిల్లల బైలింగ్వల్‌ పుస్తకాలు, ట్యాబ్‌లు, తరగతి గదుల్లో ఐఎఫ్‌బీ ప్యానల్స్, డిజిటల్‌ తరగతులు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్‌ టీచర్లు, సీబీఎస్‌ఈ సిలబస్, ఐబీ ఇలాంటివన్నీ మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నపుడే వచ్చాయి.

వైద్య, వ్యవసాయ రంగంలో సమూల మార్పులు

- వైద్య రంగంలో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మారుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏకంగా 54 వేల మంది డాక్టర్లు, నర్సులు, పారామెడికల్‌ సిబ్బంది రిక్రూట్‌ అయ్యారు. నాణ్యమైన మందులు అందిస్తున్నాం. ప్రతి జిల్లాలో మెడికల్‌ కాలేజీ ఏర్పాటు చేస్తున్నాం. నంద్యాలలోనూ మెడికల్‌ కాలేజి కన్పిస్తోంది. ఆరోగ్యశ్రీని విస్తరించాం. ఏకంగా 2,300 రోగాలకు వర్తించేలా తీసుకెళ్లాం. రూ.25 లక్షల దాకా ఉచితంగా వైద్యం అందిస్తున్నాం.
- ఆపరేషన్‌ తర్వాత విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెబితే, నెలకు రూ.5 వేల చొప్పున ఆరోగ్య ఆసరా ద్వారా సాయం చేస్తున్నాం. గ్రామ స్థాయిలో 10,600 విలేజ్‌ హెల్త్‌ క్లినిక్‌లు, అర్బన్‌ హెల్త్‌ క్లినిక్‌లు కనిపిస్తున్నాయి. కొత్తగా 108, 104 వెహికల్స్‌ 1500 కొనుగోలు చేశాం. గ్రామ స్థాయిలో విలేజ్‌ క్లినిక్‌లను డాక్టర్లతో అనుసంధానం చేశాం. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చాం. పేదవాడికి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నాం. ఇవన్నీ మీ బిడ్డ ప్రభుత్వంలోనే జరిగాయి.
- రైతన్నలకు ఏటా వైఎస్సార్‌ రైతు భరోసా ద్వారా రూ.13,500 ఇస్తూ, ఈ ఐదేళ్లలో రూ.67,500 అందించాం. 10,778 ఆర్బీకేలు విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా రైతన్నకు తోడుగా పని చేస్తున్నాయి. పగటిపూటే 9గంటల నాణ్యమైన విద్యుత్, ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్‌ సబ్సిడీ, చంద్రబాబు మూసేసిన చిత్తూరు డెయిరీ లాంటివి తెరిపించాం. అమూల్‌ ద్వారా పాడి రైతులకు తోడుగా నిలవడం ద్వారా లీటర్‌పై రూ.10–20 దాకా అదనంగా వచ్చేలా చేశాం. 22–ఏ కింద నుంచి తొలగించి 19.17 లక్షల మంది రైతులకు 34.75 లక్షల ఎకరాల్లో పూర్తి హక్కులు కల్పిస్తున్నాం.

సామాజిక న్యాయంలో సువర్ణాధ్యాయం

- సామాజిక న్యాయం విషయంలో సువర్ణాధ్యాయాన్ని లిఖించాం. తొలిసారి నామినేటెడ్‌ పదవుల్లో ఏకంగా చట్టం చేసి 50 శాతం పదవులు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చాం. మంత్రి మండలి నుంచి 68 శాతం పదవులు ఈ వర్గాలకు ఇచ్చాం. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుండి 4 లక్షల ఉద్యోగాలు ఉంటే.. ఇప్పుడు అదనంగా 2.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. వీటిలో 80 శాతం నా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు ఉన్నారు. ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు డీబీటీ ద్వారా నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశాం. ఇందులో 75 శాతం పైగా ఈ సామాజిక వర్గాలకే అందాయి.
- అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా మూడు రాజధానులతో పాటు కొత్తగా 13 జిల్లాలు ఏర్పాటు చేశాం. 17 మెడికల్‌ కాలేజీలు ఏర్పాటు చేశాం. రూ.16 వేల కోట్లతో 4 సీపోర్టులు, రూ.3,800 కోట్లతో పది ఫిషింగ్‌ హార్బర్‌లు కడుతున్నాం. రాష్ట్రంలో 15 వేల గ్రామ, వార్డు సచివాలయాలు కన్పిస్తున్నాయి. 11 వేల ఆర్బీకేలు ఉన్నాయి. 11 వేల విలేజ్‌ క్లినిక్‌లు ఉన్నాయి. ఇదంతా రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని ఘట్టం.

బాబు ధ్యాసంతా దోచుకోవడమే..

'రాజకీయాల్లో నాయకుడు అంటే 'అదిగో మా నాయకుడు' అని కాలర్‌ ఎగరేసుకుని చెప్పేలా ఉండాలి. విలువలు, విశ్వసనీయత అనే పదానికి అర్థం ఉండాలి. మోసం చేయడానికి, కుర్చీ ఎక్కడానికీ, ఏ గడ్డి అయినా తినేందుకు సిద్ధంగా ఉండే నాయకులు ఈ రాష్ట్రానికి కావాలా? ఇవాళ అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో రూ. లక్షలు కన్పిస్తాయి. ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు మీ బిడ్డ మీ ఖాతాల్లో జమ చేశాడని గర్వంగా చెబుతున్నా. చంద్రబాబు ఇలా ఎందుకు చేయలేదంటే.. ఆయన ధ్యాసంతా దోచుకోవడం, పంచుకోవడమే. మంచి జరిగింది మన వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వ హయాంలోనే. మంచి చేసిన జగన్‌ మీ అందరిని నమ్ముకుని ఎన్నికల బరిలో ఉంటే, చెడు చేసిన బాబు పొత్తులు, కుట్రలు, మోసాల్ని నమ్ముకుని రాజకీయం చేస్తున్నారు' అని సీఎం జగన్‌ అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు బుగ్గన, శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, బిజేంద్రారెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధీర్, కాటసాని రామిరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డిలను గెలిపించాలని కోరారు. మంత్రి పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

ఇందులో ఒక్కటైనా నెరవేర్చారా?

- ఈ కరపత్రంలో చంద్రబాబు సంతకం ఉంది. మోడీ ఫొటో ఉంది. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌ ఫొటో ఉంది. 2014లో ఈ కరపత్రంతో పాటు ఇందులోని హామీలను టీవీల్లో ఊదరగొట్టారు.
- రైతుల రుణమాఫీపై తొలి సంతకం చేస్తానన్నాడు. రూ.87,612 కోట్లు, రైతుల రుణమాఫీ చేశాడా?
- డ్వాక్రా రుణాలు పూర్తిగా రద్దు చేస్తానన్నారు. రూ.14,205 కోట్లు. ఒక్కరూపాయి అయినా చేశారా?
- ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ. 25 వేలు బ్యాంకులో డిపాజిట్‌ చేస్తానన్నారు. మీ ఇంట్లో లేదా పక్కింట్లో పుట్టిన ఏ ఆడబిడ్డకైనా డిపాజిట్‌ చేశారా?
- ఇంటింటికీ ఉద్యోగం.. లేదంటే రూ.2 వేల నిరుద్యోగభృతి ఇస్తానన్నారు. 60 నెలల్లో ప్రతి కుటుంబానికి 1.20 లక్షలు ఇవ్వాలి. ఇచ్చారా?
- అర్హులైన వారందరికీ 3 సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు ఇస్తానన్నారు. ఒక్కరికైనా ఒక సెంటయినా ఇచ్చారా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్, చేనేత పవర్‌ లూమ్స్, మహిళల రక్షణ కోసం ఉమెన్‌ ప్రొటెక్షన్‌ ఫోర్స్, సింగపూర్‌కు మించి రాష్ట్రం అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి నగరంలో హైటెక్‌ సిటీ నిర్మిస్తామన్నారు. ఈ హామీలన్నీ 2014లో మోడీ, చంద్రబాబు, దత్తపుత్రుడి ఫోటోతో పంపారు. ఇందులో ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా? ప్రత్యేక హోదా ఇచ్చారా? (లేదు.. లేదు.. అని ప్రజలు నినాదాలు) ఇవన్నీ ఇవ్వకపోగా సూపర్‌ సిక్స్‌.. సెవెన్‌ అంటూ రంగురంగుల మేనిఫెస్టోతో మోసం చేసేందుకు మళ్లీ వస్తున్నారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్‌ కారు కొనిస్తారట.


సభాస్థలి వద్దకు వెళుతున్న సీఎం జగన్‌కు అపూర్వ స్వాగతం పలుకుతున్న ప్రజలు

చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేయలేకపోయారు?

- మనం చేసిన మంచిలో కనీసం 5 శాతం అయినా చంద్రబాబు చేసి ఉంటే.. ఇదే ఎల్లో మీడియా చంద్రబాబు కంటే మరో నాయకుడు ప్రపంచంలో లేరని ఢంకా బజాయించేవారు. మీ బిడ్డకు దక్కిన బహుమతి ఏదో తెలుసా! పేదల గుండెల్లో సంతోషం. వారి మనసుల్లో ఆత్మవిశ్వాసం, పిల్లల చదువుల్లో విప్లవం, వారి కుటుంబాల్లో సాధికారత, అవ్వాతాతల ముఖంలో చిరునవ్వులు.. ఇవీ జగన్‌కు కావల్సిన అవార్డులు, రివార్డులు. వీటి కోసమే జగన్‌ ఆరాట పడతాడు. ప్రయాస పడతాడు.
- 14 ఏళ్ల సీఎంగా చేసిన చంద్రబాబు పేరు చెబితే ఒక్క స్కీం కూడా గుర్తుకు రాదు. ఆయన వెన్నుపోటుకు బ్రాండ్‌ అంబాసిడర్‌ అని మాత్రం అందరికీ తెలుసు. బాబు పేరు చెబితే వ్యవసాయం దండగ, బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు, రుణామాఫీ అని రైతులను నిలువునా ముంచేయడం, బాబు వస్తే కరువొస్తుందనే నానుడి, రెయిన్‌గన్‌తో కరువును జయించిన ఓ పిట్టలదొర గుర్తుకు వస్తాడు. ఉచిత విద్యుత్‌ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాలనే మాటలు గుర్తుకు వస్తాయి.

ప్రభం'జనం'

నంద్యాల జిల్లాలో సీఎం జగన్‌ బస్సు యాత్రకు నీరాజనాలు

జన సంద్రంలా నంద్యాల.. బహిరంగ సభకు పోటెత్తిన జనం • నేడు కర్నూలు జిల్లాలో కొనసాగనున్న యాత్ర


నంద్యాల పట్టణంలో సీఎం జగన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: జనం.. జగన్‌ కలిస్తే ప్రభంజనమేననే మరోసారి రుజువైంది. సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర రెండో రోజు జైత్రయాత్రలా కొనసాగింది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ క్రాస్‌ వద్ద సీఎం జగన్‌ బస చేసిన శిబిరం వద్దకు గురువారం ఉదయం నుంచే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సీఎంను కలిశారు. ప్రజల కేరింతల మధ్య రెండో రోజు బస్సు యాత్ర ఉదయం 9.30 గంటలకు మొదలైంది. ఆళ్లగడ్డ క్రాస్‌ నుంచి నల్లగట్ల వరకూ కిలోమీటర్ల కొద్దీ జనం బారులు తీరారు. సీఎం తమ వద్దకు చేరుకోగానే ఆయన ప్రయాణిస్తున్న బస్సుపై బంతిపూల వర్షం కురిపించారు. నల్లగట్ల వద్ద అంబులెన్స్‌కు దారి ఇచ్చిన జగన్‌.. శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల సమీపంలో నూతన జంట వెంకటస్వామి, కావేరి దంపతులను ఆశీర్వదించారు. ఎర్రగుంట్ల గ్రామముఖ ద్వారంలో సీఎం జగన్‌ బస్సుపై బంతి పూలవర్షం కురిపిస్తూ హారతులు ఇస్తూ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఎర్రగుంట్ల గ్రామ ప్రజలతో మమేకమై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రతి ఇంటికీ మంచి చేశారంటూ సీఎం జగన్‌పై ఎర్రగుంట్ల వాసులు ప్రశంసలు కురిపించారు. అనంతరం ఎర్రగుంట్ల నుంచి శిరివెళ్ల మండలం గోవిందపల్లి, చాబోలు మీదుగా బస్సు యాత్ర సాగింది. చాబోలులో భోజన విరామం తరువాత నంద్యాల నియోజకవర్గం నూనెపల్లికు చేరుకున్న సీఎం జగన్‌ బస్సుయాత్రకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు.


కర్నూలు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న సీఎం జగన్‌కు పూలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

నంద్యాలలో జనహోరు..

నంద్యాలలో గురువారం సాయంత్రం 4.30 గంటలకు గవర్నమెంట్‌ ఆర్ట్స్‌ కాలేజ్‌ గ్రౌండ్‌లో బహిరంగ సభ ప్రారంభమవుతుందని ప్రకటించినా ఉదయం 11 గంటల నుంచే జనప్రవాహం మొదలైంది. ఎండ వేడి పెరిగేకొద్దీ జనం పెరిగారు. 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభాప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. ఆళ్లగడ్డ క్రాస్‌ నుంచి నూనెపల్లి వరకూ జనం అడుగడుగునా బ్రహ్మరథం పట్టడంతో గంట ఆలస్యంగా సాయంత్రం 5.30 గంటలకు సీఎం జగన్‌ చేరుకున్నారు. సభా వేదికపైకి సీఎం జగన్‌ చేరుకోగానే జనం హర్షధ్వానాలు, కేరింతలతో సభా ప్రాంగణం హోరెత్తింది. సీఎం జగన్‌ ర్యాంప్‌ వాక్‌ చేస్తూ అభివాదం చేస్తున్నప్పుడు జనం జయహో జగన్‌ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. సంక్షేమాభివద్ధి పథకాల ద్వారా చేసిన మంచి, రాష్ట్రం రూపురేఖలు మార్చేలా చేసిన అభివృద్ధిని వివరించడంతోపాటు 2014–19 మధ్య టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన మోసాలను సీఎం జగన్‌ ఎండగట్టారు. మళ్లీ ఇప్పుడు అదే కూటమితో చంద్రబాబు పోటీ చేస్తుండటాన్ని ప్రస్తావించినప్పుడు విశేష స్పందన లభించింది. పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు.. రాష్ట్రం రూపురేఖలు మార్చేందుకు.. మరో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకోవడానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా అంటూ సీఎం జగన్‌ పిలుపునిచ్చినప్పుడు మేమంతా సిద్ధం అంటూ దిక్కులుపిక్కటిల్లేలా జనం నినదించారు.


కర్నూలు జాతీయ రహదారి వద్ద సీఎం జగన్‌ను చూసి కేరింతలు కొడుతున్న విద్యార్థులు

విద్యార్థుల ఉత్సాహం..

నంద్యాల సభ రాత్రి 7 గంటలకు ముగియగా అనంతరం బస్సు యాత్ర తిరిగి ప్రారంభమైంది. సీఎం జగన్‌ బస్సు యాత్ర కడప–కర్నూలు జాతీయ రహదారిపై నిర్వహించనున్నట్లు తెలియడంతో ఆర్‌జీఎం కాలేజీ విద్యార్థులు మధ్యాహ్నం నుంచే భారీగా తరలి వచ్చారు. రాత్రి 8.30 గంటలకు సీఎం జగన్‌ బస్సు చేరుకోగానే విద్యార్థులు హర్షధ్వానాలు చేయగా వారికి సీఎం జగన్‌ అభివాదం చేశారు. అక్కడి నుంచి బస్సు యాత్ర పాణ్యం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. సుగాలిమిట్ట వద్ద ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సీఎం జగన్‌కు ఘనస్వాగతం పలికారు. హుస్సేనాపురం, ఓర్వకల్లుల్లో రాత్రి 9.30 గంటలైనా జనం రోడ్డుపైనే నిలబడ్డారు. నన్నూర్‌ వద్ద నారాయణ కాలేజీ విద్యార్థులను యాజమాన్యం నియంత్రించినా లెక్క చేయకుండా భారీ ఎత్తున రహదారిపైకి చేరుకుని బంతిపూల వర్షంతో స్వాగతం పలికారు. నన్నూర్‌ వద్ద బస్సు యాత్ర కర్నూలు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. కర్నూలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇంతియాజ్‌ సారథ్యంలో నేతలు అక్కడ సీఎం జగన్‌కు ఘనస్వాగతం పలికారు. పెద్దటేకూరు, చిన్నకొట్టాల, కె.మార్కాపురం క్రాస్, నాగలాపురం మీదుగా పెంచికలపాడు వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం జగన్‌ రాత్రి 11.06 గంటలకు చేరుకున్నారు.


నంద్యాల పట్టణంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి


నంద్యాలలోని మేమంతా సిద్ధం సభాస్థలి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌






నంద్యాల జిల్లాలో బస్సుయాత్ర సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన అవ్వలను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



దివ్యాంగుని సమస్యలు తెలుసుకుంటూ..



సీఎం వైఎస్ జగన్‌తో బాలికల కరచాలనం



చిన్నారితో సీఎం జగన్ హై ఫై

పేదల తలరాతలు మార్చే ఎన్నికలివి

ఎర్రగుంట్లలో ప్రజలతో ముఖాముఖిలో సీఎం జగన్

సాక్షి, నంద్యాల

వైఎస్సార్‌సీపీ 58నెలల పాలనలో గ్రామాల రూపురేఖలు సమూలంగా మారిపోయాయని, ఈ ఎన్నికలు పేదల తలరాతలను మార్చే ఎన్నికలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఇవాళ మన ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు మారాయి. సర్కారు స్కూళ్లలో డిజిటల్ బోధన వచ్చింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశాం. వైఎస్సార్ ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి గ్రామాన్ని జల్లెడ పడుతూ పేదవాడికి ఆరోగ్య పరీక్షలతోపాటు మందులు కావాలన్నా ఇంటి వద్దకే తెచ్చి ఇస్తున్నాం' అని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందజేస్తున్నామన్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆళ్లగడ్డలోని రాత్రి బస ప్రాంతం నుంచి గురువారం ఉదయం మొదలైంది. అక్కడి నుంచి సీఎం జగన్ ఉదయం 11 గంటల సమయంలో ఎర్రగుంట్ల గ్రామానికి చేరుకుని రైతులు, వివిధ వర్గాల ప్రజలను కలుసుకుని మాట్లాడారు. ప్రతి అక్కచెల్లెమ్మ తమ సొంత కాళ్లమీద నిలబడేలా రుణాలు, ప్రభుత్వ పరంగా తోడ్పాటు అందిస్తున్నాం. మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ దిశ యాప్ తీసుకొచ్చాం. ఆపదలో ఉన్న అక్కచెల్లెమ్మలను నిమిషాల వ్యవధిలో ఆదుకుంటున్నాం. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేశామని గొప్పలు చెప్పుకునే వారు ఏ రోజూ కనీసం ఆలోచన చేయని విధంగా మీ బిడ్డ ఈ 58 నెలల వ్యవధిలో గొప్ప మార్పులు తెచ్చాడు. వ్యవస్థల్లో చోటు చేసుకున్న విప్లవాత్మక మార్పులను గమనించండి. ఈ మార్పు కొనసాగడం ఎంత అవసరమో ఆలోచన చేయండి.

దేవుడి దయవల్ల ఇంత మంచి చేయగలిగాం. వ్యవస్థను మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు మీరు సలహాలు ఇవ్వవచ్చు.




ఎర్రగుంట్లలో ప్రజలతో ముఖాముఖిలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, హాజరైన జనసందోహంలో ఓ భాగం

అందరికీ ఓ విన్నపం..

ఎన్నికల కోడ్ కారణంగా పథకాలకు ఆటంకం తలెత్తకుండా ఈ మధ్య కాలంలో ఈబీసీ నేస్తం, చేయూత బటన్‌లు నొక్కాం. ఇది వరకు వారం రోజుల్లోనే ఖాతాల్లో డబ్బులు జమయ్యేవి. కోడ్ కారణంగా పది రోజులు అటు ఇటుగా పథకాల లబ్ధి నేరుగా మీ ఖాతాల్లోకి జమ అవుతుంది. దీని గురించి ఆందోళన చెందవద్దు.

చిన్న పిల్లాడు చేసిన పనులు.. మీరెందుకు చేయలేదు?

నేను చాలా చిన్న పిల్లాడిని. మన ప్రభుత్వం కంటే ముందు మీరు చాలా ప్రభుత్వాలను చూశారు. నాకన్నా వయసులో పెద్దోళ్లు, ఎంతో అనుభవం ఉందని గొప్పలు చెప్పుకునే వారు ముఖ్యమంత్రులుగా పని చేశారు. ముఖ్యంగా రాష్ట్రం విడిపోయాక నా కంటే ముందు 75 ఏళ్ల ముసలాయన పరిపాలన చేశారు. ఆయన ఏకంగా 14 ఏళ్లు పాలించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. నేను వయసులో ఆయన కంటే చాలా చిన్నోడిని. నేను ఒకటే అడుగుతున్నా. ఇంత చిన్నోడు చేసిన పనులను 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఏనాడైనా చేశారా? మీరంతా దీనిపై ఆలోచన చేయాలి. ఈ రోజు ఏ రకంగా మన బతుకులు, జీవితాలు మారాయి? ఏ రకంగా వ్యవస్థల్లో మార్పులు తేగలిగాం? అనే విషయాలను అందరూ ఒక్కసారి గమనించాలని కోరుతున్నా.

ఒక్క ఊరికే రూ.49 కోట్ల ఉపకారం

కేవలం ఒక్క ఎర్రగుంట్ల గ్రామానికే 58 నెలల వ్యవధిలో వివిధ పథకాల ద్వారా డీబీటీతో రూ.49 కోట్ల మేర లబ్ధి చేకూర్చగలిగాం. ఈ గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి? ఎంత మంది లబ్ధిదారులున్నారు? ఎవరెవరికి ఏయే పథకాలు అందాయి? అనే విషయాలను కాసేపటి క్రితమే అడిగి తెలుసుకున్నా. గ్రామంలో 1,496 ఇళ్లు ఉండగా, 1,391 ఇళ్లకు ప్రభుత్వ పథకాల ద్వారా రూ.48,74,34,136 అందాయి. 93 శాతం మందికి ప్రభుత్వ పథకాలు అందాయి. ఒక్క ఈ ఊరులోనే వైఎస్సార్ పెన్షన్ కింద రూ.16.52 కోట్లు పంపిణీ చేశాం. వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.6.81 కోట్లు, అమ్మఒడితో 1,043 మంది తల్లులకు రూ.4.69 కోట్లు అందజేశాం. వైఎస్సార్ ఆసరా కింద రూ.3.88 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద 492 మంది అక్కచెల్లెమ్మలకు రూ.2.96 కోట్లు, జగనన్న విద్యా దీవెన కింద 837 మందికి రూ.2.46 కోట్లు, హౌసింగ్ కింద రూ.2.75 కోట్లు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2.24 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీతో రూ.1.13 కోట్లు, జగనన్న వసతి దీవెన కింద రూ.కోటి, సున్నా వడ్డీ కింద రూ.86 లక్షలు, క్రాప్ ఇన్సూరెన్స్ కింద రూ.67 లక్షలు, జగనన్న తోడు కింద ఇచ్చిన రుణాలు రూ.41.30 లక్షలు, చేదోడు కింద రూ.40 లక్షలు, కాపు నేస్తం కింద రూ.31 లక్షలు, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.21.48 లక్షలు అందజేశాం. మీ బిడ్డ గత 58 నెలల వ్యవధిలో ఒక్క గ్రామానికే ఇంత మంచి చేశాడనే విషయాన్ని గమనించాలని కోరుతున్నా. వీటితోపాటు గోరుముద్ద, ఇళ్ల స్థలాలు, బియ్యం కార్డులు, విద్యా కానుక, సంపూర్ణ పోషణ కింద మరింత అదనంగా లబ్ధి చేకూర్చాం. ఎక్కడా ఎవరూ లంచం అడగడం లేదు. అర్హత ఉంటే చాలు పారదర్శకంగా ప్రయోజనాన్ని అందిస్తున్నాం. చివరిగా.. ఈ ముఖాముఖిలో వీలైనంత ఎక్కువ మందితో మాట్లాడించే ప్రయత్నం చేశాం. సమయాభావం వల్ల అందరికీ మాట్లాడే అవకాశం దొరకలేదు. మీ అందరికీ స్లిప్పులు ఇచ్చాం. మీరు ఏదైనా సలహాలు ఇవ్వాలనుకుంటే అందులో రాసి బాక్సులో వేస్తే నా దగ్గరికి వస్తాయి. వ్యవస్థను ఇంకా బాగుపరిచే సూచనలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటాం.

రైతన్నకు ప్రతి అడుగులో అండగా..

ప్రతి రైతన్నను చేయి పట్టుకుని నడిపిస్తున్నాం. రైతన్నల కోసమే ఆర్బీకేలు ఏర్పాటు చేశాం. ప్రతి ఎకరాను ఈ–క్రాప్ చేస్తున్నాం. ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నాం. గత పాలనలో బ్యాంకులలో పంట రుణాలు అందకుంటే ఇన్సూరెన్స్ ఎలా చేసుకోవాలో తెలియని దుస్థితి. అలాంటిది ఈ రోజు గ్రామంలోనే ఆర్బీకేలను తీసుకొచ్చి ఈ క్రాప్, ఉచిత పంటల బీమా, పంట నష్టపోతే సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ సబ్సిడీ అందజేస్తున్నాం. రైతన్నకు పెట్టుబడి సాయంగా రూ.13,500 చొప్పున మీ బిడ్డ హయాంలోనే అందుతోంది.

మీ కుటుంబంతో చర్చించండి..

గత ఎన్నికల్లో నాకు ఓటు వేయని వారిని కూడా అడుగుతున్నా. ఓటు వేయలేదని వివక్ష చూపించలేదు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధిని అందజేస్తున్నాం. ఈ రోజు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు వచ్చాయి. విద్యార్థులకు డిజిటల్ బోధన అందిస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. ఒకవైపు ఇంగ్లిష్, మరోవైపు తెలుగు మీడియంతో ప్రచురించిన పుస్తకాలను పిల్లలకు అందజేస్తున్నాం. విద్యార్థులకు ట్యాబ్‌లు కూడా ఉచితంగా ఇస్తున్నాం. మీరంతా ఒక్కసారి ఇంటికి వెళ్లి ఆలోచన చేయండి. ఈ ప్రభుత్వంలో సాకారమైన మార్పులను గమనించండి. ఇది కేవలం ఎమ్మెల్యే, ఎంపీలను ఎన్నుకునే ఎన్నిక కాదు. ఈ ఎన్నికలు పేదల తలరాతలను మార్చే ఎన్నికలు. అందరూ ఇంటికి వెళ్లాక ఒక్కసారి మీ భార్య, పిల్లలు, ఇంట్లో అవ్వాతాతలతో మాట్లాడండి. అందరూ కలిసికట్టుగా నిర్ణయం తీసుకోండి.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి మేలు



ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని పనులను సీఎం జగన్ చేసి చూపించారు. తెలంగాణలో నాడు–నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేయాలని తలపెట్టి చేతులెత్తేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సర్కారు బడుల రూపురేఖలు మార్చి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు.

– హుసేన్‌బాషా, ఎర్రగుంట్ల

ఎన్నో పథకాలు అందించారు



నాలాంటి వారికి అన్నగా, పిల్లలకు మేనమామలా, అవ్వాతాతలకు మనవడిగా ఎంతో మందికి కుమారుడిగా ముఖ్యమంత్రి జగన్ ఎన్నో సంక్షేమ పథకాలను అందించారు. అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారు. మళ్లీ మీరే ముఖ్యమంత్రి కావాలని మేమంతా కోరుకుంటున్నాం. ఈ ఎన్నికల్లో 175కి 175 స్థానాలు సాధిస్తారు.

– పుష్పలత, ఎర్రగుంట్ల

రూ.5 లక్షలు బీమా వచ్చింది



మా అత్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందింది. నాలుగుసార్లు అమ్మ ఒడి పథకం వర్తించింది. అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారు.

– పద్మావతి, గోవిందపల్లె

స్కూళ్ల రూపురేఖలు మార్చారు



ప్రభుత్వ పాఠశాలలను ముఖ్యమంత్రి జగన్ అన్ని విధాలుగా తీర్చిదిద్దారు. ఇంగ్లిష్ మీడియం విద్యను అందిస్తున్నారు. గతంలో మా పాఠశాలకు ప్రహరీ లేదు. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉండేవి. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. మరుగుదొడ్ల వసతి కల్పించారు. గోరుముద్ద ద్వారా చిక్కీలు, గుడ్లు, రాగిజావతో ఆరోగ్యకరమైన భోజనం అందిస్తున్నారు.

– చర్విత, విద్యార్థిని, శిరివెళ్ల

ఆదుకున్న సీఎంఆర్‌ఎఫ్..



నా కుమారుడికి చిన్న వయసులోనే గుండెకు రంధ్రం పడి పెద్ద ఆరోగ్య సమస్య తలెత్తింది. ఆపరేషన్‌కు రూ.6 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆపరేషన్ చేశారు. నా కుమారుడు బతికి బయటపడ్డాడంటే సీఎం జగన్ చలవే. ఆయనే మళ్లీ సీఎం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.

– నాగరాజు దంపతులు, ఎర్రగుంట్ల

– కోవెలకుంట్ల/శిరివెళ్ల

నేడు ఎమ్మిగనూరులో సీఎం జగన్ సభ

సాక్షి, అమరావతి: మేమంతా సిద్ధం బస్సు యాత్ర మూడో రోజైన శుక్రవారం కర్నూలు జిల్లా పెంచికలపాడులో సీఎం వైఎస్ జగన్ రాత్రి బస చేసిన ప్రాంతం నుంచి ప్రారంభం కానుంది. బస్సు యాత్ర శుక్రవారం షెడ్యూల్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం వెల్లడించారు. ఉదయం 9 గంటలకు సీఎం జగన్ పెంచికలపాడు నుంచి బయలుదేరి రామచంద్రపురం, కోడుమూరు, హంద్రీ కైరవడి, గోనెగండ్ల మీదుగా రాళ్లదొడ్డికి చేరుకుంటారు. ఆ ప్రాంతంలో భోజన విరామం తీసుకుంటారు. అనంతరం కడిమెట్ల మీదుగా ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ సొసైటీ గ్రౌండ్ దగ్గరకు చేరుకొని మధ్యాహ్నం 3గంటలకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం అరెకల్, ఆదోని క్రాస్, విరుపాపురం, బెణిగేరి, ఆస్పరి, చిన్నహుల్తి, పత్తికొండ బైపాస్ మీదుగా కేజీఎస్ ఫంక్షన్ హాల్‌కు దగ్గరలో ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం చేరుకుంటారు.



ఆళ్లగడ్డ వద్ద ప్రజలతో మాట్లాడుతుండగా అంబులెన్స్ రావడంతో పక్కకు తప్పుకుని దారి ఇచ్చిన సీఎం జగన్, ఇదే విధంగా మరో అంబులెన్స్‌కు కూడా సీఎం జగన్ దారి ఇచ్చారు

పాదయాత్ర హామీలన్నీ నెరవేర్చారు

చంద్రబాబు 600కిపైగా హామీలిచ్చి 2014లో అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ సంపూర్ణంగా అమలు చేసిన పాపాన పోలేదు. మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుంది. మాకు మళ్లీ అధికారం ఇస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తాం, పిల్లలకు మంచి బడులు కట్టిస్తాం, మంచి చదువులు చెప్పిస్తాం, మంచి వైద్యం అందుబాటులోకి తీసుకొస్తాం, మహిళలకు ఆర్థిక చేయూతనందిస్తామని చెబుతున్నాం. కానీ, ప్రతిపక్షాలు ఏం మాట్లాడుతున్నాయో ఒక్కసారి గమనించండి. ఒకరేమో తమ దగ్గర ఎర్ర పుస్తకంలో పేర్లు రాసుకున్నామని, అధికారంలోకి వస్తే వారి అంతు చూస్తానని బెదిరిస్తున్నారు. ఇంకొకరేమో తాము అధికారంలోకి వస్తే మీరంతా గుడుల్లో, బడుల్లో దాక్కోవాలంటూ రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారు. పగటి కలలు కనడం మానండి. వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. సీఎంగా మళ్లీ ప్రమాణ స్వీకారం చేసేది జగనే.

– గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ

పేదల కోసం పెత్తందార్లతో యుద్ధం

సీఎం జగన్ ప్రజలతో నేరుగా మాట్లాడటం ఈ రోజు ప్రారంభిస్తున్నది కాదు. నేను విన్నాను.. నేను ఉన్నాను.. అంటూ జనం కోసం నిలబడిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి మన జగనన్న. ఓదార్పు యాత్రలో, పాదయాత్రలో ప్రజల బాధలు విన్నారు. ప్రజా ప్రభుత్వం ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో ఈ ఐదేళ్లలో చేసి చూపారు. పేదల కోసం పెత్తందార్లతో యుద్ధం చేస్తున్నారు. ఈ రోజు అక్కచెల్లెమ్మల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం అలాగే ఉండాలంటే ఏం చేయాలో వినడానికి వచ్చారు. సామాన్యుల ఎజెండాను, అణగారిన వర్గాల అజెండాను మోసుకుంటూ, నడుచుకుంటూ వచ్చారు. కట్టకట్టుకుని వస్తున్న పెత్తందారులందరినీ ఓడించడానికి మనకు తగిన సమయం వచ్చింది.

– వాసిరెడ్డి పద్మ, ఏపీ మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్

రెండో రోజు యాత్ర సాగిందిలా..

మేమంతా సిద్ధం అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర రెండో రోజు గురువారం ఉదయం ప్రారంభమైంది.

- రాత్రి బస చేసిన శిబిరం నుంచి ఉదయం 9.40 గంటలకు సీఎం జగన్ బయటకు వచ్చారు.
- 9.45 గంటలకు ఆళ్లగడ్డ నుంచి బయలుదేరి నల్లగట్ల, బత్తలూరు మీదుగా ఎర్రగుంట్ల గ్రామానికి చేరుకున్నారు.
- 11.10 గంటలకు ఎర్రగుంట్ల గ్రామంలో వివిధ వర్గాల ప్రజలతో ముఖాముఖిలో పాల్గొని ప్రసంగించారు.
- 12.50 గంటలకు సభ నుంచి బయటకు వచ్చి వెంకటాపురం, శిరివెళ్ల మెట్ట మీదుగా దీబగుంట్ల గ్రామానికి చేరుకున్నారు.
- మధ్యాహ్నం 2 గంటలకు దీబగుంట్ల వద్ద ఎమ్మెల్యే శిల్పా రవి పుష్పగుచ్ఛాలు అందజేసి నంద్యాల నియోజకవర్గంలోకి స్వాగతం పలికారు.
- 2.40 గంటలకు చాబోలు వద్ద భోజన విరామం కోసం ఆగారు.
- సాయంత్రం 4.40 గంటలకు చాబోలు నుంచి రైతు నగరం క్రాస్ మీదుగా బొమ్మలసత్రం ఫ్లై ఓవర్ మీదుగా ఆర్ట్స్ కాలేజీలో ఏర్పాటు చేసిన సభ వద్దకు 5.30 గంటలకు చేరుకున్నారు.
- 5.40 గంటల నుంచి 7.10 వరకు ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు.
- 8.10 గంటలకు ఆర్‌జీఎం కాలేజీ వద్దకు చేరుకుని విద్యార్థులకు అభివాదం చేశారు.
- 9.40 గంటలకు పాణ్యం, సుగాలిమెట్ట, హుసేనాపురం, ఓర్వకల్లు మీదుగా నన్నూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు.
- పెద్దటేకూరు, మార్కాపురం క్రాస్ మీదుగా రాత్రి 11.06 గంటలకు బస చేయనున్న పెంచికలపాడుకు చేరుకున్నారు.

కాశీం ఆకాంక్ష ఫలించింది

నంద్యాల (అర్బన్): ఓదార్పు యాత్రలో భాగంగా 2010లో ఈ ప్రాంతానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఆయన ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించాడు నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన దూదేకుల కాశీం. సీఎం జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన్ను కలిసేంత వరకు చెప్పులు ధరించనని అప్పుడే స్నేహితులు, గ్రామస్తుల సమక్షంలో శపథం చేశాడు. గురువారం సీఎం నంద్యాల సభలో అతని కోరిక నెరవేరింది. నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి సహకారంతో సభా వేదికపైకి వచ్చి సీఎం జగన్‌తో సెల్ఫీ దిగడంతో కాశీం ఆనందానికి అవధులు లేవు. చిన్నప్పటి నుంచి కాశీంకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ఎనలేని అభిమానం. ఆయన అకాల మరణంతో కొన్నిరోజుల పాటు అన్నపానీయాలు మానేశాడు. అనారోగ్యంతో ఇబ్బందులు పడ్డాడు. వైఎస్సార్ తనయుడు జగన్ ఓదార్పు యాత్ర చూసి ఉప్పొంగి పోయాడు. 14 ఏళ్ల అతని ఎదురుచూపులకు తెరపడిందని, ఓర్పుతో ఎదురు చూపులు చూసినదానికి ఫలితం దక్కిందని అతని స్నేహితులు, గ్రామస్తులు పేర్కొంటున్నారు.



సీఎం జగన్‌తో కలిసి సెల్ఫీ తీసుకుంటున్న కాశీం

అఖిలప్రియ హల్‌చల్

- మేధావులతో సీఎం ముఖాముఖి కార్యక్రమంలోకి దూసుకెళ్లేందుకు యత్నం

ఆళ్లగడ్డ: సమయం సందర్భం ఏదైనా సరే సోషల్ మీడియాలో హైలెట్ కావడమే పనిగా పెట్టుకున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ.. తాజాగా సీఎం జగన్ సమావేశం నిర్వహిస్తున్న స్టేజీ దగ్గరకు వెళ్తానని చేసిన రసాభాసా గురువారం శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం సమావేశం నిర్వహించేందుకు ఆళ్లగడ్డలో బస చేసిన సీఎం వైఎస్ జగన్ గురువారం ఉదయం నంద్యాలలో నిర్వహించే బహిరంగ సభకు ఆళ్లగడ్డ నుంచి బయలు దేరారు. బస్సు యాత్ర చేసుకుంటూ ఎర్రగుంట్లలో నియోజకవర్గంలోని మేధావులతో ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న అఖిలప్రియ తన అనుచరులతో సమావేశం జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని సమావేశ శిబిరం వైపు దూసుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు ఆమెను నిలువరించి అక్కడి నుంచి పంపించేశారు. అఖిలప్రియ తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఆమెకు షోకాజ్ నోటీసులిచ్చినట్టు ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎన్నికల అధికారి తెలిపారు.



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కమలాపురం నియోజకవర్గ నాయకులు



ఎర్రగుంట్లలో దివ్యాంగ దంపతులను ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం



సీఎం జగన్‌తో మహిళల సెల్ఫీ ఆనందం




బత్తలూరు వద్ద సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో నమస్కరిస్తున్న మహిళలు, కండక్టర్

క్లుప్తంగా...

'సాక్షి' విలేకరిపై భువనేశ్వరి ప్రైవేట్ సెక్యూరిటీ దౌర్జన్యం

ఆగిరిపల్లి: విధి నిర్వహణలో ఉన్న 'సాక్షి' విలేకరిపై నారా భువనేశ్వరి ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది దౌర్జన్యం చేశారు. గురువారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి, ఆగిరిపల్లిలో భువనేశ్వరి 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగిరిపల్లిలో ఆమె మాట్లాడుతుండగా 'సాక్షి' విలేకరి నాగరాజు ఫొటోలు తీశారు. భువనేశ్వరి ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఫొటోలు తీయొద్దంటూ 'సాక్షి' విలేకరిని దుర్భాషలాడుతూ దౌర్జన్యంగా ఫోన్ లాక్కొన్నారు. కొంతమంది టీడీపీ కార్యకర్తలు దాడి చేయబోతుండగా అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై సురేంద్ర కుమార్ అడ్డుకున్నారు. టీడీపీ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిపై 'సాక్షి' విలేకరి నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక టీడీపీ నేతలు జరిగిన దానికి క్షమాపణ కోరి, నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ సమక్షంలో నాగరాజుకు ఫోన్ అందజేశారు. అనంతరం 'సాక్షి' విలేకరి నాగరాజు ఫిర్యాదు ఉపసంహరించుకున్నారు.

'అసలు సిసలైన గిరిజనులకు అరకు ఎంపీ సీటివ్వండి'

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): అరకు పార్లమెంట్ స్థానాన్ని నిజమైన గిరిజనులకు కేటాయించాలని కురుపాం మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు కేకేవీవీవీ సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. అరకు ఎంపీ అభ్యర్థిగా బోగస్ ఎస్టీ కొత్తపల్లి గీతను ప్రకటించడం ఆదివాసీలను అవమానించి, హక్కులను కాలరాయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. సీట్ల కేటాయింపులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వైఫల్యం స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికైనా బీజేపీ అధిష్టానం అరకు పార్లమెంట్ స్థానాన్ని నిజమైన గిరిజనులకు కేటాయించాలని వారు కోరారు.

బీసీలపై బాబు కపట ప్రేమ

బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్



గుంతకల్లు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గత్యంతరం లేక చంద్రబాబు బీసీలపై ఎనలేని ప్రేమ ప్రదర్శిస్తున్నారని, గతంలోనూ ఇలాగే వంచించి ఘోరంగా మోసం చేశారని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన గుంతకల్లులో విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరిన బీసీల తోకలు కత్తిరిస్తానన్న బాబు మాటలే అందుకు నిదర్శనమన్నారు. అనంతపురం పర్యటనలో చంద్రబాబు.. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, ప్రత్యేక బడ్జెట్‌తోపాటు బీసీ సబ్‌ప్లాన్ తీసుకొస్తానని కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని ఆయన మాటలు బీసీలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఇక గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని, మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడానికి బడుగు, బలహీన వర్గాలన్నీ సిద్ధంగా ఉండాలని కోరారు.

ఎన్నికల సైకిళ్లు స్వాధీనం

- ఓటర్లకు పంచేందుకు సైకిళ్లు సిద్ధం చేసిన టీడీపీ నేత ధూళిపాళ్ల



పొన్నూరు: ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేత, పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర అక్రమాలకు తెరలేపారు. ఓటర్లకు పంచిపెట్టేందుకు తన స్వగ్రామమైన పొన్నూరు మండలం చింతలపూడిలో టీడీపీ నాయకుడికి చెందిన రైస్‌మిల్లులో పెద్ద ఎత్తున సైకిళ్లు దాచిపెట్టారు. సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు గురువారం ఆ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో 567 సైకిళ్లు సీజ్ చేశారు. ఈ సైకిళ్లు వేలంలో దక్కించుకున్నట్లు శ్రీధర్ అనే వ్యక్తి తెలిపారు.

చంద్రబాబుకు అమ్ముడుపోయిన

మంద కృష్ణకు బుద్ధి చెబుతాం

- ముప్పై ఏళ్లుగా మాదిగలకు వెన్నుపోటు పొడుస్తున్నాడు
- ఎన్నికలు వచ్చే సరికి జాతిని తాకట్టు పెడుతున్నాడు
- ఈ నెల 30న గుంటూరు సభకు ఎలా వస్తాడో చూస్తాం
- ఇకపై మంద కృష్ణ ఆటలను సాగనివ్వం
- మాదిగల ద్రోహులు బాబు, మంద కృష్ణలకు గుణపాఠం తప్పదు
- ఏపీ మాదిగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల ధ్వజం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘాల నాయకులు

సాక్షి, అమరావతి: వర్గీకరణ పేరుతో ముప్పై ఏళ్లుగా మాదిగలకు వెన్నుపోటు పొడుస్తున్న మంద కృష్ణ ఎన్నికలు వచ్చేసరికి చంద్రబాబుకు తమ జాతిని తాకట్టు పెట్టడానికి సిద్ధమవుతాడని మాదిగ సంఘాలు మండిపడ్డాయి. చంద్రబాబుకు ప్యాకేజీకి అమ్ముడుపోయిన మంద కృష్ణ ఈ నెల 30న గుంటూరులో జరిగే సభకు ఎలా వస్తాడో చూస్తామని హెచ్చరించాయి. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ మాదిగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. రాష్ట్రంలోని 25 మాదిగ సంఘాల నాయకులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మనువాద బీజేపీ, మోసకారి చంద్రబాబు కూటమికి ఎందుకు ఓటెయ్యాలని పలువురు మాదిగ సంఘాల నేతలు ప్రశ్నించారు. మనువాద విష కౌగిలికి మాదిగలను చేర్చేందుకు మంద కృష్ణ ప్రయత్నిస్తున్నాడని, చంద్రబాబుతో అక్రమ సంబంధం నెరపుతున్నాడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదిస్తానని హామీ ఇచ్చిన బీజేపీ పదేళ్లు అయినా పట్టించుకోలేదని, వర్గీకరణను అడ్డుపెట్టుకుని చంద్రబాబు మాదిగల ఓట్లతో రాజకీయ లబ్ధి పొందుతున్నాడని మండిపడ్డారు. ఇకపై మంద కృష్ణ ఆటలు సాగనివ్వబోమని, అతని ఎత్తులను కచ్చితంగా తిప్పి కొడతామని మాదిగ నేతలు హెచ్చరించారు. మాదిగల ద్రోహులు బాబు, మంద కృష్ణలకు గుణపాఠం చెబుతామన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయాలను సంఘాల నేతలు మీడియాకు వెల్లడించారు.

బాబు దగా చేస్తే.. జగన్ మేలు చేశారు

నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ సమాఖ్య అధ్యక్షులు పరిశపోగు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ద్వారా చంద్రబాబు హయాంలో మాదిగలకు 22 వేల ఉద్యోగాలొచ్చాయని మంద కృష్ణ పచ్చి అబద్ధాలు చెబుతున్నాడన్నారు. ముప్పై ఏళ్లుగా టీడీపీ చంకలో దూరిన మంద కృష్ణ రాష్ట్రంలోని మిగిలిన పార్టీలకు మాదిగలను దూరం చేసి జాతికి తీరని ద్రోహం చేశాడన్నారు. చంద్రబాబు పాలనలో మాదిగలకు జరిగిన మేలు ఏమిటో ఒక్కటి కూడా మంద కృష్ణ చెప్పలేదన్నారు. ఓట్లు పొందుతున్న చంద్రబాబు తగినన్ని సీట్లు కేటాయించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలకు పది సీట్లు కేటాయించడం సంతోషకరమన్నారు. చంద్రబాబు హయాంలో పది శాతం మాదిగ కుటుంబాలకు మేలు జరిగితే గొప్పలు చెప్పుకునేవారని, అదే సీఎం వైఎస్ జగన్ పాలనలో 90 నుంచి 96 శాతం మాదిగ కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. ఊరి చివర ఉండే వెలివాడల్లోని తమ ఇళ్ల వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఎస్సీ శ్మశాన వాటికల సమస్యను అర్థం చేసుకుని ప్రతి ఊరిలో ఒక ఎకరం చొప్పున కేటాయించేలా ప్రభుత్వం చర్య తీసుకుందన్నారు. మాదిగలకు నిజమైన మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు ఇవ్వడం తమ ధర్మం అన్నారు.

ఏ హక్కుతో ఏపీకి వస్తావ్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ.. మాదిగలకు ద్రోహం చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మంద కృష్ణ మద్దతివ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్ కార్డు, ఓటు హక్కు కూడా లేని మంద కృష్ణకు ఏ హక్కు ఉందని ఎన్నికలు వచ్చే సరికి మాదిగ జాతి మొత్తాన్ని చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నాడని ప్రశ్నించారు. ప్యాకేజీకి అమ్ముడుపోయిన మంద కృష్ణ తన తీరు మార్చుకోకపోతే ఈ నెల 30న నిర్వహిస్తున్న సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. గుంటూరులో ఎలా అడుగుపెడతాడో చూస్తామని, నీ సంగతి తేలుస్తామని అల్టిమేటం ఇచ్చారు. మాదిగలను అంబేడ్కర్ వాదం నుంచి మనువాదం వైపు నడిపే మంద కృష్ణ ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. మాట్లాడిన వారిలో సువర్ణరాజు(ఏపీ ఎమ్మార్పీఎస్), చెరుకూరి కిరణ్(మాదిగ కార్పొరేషన్ సాధన సమితి), కొరిటిపాటి ప్రేమ్‌కుమార్(మాదిగ మహాసేన), మంద క్రిష్టయ్య(ఆర్ఎంఆర్‌పీఎస్), గడ్డం బాపిరాజు(ఐఎన్ఎఫ్ఓఆర్ఎం), పొన్నెకంటి రమేష్(మాదిగ దండోర), జానయ్య (జైభీమ్ ఎమ్మార్పీఎస్), ఈపూరి ఆదాం(బహుజన పరిరక్షణ సమితి), జుజ్జువరపు రవిప్రకాష్(దళితసేన), మల్లవరపు నాగయ్య(అమరావతి ఎమ్మార్పీఎస్), వరదరాజులు(నేషనల్ ఎమ్మార్పీఎస్), పులిదాసు(ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ సమితి), బి.మేరీ కుమారి ఉన్నారు.

మాదిగలకు మేలు చేసిన జగన్

మాదిగలను చంద్రబాబు దగా చేస్తే సీఎం వైఎస్ జగన్ మేలు చేశారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు స్పష్టం చేశారు. మాదిగ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి సంఘీభావంగా హాజరైన వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సీఎం వైఎస్ జగన్ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రూ.వేల కోట్లతో సంక్షేమాన్ని అందించారన్నారు. మాదిగలను అడ్డుపెట్టుకుని అన్ని రకాలుగా లబ్ధిపొందిన మంద కృష్ణ మోసాలు ఇక సాగవన్నారు. పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి ఆంధ్రప్రదేశ్ మాదిగ జాతిని చంద్రబాబుకు తాకట్టు పెడితే సహించేదిలేదన్నారు. తమకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్ వెంటే మాదిగలు ఉన్నారని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీకి బీసీల సంపూర్ణ మద్దతు

రీజినల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని కలిసిన తెనాలి మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ మస్తానమ్మ



ఎంపీ విజయసాయిరెడ్డితో డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ అవినాష్, డాక్టర్ అఖిలేష్

తెనాలి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలోని బీసీలు, మరీ ముఖ్యంగా యాదవ వర్గీయులంతా మద్దతు తెలుపుతున్నారని తెనాలి మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ మస్తానమ్మ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ తన కుమారులు డాక్టర్ అవినాష్, డాక్టర్ అఖిలేష్‌తో సహా నెల్లూరులో రాజ్యసభ సభ్యుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గురువారం కలిశారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్న ధీమాను ఆమె వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని యాదవ వర్గీయులంతా వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని విజయసాయిరెడ్డికి తెలియజేశారు. డాక్టర్ మస్తానమ్మ భర్త తాడిబోయిన వెంకటేశ్వరరావు కూడా వైద్యులే. ఆయన ఆకస్మిక మరణంతో మస్తానమ్మ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. నెల్లూరుకు చెందిన రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుకు వీరు సమీప బంధువులు. ఆయన ప్రోత్సాహంతో మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు.

కాపులను విస్మరించిన బీజేపీకి గుణపాఠం చెబుతాం

- ఆరు ఎంపీ, పది ఎమ్మెల్యే సీట్లలో ఒక్కటి కూడా కాపులకు ఇవ్వలేదు
- నాలుగు సీట్లు సొంత సామాజిక వర్గానికి ఇప్పించుకున్న పురందేశ్వరి, బాబు
- పురందేశ్వరి, చంద్రబాబుపై ప్రధాని మోదీ, అమిత్‌షా, నడ్డాలకు ఫిర్యాదు
- కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి తదితర కాపు ఉపకులాలను పూర్తిగా విస్మరించిన బీజేపీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కాపు ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు కాపు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ కోటిపల్లి అయ్యప్ప, రాష్ట్ర కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్ గురువారం బహిరంగ లేఖ విడుదల చేశారు. పురందేశ్వరి, చంద్రబాబు కలిసి కాపులకు చేసిన అన్యాయాన్ని ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు మెయిల్ ద్వారా తెలియజేశామన్నారు. జాతీయ పార్టీ అయిన బీజేపీ రాష్ట్రంలో మాత్రం టీడీపీకి బీ టీమ్‌గా మారిపోయిందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పోటీ చేస్తున్న ఆరు ఎంపీ, పది అసెంబ్లీ స్థానాల్లో కనీసం ఒక్కటి కూడా కాపులకు కేటాయించకపోవడం దారుణమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రబాబు మాత్రం మొత్తం 16 సీట్లలో ఒక ఎంపీ, మూడు అసెంబ్లీ స్థానాలను తమ సొంత సామాజికవర్గానికి ఇప్పించుకున్నారని చెప్పారు. బీజేపీకి కేటాయించిన మొత్తం సీట్లలో నాల్గవ వంతు వాటాను వారి సామాజికవర్గానికి ఇప్పించుకున్న వారు కాపులను మాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. బీజేపీ టికెట్ల కేటాయింపులో సమన్యాయాన్ని, సామాజిక న్యాయాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. బీసీ ఓటర్లు అత్యధికంగా ఉండే ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ సీటును బీజేపీ కమ్మ సామాజికవర్గానికి కేటాయించడం విడ్డూరమన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు స్థానికంగా ఉన్నప్పటికీ స్థానికేతరురాలైన పురందేశ్వరికి రాజమండ్రి ఎంపీ సీటు కేటాయించడం శోచనీయమన్నారు. కనీసం రాజమండ్రి రూరల్ సీటైనా సోము వీర్రాజుకు కేటాయించకపోవడం సరికాదన్నారు. ఇందుకు నిరసనగా అనకాపల్లి, రాజమండ్రి, నరసాపురం, రాజంపేట లోక్‌సభ నియోజకవర్గాల నుంచి కాపు ఐక్యవేదిక, సోషల్ జస్టిస్ ఫోరమ్‌ల పక్షాన కాపు, తెలగ, బలిజ అభ్యర్థులను పోటీలో పెడుతున్నట్టు కోటిపల్లి అయ్యప్ప, పెద్దిరెడ్డి మహేష్ ప్రకటించారు. కమలం గుర్తుకు కాపులు ఎందుకు ఓటు వేయకూడదో సవివరంగా తెలియజేస్తూ కరపత్రాలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తామని తెలిపారు.

గోదావరి నీళ్లు సీమకు తీసుకువస్తా



చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోతున్న కార్యకర్తలు

- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తా మద్దతు ఇవ్వండి
- ప్రజాగళం సభలు సూపర్ హిట్.. సిద్ధం సభలు అట్టర్ ఫ్లాప్
- రాప్తాడు, బుక్కరాయసముద్రం, కదిరి ప్రజాగళం సభల్లో చంద్రబాబు

రాప్తాడు/రాప్తాడు రూరల్/అనంతపురం ఎడ్యుకేషన్/బుక్కరాయసముద్రం/కదిరి: తమ కూటమి ప్రభుత్వం ఏర్పడగానే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం రాప్తాడు, బుక్కరాయసముద్రం, కదిరిలో జరిగిన 'ప్రజాగళం' సభల్లో ఆయన మాట్లాడారు. ప్రజాగళం ఎక్కడ చూసినా సూపర్ హిట్ అన్నారు. జగన్ నిర్వహించిన సిద్ధం సభలు ఫ్లాప్ షోలు అయ్యాయన్నారు. డబ్బులు, మద్యం ఇచ్చినా జగన్ సభలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రావడం లేదన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకం అన్నారు. అందుకే మూడు పార్టీలు కలిసి బరిలోకి వచ్చామన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించడం కోసం మద్దతు ఇవ్వాలని కోరారు. మొన్నటి వరకు బెదిరించారు, కేసులు పెట్టారని.. ఇప్పుడు ఎన్నికల కమిషన్ వచ్చింది కాబట్టి ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ధరలు పెంచితే తాగుడు మానేస్తారని మద్యపానానికి కొత్త నిర్వచనం చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. గోదావరి నీళ్లు రాయలసీమకు తీసుకువచ్చే బాధ్యత టీడీపీ, ఎన్డీఏ తీసుకుంటుందన్నారు. ఆడబిడ్డలకు ఆడబిడ్డ నిధి కింద కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ప్రతి ఒక్కరికీ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామన్నారు. తొలి సంతకం మెగా డీఎస్సీ మీద పెడతా అన్నారు. మాదిగలకు ఏ.బీ.సీ.డీ తెచ్చింది టీడీపీనే అన్నారు.

చంద్రబాబు బాదుడు.. తమ్ముళ్ల తాగుడు!

బాబు ప్రసంగాన్ని విని తట్టుకోవాలంటే బ్రాందీ కిక్ ఉండాల్సిందే అని తెలుగు తమ్ముళ్లు భావించారు. రాప్తాడులో ఆయన ప్రసంగం అలా మొదలు పెట్టారో లేదో సభకు వచ్చిన వారు ఇలా బ్రాందీ షాపు బాట పట్టారు. ఆయన సభ వద్ద కన్నా బ్రాందీ షాప్ వద్దే జనం ఎక్కువ గుమిగూడారు అని టీడీపీ నేతలే చర్చించుకోవడం వినిపించింది. ఇక రాప్తాడు, బుక్కరాయసముద్రం, కదిరిలో చంద్రబాబు సభలు జనం లేక వెలవెలబోయాయి. వచ్చిన ఆ అరకొర మంది చంద్రబాబు ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయారు. కదిరిలో చేపట్టిన రోడ్ షో జనంలేక ఫ్లాప్ అయింది. ఇక్కడ చంద్రబాబు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు కనీసం 300 మంది కూడా హాజరు కాలేదు. ఇక హైదరాబాద్ హైకోర్టు వద్ద వైఎస్ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన స్క్రిప్ట్‌నే చంద్రబాబు చదివి విన్పించడంతో ఆశ్చర్యపోవడం జనం వంతు అయింది. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ ఎత్తేస్తామన్న బీజేపీతో పొత్తు పెట్టుకుని తప్పుచేశావని సభలో బాబుకు వినబడేలా గట్టిగా కొందరు వ్యాఖ్యానించారు.

అంబులెన్స్‌కు దారి కూడా ఇవ్వలేదు

బుక్కరాయసముద్రంలో బాబు ప్రసంగిస్తున్న సమయంలో సభా ప్రాంతానికి అత్యవసర చికిత్స కావాల్సిన ఓ వ్యక్తితో తాడిపత్రి వైపు నుంచి అంబులెన్స్ వచ్చింది. సైరన్ కొడుతున్నా ఆ అంబులెన్స్‌ను ఏ మాత్రం పట్టించుకోని చంద్రబాబు తన ప్రసంగం కొనసాగించారు. టీడీపీ కార్యకర్తలు కూడా ఆ వాహనానికి దారి ఇవ్వలేదు. దీంతో అంబులెన్స్ డ్రైవర్ వాహనాన్ని చిన్న సందుల్లో తిప్పుకుంటూ నానా తిప్పలు పడుతూ అనంతపురం రోడ్డు వైపు వెళ్లారు. ఇది చూసి స్థానికులు బాబుపై మండి పడ్డారు.

దళిత ఎమ్మెల్యే అభ్యర్థిపై బాబు వ్యంగ్యాస్త్రాలు

శింగనమల నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు గురించి బుక్కరాయసముద్రం సభలో బాబు వ్యంగ్యంగా మాట్లాడారు. ''ఇక్కడ శింగనమల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్ జగన్ టిప్పర్ డ్రైవర్‌ను నిలబెట్టారు'' అంటూ నవ్వుతూ వ్యంగ్యంగా మాట్లాడారు. చంద్రబాబు నిరుపేద దళితుడిని అవమానించడం హేయమని అక్కడున్న వారే చర్చించుకున్నారు.

నా ఛాలెంజ్ నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటా

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత ఉన్న రాష్ట్రంలోని ఏ ఒక్క వ్యక్తికైనా ప్రభుత్వ పథకం అందలేదని గానీ, ఇంటి స్థలం రాలేదని గానీ, పెన్షన్ రాలేదని గానీ అనిపిస్తే.. తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయబోనని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఛాలెంజ్ విసిరారు. గురువారం ఆయన కృష్ణాజిల్లా గుడివాడలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వస్తే టిడ్కో గృహాల రుణాలు రద్దు చేస్తామని, పేదలకు ఇళ్లు కట్టించేందుకు పెద్ద మొత్తంలో రుణాలు ఇప్పిస్తామని టీడీపీ నాయకులు సొల్లు కబుర్లు చెబుతున్నారని ధ్వజమెత్తారు. మూడు సార్లు ఎమ్మెల్యేలుగా చేసిన తండ్రీ, కొడుకులు గానీ, 14 ఏళ్లు సీఎంగా చేసిన బాబుగానీ, మున్సిపల్ చైర్మన్ గానీ పేదల ఇళ్ల ఏర్పాటు కోసం ఒక్క ఎకరా పొలం కొన్నారా అని ప్రశ్నించారు. 2004 నుంచి 2019 వరకు తాను ఎన్నికల ప్రచారం నిమిత్తం ప్రజల వద్దకు వెళ్లినప్పుడు ప్రతి వార్డు లోనూ 400 నుంచి 500 మంది తమకు ఇళ్ల స్థలాలులేవని, పెన్షన్‌లు రావడం లేదని, ఇల్లు కట్టించి ఇవ్వాలని అడిగేవారన్నారు. 2019 నుంచి సీఎం జగన్ అమలు చేస్తున్న ఆసరా, చేయూత, అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, పేదలకు ఇళ్ల తదితర సంక్షేమ పథకాలేవీ తమకు అందలేదని ఇంతవరకు ఏ ఒక్కరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. కులం, మతం, ప్రాంతం తారతమ్యం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చిన సీఎం జగన్ పాలన ఈ దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందన్నారు. బాబు ఏ ఒక్కరికైనా ఇంటి పట్టా ఇచ్చినట్లుగానీ, ఇంటి నిర్మాణానికి హౌసింగ్ బోర్డు ఇచ్చిన రుణం మాఫీ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు గానీ నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాలు వదిలేస్తానని కొడాలి నాని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రచార రథంపై రాళ్లదాడి

వాహనం అద్దాలు ధ్వంసం

బొల్లాపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రచార రథంపై టీడీపీ అల్లరి మూకలు రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరులో జరిగింది. బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ ప్రచార వాహనం ప్రచారం నిర్వహిస్తుండగా టీడీపీకి చెందిన కొందరు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో ప్రచార వాహనం అద్దాలు పగిలాయని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల అండదండలతో ఆ పార్టీ కార్యకర్తలు వేముల మంత్రాలుతో పాటు మరో ముగ్గురు రాళ్ల దాడికి పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని బండ్లమోటు ఎస్ఐ డి చెన్నకేశవులు తెలిపారు.



రాళ్లదాడిలో దెబ్బతిన్న వైఎస్సార్‌సీపీ ప్రచార రథం, (ఇన్‌సెట్) టీడీపీ అల్లరి మూక విసిరిన రాయి



ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి



మంత్రి రోజా సమక్షంలో పార్టీలో చేరిన యువకులు



ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి నర్సింహరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న యువకులు



మాజీ మంత్రి చెరుకువాడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న బీజేపీ నాయకుడు గంటారాజు



ఉనికిలిలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలతో మంత్రి కారుమూరి, ఎంపీ అభ్యర్థి ఉమాబాల



ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైసీపీలో చేరిన జనసేన నేత పసుపులేటి దినేష్, కార్యకర్తలు



ఉల్లంపర్రులో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు, తటస్థులకు పార్టీ కండువాలు వేస్తున్న అభ్యర్థి గుడాల గోపీ

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

- నెల్లూరు జిల్లాలో టీడీపీని వీడిన 200 కుటుంబాలు
- పశ్చిమ గోదావరిలో టీడీపీ, జనసేనలకు 75 కుటుంబాలు బైబై

వెంకటాచలం/నగరి(చిత్తూరు జిల్లా)/తణుకు అర్బన్/ఏలూరు టౌన్/పెనుగొండ/ఆకివీడు/పాలకొల్లు సెంట్రల్: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కనుపూరులో ముస్లిం మైనార్టీకి చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షులు ముస్తాఫా, మాజీ ఉప సర్పంచ్ కొమ్మి శ్రీనివాసులు, చిట్టేటి భాస్కర్, నరేంద్ర, సుభాన్‌లతో పాటు 200 కుటుంబాలు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. చిత్తూరు జిల్లా నగరి మండలం మాంగాడు గ్రామానికి చెందిన పలువురు యువకులు టీడీపీని వీడి మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ నేతలు మోహన్, నాగరాజు, సెల్వమూర్తి, రాజేష్‌లతో పాటు పలువురు యువకులు ఉన్నారు. ఒంగోలులో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉనికిలిలో మంత్రి కారుమూరి సమక్షంలో టీడీపీ, జనసేనలను వీడి 75 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. చేరికల కార్యక్రమంలో నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల పాల్గొన్నారు. ఏలూరు 45వ డివిజన్ జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన పసుపులేటి దినేష్, భారీ సంఖ్యలో జనసేన కార్యకర్తలు..45వ డివిజన్ కార్పొరేటర్ ఇలియాస్ పాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపులేటి శేషు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో పార్టీలో చేరారు. పెనుగొండలో మాజీ మంత్రి చెరుకువాడ సమక్షంలో బీజేపీ జిల్లా నాయకుడు, న్యాయవాది గంటా రాజు వైఎస్సార్‌సీపీ చేరారు. ఆకివీడులో 50 మంది యువకులు 6వ వార్డు ఇన్‌చార్జి కుంచాడ బాబ్జి నేతృత్వంలో ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో 30 మందికి పైగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తటస్థ ఓటర్లు పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కరగ నాగరాజు, తలుపూరి వెంకటరమణ, పోకల శ్రీను, గూడిరి సంతోష్, గూడిరి గోపి, పోకల సన్యాసిరావు, పూసర్ల సుదీర్, చెలిమి సుబ్బారావు, చెలిమి పెద వెంకటేశ్వర్లు, పేరూరి రామారావు, పండు వెంకటేశ్వరరావు, చెలిమి సాల్మన్‌రాజు, మారుముడి దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

అరాచకశక్తుల భరతం పడతాం..



- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి
- ఏలూరులో టీడీపీ కార్యకర్త అరాచకంపై సీరియస్
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఆదేశం

సాక్షి, అమరావతి: మహిళలపై దాడులకు తెగబడుతున్న అరాచకశక్తుల భరతం పట్టేందుకు రాష్ట్ర మహిళా కమిషన్ సిద్ధంగా ఉందంటూ కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి హెచ్చరించారు. ఏలూరు కంద్రికగూడెం ప్రాంతంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ కార్యదర్శి అచ్యుతకుమారిపై జరిగిన దాడి ఘటనను మహిళా కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ విషయమై గురువారం ఫోన్‌లో బాధితురాలిని ఓదార్చిన వెంకటలక్ష్మి.. ఆ జిల్లా ఎస్పీతో మాట్లాడారు. ఆలయంలో నిధుల గోల్‌మాల్‌పై ప్రశ్నించినందుకు కమిటీ మాజీ సభ్యుడు, టీడీపీ కార్యకర్తరెడ్డి నాగరాజు విచక్షణ రహితంగా దాడిచేసి అచ్యుతకుమారిని తీవ్రంగా గాయపరిచాడని వెంకటలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోందన్నారు. ఆలయ నిధుల గల్లంతుతో పాటు ఆలయ ఆవరణలో వ్యాపారాలకు సంబంధించి ప్రశ్నించినందుకు తనపై రెడ్డి నాగరాజు దాడి చేసినట్లు అచ్యుతకుమారి తెలిపిందన్నారు. తలపై తీవ్రంగా కొట్టడమే కాకుండా చీరలాగి వివస్త్రను చేసేందుకు ప్రయత్నించాడని బాధితురాలు వాపోయిందన్నారు. ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పిన వెంకటలక్ష్మి టీడీపీ కార్యకర్తపై తక్షణమే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై నివేదిక పంపించాలని ఎస్పీని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. వ్యక్తిగత అవసరాలకు మహిళలను వేధిస్తూ రాజకీయ పార్టీల ముసుగులో దాడులకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి హెచ్చరించారు.

రూ.41.30 లక్షల విలువైన బంగారం బిస్కెట్లు స్వాధీనం



ఆదోని సెంట్రల్: కర్నూలు జిల్లా ఆదోని పట్టణ రైల్వేస్టేషన్లో రూ.41.30 లక్షల విలువ చేసే బంగారం బిస్కెట్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఎస్ఐ గోపాల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఆదోనికి చెందిన శైనుల్లా మహ్మద్ ఇసాక్ కుమారుడు ముల్లా మహమ్మద్ మొహిద్దీన్(28) ట్రైన్ నంబర్ 17307 ఎక్స్‌ప్రెస్‌లోకి అనుమానాస్పదంగా ఎక్కుతుండగా పట్టుకున్నారు. అన్ని కోణాల్లో విచారించగా షరాఫ్‌బజార్‌లో షా లతీఫ్ లాబాలీ షాపు పెట్టుకుని బంగారు వ్యాపారం చేస్తున్నట్లు తెలిపాడు. అయితే వెండి, బంగారు నగలను అమ్మడంతో పాటు జీరో వ్యాపారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మహమ్మద్ మొహిద్దీన్ గుల్బర్గాలోని కలబుర్గికి బంగారాన్ని తరలిస్తునట్లు గుర్తించామని ఎస్ఐ తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం బంగారాన్ని ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించామని తెలిపారు.

బాబు.. ఓ నకిలీ నోటు

నకిలీ డబ్బును ఎవరూ కోరుకోరు: సజ్జల

- పొత్తు కోసం పొర్లు దండాలు పెట్టి బుకాయింపు
- ప్రజలకు ఏం చెప్పాలో తోచక మోసపూరిత హామీలు
- బీజేపీలో ఉన్న టీడీపీ నేతలకే కూటమి టికెట్లు
- ప్యాంట్రీ వాహనంపై టీడీపీ విషప్రచారం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎంత గింజుకున్నా ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితి లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. చంద్రబాబు సభలు జనం లేక వరుసగా విఫలం కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

పొత్తు కోసం పొర్లు దండాలు..!



తరతరాలు తిన్నా తరగనంత దోచుకున్న చంద్రబాబుకు ప్రజల్లోకి వెళ్లి ఏం చెప్పాలో దిక్కుతోచక మళ్లీ మోసపూరిత హామీలతో వస్తున్నారు. ఆ మోసాలను మరచిపోని ప్రజలు ఏ పార్టీ వైపు ఉండాలో ఇప్పటికే నిర్ణయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ స్పష్టమైన అజెండాతో ఉందని వారికి తెలుసు. బీజేపీలో ఉన్న టీడీపీ నేతలకు, తన పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన వారికి చంద్రబాబు సీట్లు ఇప్పించుకుంటున్నారు. బీజేపీ ప్రకటించిన అభ్యర్థుల్లో వలస నేతలే అధికం. బీజేపీ పక్షాన టీడీపీ నేతలను బరిలోకి దించినట్లు ప్రజలు గుర్తించారు. పొత్తుల కోసం చంద్రబాబు బీజేపీ పెద్దల చుట్టూ తిరిగి పొర్లు దండాలు పెట్టి ఇప్పుడు బుకాయిస్తున్నారు. పొత్తు ధర్మం పాటించాలంటూ దత్తపుత్రుడు జన సైనికులకు చెబుతున్నారు. కూటమి ఏర్పాటు తరువాత ప్రజలు మరింతగా వైఎస్సార్ సీపీకి దగ్గరయ్యారు. చంద్రబాబు ఆడిన నాటకంలో రఘురామకృష్ణరాజు బలి అయ్యాడు. నరసాపురం మినహా బీజేపీకి ఇచ్చిన మిగతా ఎంపీ సీట్లన్నీ చంద్రబాబు నిర్ణయించిన వారికే దక్కాయి. చంద్రబాబు ఇంకా కొత్త హామీలిస్తారు. వాటికి విలువ ఉండదు. అసలు చంద్రబాబు అంటేనే నకిలీ. పొరపాటున అధికారం అప్పగిస్తే ఇప్పుడు వస్తున్న పెన్షన్లు ఆగిపోతాయి. సేవ చేసే వలంటీర్లు ఉండరని ప్రజలు గమనించాలి.

బాబు.. ఓ నకిలీ కరెన్సీ

చంద్రబాబు నకిలీ కరెన్సీ లాంటి వ్యక్తి. నోటు నకిలీది అని తెలిసిన తర్వాత ప్రజలు ఎవరూ వాటిని కోరుకోరు. అలాగే చంద్రబాబును కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. చంద్రబాబు వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోయి మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని ప్రజలకు తెలుసు. అందుకే ప్రజలు చంద్రబాబును, టీడీపీని చెత్తబుట్టలో వేశారు. ప్రజలలో చెల్లుబాటు కాని చంద్రబాబు తన లక్షణాలను సీఎం జగన్‌కు ఆపాదించాలని ప్రయత్నిస్తున్నారు. కేసులు నుంచి బయట పడేందుకు చంద్రబాబు బీజేపీతో పొత్తుకు ప్రయత్నించడం, అందుకు రాయబారిగా పవన్ కళ్యాణ్ వ్యవహరించడం అందరికీ తెలుసు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు చేసిందేమీ లేదు. సీమ అభివృద్ధి సీఎం జగన్ వల్ల జరిగిందని ప్రజలకు స్పష్టత ఉంది. కుప్పానికి నీళ్లు రావడానికి కారణం ఎవరో కూడా ప్రజలకు తెలుసు.

ప్యాంట్రీ వాహనానికి ఈసీ అనుమతి ఉంది..

సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కంటైనర్(కార్)కి ఎన్నికల సంఘం అనుమతి ఉంది. సీఎం జగన్ బస్సు యాత్ర సందర్భంగా ప్యాంట్రీ కార్ కోసం ఆర్టీసీకి బిల్లు చెల్లించి అధికారికంగా తీసుకున్నాం. ప్రచార సామాగ్రిపై దుష్ప్రచారం చేస్తున్నారు. కంటైనర్‌లో ఏదో ఉందంటూ దివాళాకోరు మాటలు మాట్లాడుతున్నారు. సీఎం వాహనాలకు అనుమతులు ఉంటాయని తెలిసీ నిరాధార ఆరోపణలు చేశారు. చంద్రబాబు, లోకేశ్ మాదిరిగా ట్విట్టర్‌ను ఎవరూ దుర్వినియోగం చేసి ఉండరు. శ్రీకాళహస్తిలో మా పార్టీ అధికారికంగా తీసుకున్న గోడౌన్‌లో పన్నులు కట్టి తెచ్చిన సరుకును భద్రపరిచినా నానా యాగీ చేశారు. బాబు దింపుడు కల్లం ఆశ కూడా కోల్పోయినట్లుంది.

కోతలే బాబు నైజం...

రూ.4 వేలు పెన్షన్, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని చంద్రబాబు నమ్మబలుకుతున్నారు. కోతలు, ఎగవేతలే ఆయన నైజం. చంద్రబాబు హయాంలో 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇవ్వగా సీఎం జగన్ 66 లక్షల మందికిపైగా ఇంటివద్దే పింఛన్లు టంచన్‌గా అందచేస్తున్నారు. చంద్రబాబు చెబుతున్న వాటిపై నమ్మకం లేక పచ్చ మీడియా కూడా పట్టించుకోవడం లేదు.

కుటిల రాజకీయాల కూటమిని తరిమికొడదాం

- సంక్షేమాభివృద్ధి పాలనతో ప్రజలకు అండగా నిలిచిన జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకుందాం
- ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపు



సీతమ్మధార (విశాఖ ఉత్తర): కుటిల రాజకీయాలు చేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని తరిమికొడదామని ప్రజలకు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం విశాఖ సీతమ్మధారలో ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. 2014 ఎన్నికల్లో గెలిచిన చంద్రబాబు కూటమి.. ఆ తర్వాత ప్రజలను విస్మరించిందని గుర్తుచేశారు. 600కు పైగా హామీలిచ్చి.. అమలు చేయకుండా మోసం చేసిందని, అందుకే 2019లో టీడీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. జగన్ సీఎం అయ్యాక సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలిచారని వివరించారు. రాష్ట్రంలో పోర్టులు అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తెచ్చి పేదల పిల్లలకు ప్రపంచ స్థాయి విద్యను చేరువ చేశారని చెప్పారు. విద్య, ఉపాధి, ఆరోగ్య రంగాలకు పెద్దపీట వేస్తూ సుపరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించేందుకు వైఎస్సార్ 108, ఆరోగ్య శ్రీ ప్రవేశపెడితే.. ఆయన తనయుడు సీఎం జగన్.. వాటి సేవలను విస్తృతం చేశారని వివరించారు. రాష్ట్రమంతటా అవినీతి రహిత పాలనతో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు వైద్య సేవలతో పాటు ఉచిత మందులు అందించారని గుర్తుచేశారు. ఇలా ప్రజలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా చంద్రబాబు కూటమి కుటిల రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఆ కుట్రలను సమర్థంగా తిప్పికొట్టి.. మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేస్తారని చెప్పారు.

బోధనేతర సిబ్బందిని ప్రిన్సిపాళ్లుగా ఎలా నియమిస్తారు?

- పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిని ప్రశ్నించిన హైకోర్టు
- సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలు నిలిపివేత



సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లైబ్రేరియన్లను, ఫిజికల్ డైరెక్టర్లను ప్రిన్సిపాళ్లుగా నియమించే విషయంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన జీవోను హైకోర్టు ఆక్షేపించింది. బోధనేతర సిబ్బందిని ఎలా ప్రిన్సిపాళ్లుగా నియమిస్తారని ప్రశ్నించింది. పాఠ్యాంశాల గురించి వారికి ఏం తెలుసంది. ఇలాగే వదిలేస్తే రేపు స్వీపర్లను కూడా ప్రిన్సిపాళ్లుగా నియమిస్తారంటూ వ్యాఖ్యానించింది. ఈ జీవో విషయంలో స్వయంగా కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 197 మంది లెక్చరర్లకు ప్రిన్సిపళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ఇంటర్ విద్యా కమిషనర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం సస్పెండ్ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ నూనెపల్లి హరినాథ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఇంటర్ విద్యా కమిషనర్ 15న ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు (లైబ్రరీ సైన్స్) సంఘం అధ్యక్షుడు సంజీవరావు, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పదోన్నతుల విషయంలో లైబ్రరీ సైన్స్ చేసిన లెక్చరర్లను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ఇది జీవో 76కు విరుద్ధమని తెలిపారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి.. ఇంటర్ విద్యా కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉమ్మడి నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్యాంకుమార్.. న్యాయమూర్తి జస్టిస్ నరేందర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్ తాజాగా విచారణకు రాగా ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. బోధనేతర సిబ్బందిని ఎప్పటికీ టీచర్లుగా పరిగణించడం సాధ్యం కాదంది. ప్రిన్సిపల్స్ బోధించరని, పాలనా వ్యవహారాలే మాత్రమే చూస్తుంటారన్న పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలతో ధర్మాసనం విబేధించింది.

కూటమి అజెండా జగన్‌ను దించడమే..

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి
- 'విశాఖ డ్రగ్స్'తో సంబంధం లేదు



తణుకు టౌన్/సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిలోని పార్టీల జెండాలు వేరైనా అజెండా మాత్రం ఒక్కటేనని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దించడమే ప్రధాన లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి స్పష్టం చేశారు. గురువారం పశ్చిమగోదావరి తణుకులోని సీఎం ఫంక్షన్ హాలులో నిర్వహించిన నరసాపురం పార్లమెంట్, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల బీజేపీ ఎన్నికల కమిటీల సభ్యుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పురందేశ్వరి మాట్లాడుతూ.. పేదవారే కేంద్రంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు దేశమే ప్రథమం, తర్వాతే పార్టీ అనే సిద్ధాంతంతో ప్రధానిరి నరేంద్ర మోదీ పనిచేస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర ఎన్నికల సహాయ పరిశీలకుడు సిద్ధార్థ్‌నాథ్ సింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సాగి కాశీ విశ్వనాథరాజు, క్రమ శిక్షణ సంఘం అధ్యక్షుడు పాకా వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, విశాఖ డ్రగ్స్ కేసుతో తమ కుటుంబానికి సంబంధం లేదని పురందేశ్వరి స్పష్టం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి తరఫున రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా ఎంపికైన తర్వాత ఆమె తొలిసారిగా రాజమహేంద్రవరం వచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

నరసాపురం ఎంపీ స్థానానికి కూటమి అభ్యర్థి నేనే: రఘురామకృష్ణరాజు

భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా తాను కచ్చితంగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తానని నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. గురువారం భీమవరంలో మీడియాతో మాట్లాడారు. మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు తనకు కూటమి తరఫున న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు. తనకు ప్రస్తుతం ఏ పార్టీలో సభ్యత్వం లేకపోవడంతో ఎంపీ టికెట్ ఎలా ఇస్తారని కొంతమంది అభ్యంతరం చెబుతున్నారని, అయితే పార్టీల్లో సభ్యత్వం లేకుండానే తిరుపతి ఎంపీ, మరికొన్నిచోట్ల కూటమిలో సీట్లు కేటాయించారని గుర్తు చేశారు. నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే సీటు కేటాయించినా మార్పు తప్పదన్నారు.

నమ్మక ద్రోహం.. సైకిల్ దహనం

అనపర్తిలో ఆగ్రహజ్వాలలు

- నల్లమిల్లికి జరిగిన అన్యాయంపై భగ్గుమన్న శ్రేణులు
- టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై మండిపాటు
- పార్టీ కరపత్రాలు, జెండా, సైకిల్ దహనం

ఇటీవల ఓ సభలో కుర్చీలు మడతబెట్టాలని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపును తెలుగు తమ్ముళ్లు ఏ విధంగా అర్థం చేసుకున్నారో గానీ.. ఆయన తీరుపై రగిలిపోయి పార్టీ ఎన్నికల గుర్తయిన సైకిల్‌నే మడతపెట్టి తగలెట్టేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'పచ్చ'దండు అధిష్టానం తీరుపై దండెత్తుతోంది. టికెట్ల కేటాయింపుపై మండిపడుతోంది. చంద్రబాబు నమ్మించి మోసం చేస్తున్నారని ఆశావహులు రెబల్స్‌గా మారుతున్నారు. ఇండిపెండెంట్లుగా పోటీకి సిద్ధమవుతున్నారు.


నల్లమిల్లి స్వగ్రామం రామవరంలో సైకిల్‌ను మంటల్లోకి వేసేందుకు తీసుకెళుతున్న కార్యకర్తలు

సాక్షి, రాజమహేంద్రవరం/పెనుగంచిప్రోలు/సాక్షి ప్రతినిధి, కడప/సాక్షి, అమరావతి/అరకు: అనపర్తి అసెంబ్లీ స్థానాన్ని పొత్తుల్లో భాగంగా బీజేపీకి కేటాయించడాన్ని టీడీపీ శ్రేణులు తట్టుకోలేకపోయాయి. ఆగ్రహంతో ఊగిపోయాయి. టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి జరిగిన ద్రోహానికి కార్యకర్తలు భగ్గుమన్నారు. నల్లమిల్లి స్వగ్రామం రామవరంలో గురువారం పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలకు దిగారు. టీడీపీ కరపత్రాలు, పార్టీ జెండాలు కుప్పగా పోసి తగులబెట్టారు. అందులో సైకిల్‌ను వేసి దహనంచేశారు. ఇంటిపైకి వెళ్లి దూకేందుకు ఓ కార్యకర్త ప్రయత్నించాడు. చంద్రబాబుకు, టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్లమిల్లికి టికెట్ ఇచ్చే వరకూ వెనక్కు తగ్గేది లేదని కుండబద్దలు కొట్టారు. కట్టప్ప రాజకీయాలు మానుకోవాలని బాబును హెచ్చరించారు. దీంతో రామవరం గ్రామం అట్టుడికింది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి భావోద్వేగానికి గురయ్యారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తన జీవితంతో ఆడుకున్నారని కన్నీళ్లు పెట్టుకున్నారు. టీడీపీ కోసం ఐదేళ్ల పాటు తన ప్రాణాన్ని, కుటుంబాన్ని పణంగా పెట్టానని ఆవేదన చెందారు. కార్యకర్తల అభీష్టం మేరకు భవిష్యత్తు నిర్ణయం ప్రకటిస్తానన్నారు. తాను, తన కుటుంబం ఐదురోజులపాటు నియోజకవర్గంలో పర్యటిస్తామని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని ఎన్నికల్లో పోటీపై తుది నిర్ణయం ప్రకటిస్తామని వెల్లడించారు. నల్లమిల్లి టీడీపీ రెబల్‌గా బరిలోకిదిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనపర్తి సీటును బీజేపీకి కేటాయిస్తారని మూడురోజులుగా ప్రచారం జరుగుతోంది. అప్పటి నుంచి నల్లమిల్లి వర్గం ఆందోళన చెందుతోంది. నిరసన వ్యక్తం చేస్తోంది. బీజేపీ బుధవారం అభ్యర్థిని ప్రకటించగానే ఒక్కసారిగా నల్లమిల్లి అనుచరులు రగిలిపోయారు. ఇద్దరు కార్యకర్తలు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇదిలా ఉంటే ఏ పార్టీ అయినా పొత్తు ధర్మాన్ని పాటించాలని బీజేపీ అభ్యర్థి శివరామకృష్ణం రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి సహకరించాలని కోరతానని వెల్లడించారు. రాష్ట్ర బీజేపీ పెద్దల నిర్ణయం మేరకు ముందుకెళ్తానని స్పష్టం చేశారు.

- వై నాట్ పులివెందుల అంటూ ప్రగల్భాలు పలికే చంద్రబాబుకు వైఎస్సార్ జిల్లా కడప లోక్‌సభ స్థానంలో పోటీకి అభ్యర్థి దొరకడం లేదు. దీంతో రకరకాల పేర్లతో టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపడుతోంది. తాజాగా ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేరుతో గురువారం ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఈ సీటులో పోటీకి ఇప్పటికే ఐదుగురి పేర్లు తెరపైకి వచ్చాయి. వాస్తవానికి ఈ స్థానానికి అభ్యర్థిగా ఏడాది క్రితమే ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డిని చంద్రబాబు ప్రకటించారు. శ్రీనివాసులురెడ్డి పోటీకి విముఖత చూపడంతో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, జమ్మలమడుగు, బద్వేల్ ఇన్‌చార్జిలు భూపేష్‌రెడ్డి, రితీష్‌రెడ్డి పేర్లతోనూ టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టింది. ఓదశలో వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి సౌభాగ్యమ్మ పేరూ వినిపించింది. కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల పోటీచేస్తారని వార్తలు వచ్చాక సౌభాగ్యమ్మ పేరు కనుమరుగైంది. తాజాగా ఆరోవ్యక్తిగా గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేరును టీడీపీ పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈయన ప్రొద్దుటూరు అసెంబ్లీ సీటును ఆశించి భంగపడ్డారు. దీంతో ప్రవీణ్‌ను కడప లోక్ సభ నుంచి పోటీ చేయించాలని చంద్రబాబు యోచిస్తున్నారు.
- రాష్ట్ర బీజేపీలో అభ్యర్థులనూ చంద్రబాబు నిర్ణయిస్తున్నారంటూ బద్వేల్ బీజేపీ సీనియర్ నాయకుడు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమాల ద్వారా ప్రజల్లోంచి వచ్చిన తనలాంటి దళిత నాయకులకు అన్యాయం చేస్తూ టీడీపీకి చెందిన రోశన్నకు టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. బీజేపీ నాయకత్వం ఇకనైనా పార్టీని నమ్ముకున్న వ్యక్తులకు గుర్తింపు ఇవ్వాలంటూ గురువారం విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. 20ఏళ్లపాటు పార్టీకి సేవ చేసిన తనలాంటి యువకుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని కోరారు. చంద్రబాబు హయాంలో ప్రజాస్వామ్యం అంటే అర్థం తెలియని ఆయన కుమారుడు లోకేష్ కనీసం ఎమ్మెల్యేగా గెలవకుండానే పదవులు అనుభవించారని ఎద్దేవా చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తీరుపై తెలుగు తమ్ముళ్లు మండిపడ్డారు. పెనుగంచిప్రోలు మండలం మునేరు అవతల నూతలపాటి కన్వెన్షన్‌లో గురువారం టీడీపీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి, ఓ చానల్ ఎండీ బొల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గురించి తాతయ్య మాట్లాడిన తీరు అభ్యంతరకరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను వైఎస్సార్ సీపీ నుంచి వచ్చానని చెబుతున్నారని, తాతయ్య కాంగ్రెస్‌లో నుంచే టీడీపీలోకి వచ్చిన సంగతి మరచిపోతే ఎలా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం భారీగా ఖర్చుచేశానని, అందుకే సీటు ఆశించానని పేర్కొన్నారు. తాను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డానని తాతయ్య ఆరోపించడం అసంబద్ధమని, ఆయన మీడియా ముఖంగా క్షమాపణ కోరాలని, లేకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి సత్తా చాటుతానని వెల్లడించారు.

పచ్చ పార్టీ ప్రలోభాలు

- డబ్బులు ఎరవేసి ప్రత్యర్థి పార్టీ నేతల కొనుగోళ్లు
- గ్రామస్థాయి నేతలకు రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలు..
- చోటా నేతలకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు..
- పార్టీలో చేరిన వారికి రూ.10వేల చొప్పున చెల్లింపులు
- అదే మండలస్థాయి ప్రజాప్రతినిధులకు రూ.25 లక్షల నుంచి రూ.30లక్షల వరకు ఆఫర్
- అద్దంకి, పర్చూరు, రేపల్లెలోనూ టీడీపీ ప్రలోభాలు
- బాపట్ల, వేమూరులోనూ ఇదే పరిస్థితి
- ఓటర్లను నమ్మలేక నేతల కొనుగోలుకు సిద్ధపడిన వైనం
- బాపట్ల టీడీపీ అభ్యర్థి వర్మ కంపెనీ కంటైనర్‌లో పట్టుబడ్డ రూ.56 లక్షల నగదు
- ఆక్వా కంటైనర్ల మాటున పెద్దఎత్తున టీడీపీ నేతలు నగదు రవాణా!



బాక్సులలో డబ్బును బయటకు తీస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల/చీరాల: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌కు వెల్లువెత్తుతున్న ప్రజాదరణను చూసి బెంబేలెత్తిపోతున్న తెలుగుదేశం పార్టీ నేతలు ఇక తమకు ఓటమి తప్పదని నిర్ధారణకు వచ్చి అడ్డదారులకు తెరలేపారు. ఓటర్లపై వారికి నమ్మకం సన్నగిల్లడంతో ఇబ్బడిముబ్బడిగా డబ్బులు వెదజల్లి ప్రత్యర్థి పార్టీకి చెందిన చోటామోటా నేతలను, కార్యకర్తలను లోబర్చుకునేందుకు బరితెగిస్తున్నారు. ఇందులో భాగంగా ఒక్కో నేతకు రూ.5 లక్షల నుంచి రూ.పది లక్షల వరకూ చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి కార్యకర్తలకైతే రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు ఎరవేస్తున్నట్లు సమాచారం. ఈ కొనుగోళ్ల వ్యవహారం వారం రోజులుగా ఊపందుకున్నట్లు తాజాగా చోటుచేసుకున్న ఘటనల బట్టి అర్థమవుతోంది. ఎందుకంటే.. బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు చెందిన రూ.56 లక్షల డబ్బు కట్టలను గురువారం ఆయన మెరైన్ కంపెనీకి చెందిన కంటైనర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో టీడీపీ నేతల అక్రమాలు నిజమేనని స్పష్టమవుతోంది.

అధికార పార్టీ నేతలకు రూ.లక్షల్లో చెల్లింపులు..

ఇదిలా ఉంటే.. బాపట్ల నియోజకవర్గంలో నామమాత్రంగా కూడా బలంలేని టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కేవలం డబ్బు బలంతోనే టీడీపీ టికెట్ సంపాదించారని అందరికీ తెలిసిన విషయమే. ఆ బలంతోనే ఎన్నికల్లో నెగ్గేందుకు వర్మ సిద్ధమయ్యారు. కానీ, కొంతకాలంగా ఓటర్లకు చీరలు పంపిణీ చేసినా ప్రజల నుంచి స్పందన కరువవడంతో ఆయన డబ్బు రాజకీయానికి తెరతీశారు. గ్రామాల్లో ఉన్న చోటామోటా నేతలు, కార్యకర్తలను ప్రలోభపెట్టి డబ్బులు ముట్టజెప్పి కొనుగోళ్లకు తెరతీశారు. అధికార పార్టీలో పదవులున్న నేతకు రూ.10 లక్షలు, చోటా నేతకు రూ.5 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు. గ్రామస్థాయిలో అయితే రూ.లక్ష నుంచి రెండు లక్షలు ఇస్తున్నారు. పార్టీలో చేరిన వారికి రూ.పదివేలు చెల్లిస్తూ కండువాలు వేస్తున్నారు. అదే అధికార పార్టీ నుంచి పచ్చ పార్టీలో చేరితే మండల స్థాయి ప్రజాప్రతినిధులకు రూ.25 నుంచి 30 లక్షల ఆఫర్ చేస్తున్నారు. అద్దంకి, పర్చూరు, రేపల్లె, వేమూరులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఎన్నికల్లో అక్రమాలకు తెరలేపిన వేగేశన నరేంద్ర వర్మపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారపార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కొంతకాలంగా కంటైనర్ల ద్వారా తరలింపు?

రాయల్ మెరైన్ అధినేత నరేంద్రవర్మ గత ఎన్నికల్లోనూ పోటీచేసి ఓడిపోయారు. ఈసారి ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతున్నారన్న ఆరోపణలకు ఈ కంటైనర్ వ్యవహారం బలం చేకూరుస్తోంది. కంటైనర్ల ద్వారా రొయ్యల బాక్సుల మధ్యలో డబ్బు తీసుకొస్తే ఎటువంటి అనుమానం రాదని, అందుకు పక్కా ప్లానుతో రాయల్ మెరైన్‌కు కంటైనర్ ద్వారా పెద్ద మొత్తంలో నగదు తరలిస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఇక ఆక్వా రంగంలో ప్రాసెసింగ్ యూనిట్లు నడిపే టీడీపీ నాయకులు చాలామంది ద్వారా ఇదే విధంగా నగదు అక్రమ రవాణా జరుపుతున్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అసలు పట్టుబడ్డ నగదును నేరుగా తెచ్చుకోవాలి. కానీ, కంటైనర్లలో రొయ్యల బాక్సులలో మధ్యలో పెట్టి రహస్యంగా తీసుకురావడమే అనుమానాలకు తావిస్తోంది. ఇది ఒక్కసారి జరిగింది అయితే కాదని, ముందుగానే డబ్బును మెరైన్ కంపెనీలకు తరలించి అక్కడి నుంచి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా నరేంద్ర వర్మ ఒక్కరే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రంగంలో ఉన్న టీడీపీ నేతల ద్వారా అక్రమమార్గాన విచ్చలవిడిగా నగదు రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

రొయ్యల బాక్సుల మధ్యలో నోట్ల కట్టలు..

ఇదిలా ఉంటే.. బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు చెందిన రాయల్ మెరైన్ కంపెనీకి నిజాంపట్నం నుంచి చీరాల పరిధిలోని ఈ సంస్థకు ఓ రొయ్యల కంటైనర్ చేరుకుంది. దీనికి సంబంధించి అప్పటికే సమాచారం అందుకున్న చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ రాయల్ మెరైన్ వద్ద కాపు కాశారు. వచ్చిన కంటైనర్‌ను కస్టడీలోకి తీసుకుని పోలీస్ పికెటింగ్ ఏర్పాటుచేశారు. కంపెనీ ప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ, ఇన్‌కంటాక్స్, ట్రెజరీ అధికారులు గురువారం ఉ.11 గంటల సమయంలో సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. కంటైనర్‌లో అన్నీ రొయ్యల బాక్సులు ఉండగా, ఒక బాక్సులో మాత్రం రూ.500 నోట్లు 112 కట్టలతో మొత్తం రూ.56 లక్షలు దొరికాయి. దీంతో అధికారులు ఈ డబ్బు ఎక్కడ నుంచి తరలించారు, వీటికి సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా లేదా అని విచారణ చేస్తున్నారు. ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో డబ్బును ఐటీ అధికారులకు అప్పగించారు. మీడియా సహా ఎవరినీ ఆ కంపెనీలోకి అనుమతించకపోవడంతో డబ్బు కోట్లలోనే పట్టుబడి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ డబ్బుతోనే వర్మ ఓటర్లను, నేతలను ప్రలోభాలకు గురిచేస్తూ ఎన్నికల్లో అక్రమాలకు తెరలేపడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. ఐటీ అధికారులు వర్మ సంస్థ ఆర్థిక లావాదేవీలపై లోతుగా విచారణ చేపట్టారు.



జిల్లా వార్తలు

'కొల్లు'వన్నీ సొల్లు మాటలే!

- మంచినీటి సరఫరాలో కొల్లు రవీంద్ర ఆరోపణలన్నీ అవాస్తవాలే
- పోర్టుకు, మెడికల్ కళాశాలకు నీరిస్తే తప్పేంటి?
- బందరు ఎమ్మెల్యే పేర్ని నాని ఆగ్రహం


టీడీపీ హయాంలో నాగులేరు కాలువలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని నింపుతున్న ఫొటోను చూపుతున్న పేర్ని నాని

మచిలీపట్నం టౌన్: వాస్తవాలను దాచిపెట్టి దిగజారి టీడీపీ నేత కొల్లు రవీంద్ర అసత్యాలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) ధ్వజమెత్తారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కృష్ణా నదిలో నీటి లభ్యత లేకపోవటం, పులిచింతలలో కేవలం నాలుగున్నర టీఎంసీల నీరు ఉన్న కారణంగానే రెండు రోజులకు ఒకసారి నగర ప్రజలతో పాటు వంద గ్రామాలకు నీటిని సక్రమంగా సరఫరా చేస్తున్నామన్నారు. కొల్లు రవీంద్ర ఓట్లు దండుకోవటం కోసం ప్రజలను మభ్యపెట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

చెరువులు ఎండబెట్టింది మీరే..

తమ హయాంలో రోజూ నీరు ఇచ్చామని చెప్పుకుంటున్న కొల్లు రవీంద్రకు ముందుచూపు లేనందునే 2017, 2018లో నగర ప్రజలకు మురికినీరు ఇచ్చారన్నారు. కాలువల్లో నీరు ఉన్న సమయంలో తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, పంపుల చెరువులు నింపకపోవటంతో చెరువులు ఎండిపోయి ఆ చెరువులో యువకులు క్రికెట్ ఆడుకున్న సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలోనే చెరువులను నింపేందుకు మునిసిపాలిటీలో తీర్మానం చేసి రూ.87.60 లక్షలు వెచ్చించి మోటార్లను అద్దెకు తీసుకున్న ఘనత కొల్లు రవీంద్రకే దక్కుతుందన్నారు. ఆయన హయాంలో ప్రతి వేసవిలో తన అనుయాయులతో బోరింగ్ పంపులు వేయించి రూ.30 లక్షలు స్వాహా చేశారని ఆరోపించారు. నీటిని అమ్ముకున్నామని వ్యాఖ్యలు చేస్తున్న కొల్లు రవీంద్ర మనిషి జన్మ ఎత్తి ఉంటే ఆయన దానిని నిరూపించాలని సవాల్‌చేశారు. పోర్టు నిర్మాణానికి రా వాటర్ సరఫరా కోసం చలానా కట్టించుకుని నీటిని ఇస్తున్నాం. అలాగే మెడికల్ కళాశాలకు, జ్యూయలరీ పార్కుకు కూడా నీటిని ఇస్తుంటే దిగజారుడు మాటలు మాట్లాడటం ఆయనకే చెల్లిందన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ మనుగడ కోసం నీటిని అందించామన్నారు.

ఐదేళ్లలో పోర్టు పనులు ఎందుకు ప్రారంభించ లేదు

టీడీపీ హయాంలో ఐదు సంవత్సరాల్లో పోర్టు నిర్మాణం చేయకుండా 8.60 కోట్లు ఖర్చు చేసి దొంగ శంకుస్థాపనలు చేసిన కొల్లు రవీంద్ర, తామైతే 16 బెర్త్‌లు కట్టి చూపుతామని మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. నాడు గ్రామాలను ఖాళీ చేసి 33 వేల ఎకరాలు ఇస్తేనే పోర్టు కడతామని చెప్పిన రవీంద్ర ఏకంగా 16 బెర్త్‌లు కడతామనటం పోర్టు నిర్మాణంపై ఆయనకు ఉన్న పరిజ్ఞానం ఏపాటిదో అర్థమవుతోందన్నారు. తొలుత నాలుగు బెర్త్‌లు నిర్మించి డిమాండ్‌ను బట్టి మిగిలిన బెర్త్‌లు కడతారనే విషయం కూడా తెలియకుండా మాట్లాడటం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దొంగ దొరికాడు!

ఎన్నికల వేళ.. టీడీపీ తాయిలాలు

- ఎన్నికల వేళ అక్రమాలకు తెరలేపిన పొన్నూరు టీడీపీ అభ్యర్థి నరేంద్ర
- ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన 567 సైకిళ్లను స్వాధీనం చేసుకున్న అధికారులు
- చింతలపూడిలో దాచినట్టు సమాచారం అందించిన స్థానికులు


టీడీపీ పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన సైకిళ్లు ఇన్‌సెట్‌లో.. సైకిళ్లపై అభ్యర్థి నరేంద్ర ఫొటోలు

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి, తాయిలాల ఎరవేసి ఓట్లు దక్కించుకునేందుకు టీడీపీ పన్నాగం పన్నింది. విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసి తల్లిదండ్రుల మెప్పుపొందేందుకు భారీ సంఖ్యలో సైకిళ్లను కొనుగోలు చేసింది. టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర స్వగ్రామం చింతలపూడిలోని ఓ రైస్‌మిల్లులో నిల్వ చేశారు. సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు వాటిని సీజ్ చేశారు. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు పొన్నూరు నియోజకవర్గం ఎన్నికల అధికారులకు ఫోన్ చేశారు. మండలంలోని చింతలపూడి గ్రామంలోని ఓ రైస్‌మిల్‌లో టీడీపీ నేత, ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర ఫొటో, సైకిల్ గుర్తుతో ఉన్న నూతన సైకిళ్లు వందల సంఖ్యలో ఉన్నాయని సమాచారం అందింది. అధికారులు హుటాహుటిన రైస్‌మిల్‌కు చేరుకుని వందల సంఖ్యలో ఉన్న సైకిళ్లను చూసి అవాక్కయ్యారు. అన్ని సైకిళ్లకు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ రంగు, గుర్తులు, అభ్యర్థి ఫొటో ఉండటంతో అన్ని సైకిళ్లను సీజ్ చేశారు. సంఘటనా స్థలానికి ఓ వ్యక్తి చేరుకుని తాను కోర్టు ద్వారా ఆక్షన్‌లో సైకిళ్లను దక్కించుకున్నానని, అధికారులకు తెలిపాడు. అయితే ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా సైకిళ్లు ఉన్నాయని, ఒకేచోట పార్టీ సింబల్స్‌తో ఇన్ని సైకిళ్లు ఉండరాదని తేల్చిచెప్పారు. కోడ్ ఉల్లంఘించిన కారణంగా 567 సైకిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఫ్లెయింగ్ స్క్వాడ్ అధికారి వరదరాజులు, ఎంపీడీవో రత్నజ్యోతి తెలిపారు. ధూళిపాళ్ల నరేంద్ర ఎన్నికల తాయిలాల పంపకంతోనే విజయం సాధించే ప్రక్రియకు ఎన్నికల అధికారులు అడ్డుకట్ట వేశారు.

అమెరికాకు కృష్ణా వర్సిటీ విద్యార్థులు


ఇంజినీరింగ్ విద్యార్థితో మాట్లాడుతున్న వీసీ జ్ఞానమణి

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం నుంచి ఐదుగురు విద్యార్థులు ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లనున్నట్లు ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాల సీనియర్ విద్యార్థులతో ఆయన గురువారం ముఖాముఖీ మాట్లాడారు. గత నెలలో అమెరికాకు చెందిన సిలికానాంధ్ర విశ్వవిద్యాలయంతో అవగాహన కుదిరిందని గుర్తుచేశారు. ఈ అవగాహన ఒప్పందంలో భాగంగా ఆసక్తి కలిగిన ఐదుగురు విద్యార్థులకు అమెరికాలో ఎంఎస్ చదవడానికి అవసరమైన ట్యూషన్ ఫీజు లేకుండా అడ్మిషన్ ఇవ్వడానికి సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం సంసిద్ధత వ్యక్తం చేస్తూ మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ బయోడేటాతో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రయాణ ఖర్చులు, ఇతర అవసరాలను విద్యార్థులు భరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యుడు సుందర కృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిడమానూరులో కుక్క స్వైర విహారం


కుక్క దాడిలో గాయపడిన చిన్నారి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులో కొన్ని రోజులుగా కుక్క స్వైర విహారం చేస్తోంది. కంటబడిన వారిపై దాడి చేసి గాయపరుస్తోంది. వినాయకుడి గుడి, వాటర్‌ట్యాంక్ బజారు, ప్రధాన వీధిలో తిరుగుతూ ఇప్పటికే పలువురిపై దాడిచేసింది. కుక్క దాడిలో ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారని స్థానికులు తెలిపారు. కట్టేసిన గేదెలపైనా కుక్క దాడిచేయడంతో గ్రామస్తులు రెండు రోజుల క్రితం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గురువారం కూడా ఓ విద్యార్థిపై కుక్క దాడిచేసి గాయపరిచింది. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామస్తులపై దాడి చేస్తున్న కుక్కను పట్టుకున్నారు.

చట్టసభల్లో రైతు ప్రతినిధులకు ప్రాతినిధ్యం ఉండాలి

సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ


ఎన్వీ రమణను సత్కరిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని, పాలకవర్గ సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే చట్టసభల్లో రైతు ప్రతినిధుల ప్రాతినిధ్యం ఉండాలని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లిలో కృష్ణామిల్క్ యూనియన్ నూతనంగా 'ప్రాజెక్టు కామధేను' పేరిట నిర్మించిన అత్యాధునిక సాంకేతికత, ఆటోమేటెడ్ పాల ఉత్పత్తుల కార్మాగారాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడకుండా పాడి, పౌల్ట్రీ రంగాలపై దృష్టి సారించి, అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని, తద్వారా రైతుల పిల్లలు కూడా ఉన్నత చదువుల వైపు వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నట్లే రైతులకు కూడా ఆర్థిక, ఆరోగ్య, భవిష్యత్ భరోసా కల్పించాలని జస్టిస్ ఎన్వీ రమణ ఆకాంక్షించారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా రైతులు ఉచిత న్యాయసేవలు పొందవచ్చని సూచించారు. నవ్యాంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని నిర్మాణం కోసం ఎందరో రైతులు భూములు ఇచ్చారని, రైతులకు ఎటువంటి స్వార్థం, రాజకీయ ఆపేక్ష ఉండదని చెప్పారు. అమరావతి రైతులతో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ అందిస్తున్న బోనస్‌లు, క్షీర బంధు, కల్యాణలక్ష్మి పథకాల లబ్ధిదారులకు జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదగా చెక్కులను పంపిణీ చేశారు. తొలుత బాపులపాడు మండలం బొమ్ములూరులోని ఆయన బంధువుల నివాసంలో అల్పాహారం స్వీకరించి, రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణామిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, యూనియన్ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు


తోట్లవల్లూరులో బైక్‌ల చోరీ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

తోట్లవల్లూరు: అంతర్ జిల్లా మోటారు సైకిళ్ల దొంగను తోట్లవల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకుని రూ.20 లక్షల విలువైన బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ గురువారం సాయంత్రం తోట్లవల్లూరులో విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం మేరకు. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురంలోని రామనగర్‌కు చెందిన ఒడుగు సుబ్బారావు కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురులో నాలుగేళ్లుగా తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన సుబ్బారావు బైక్ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, ఏలూరు జిల్లాల్లోని 18 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 37 బైక్‌లను అపహరించాడు. తోట్లవల్లూరు వద్ద కృష్ణా కరకట్టపై పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు, ఎస్ఐ పి.విశ్వనాథ్ గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ఒడుగు సుబ్బారావును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా బైక్‌ల చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడి నుంచి రూ.20 లక్షల విలువైన 37 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఉయ్యూరు పదో అదనపు మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచారు. బైక్‌ల చోరీని త్వరితగతిన ఛేదించిన సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ విశ్వనాథ్, హెడ్ కానిస్టేబుళ్లు నాగవెంకన్న, రవికుమార్, కానిస్టేబుళ్లు రమణ, రామకృష్ణను అభినందించి నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో గుడివాడ డీఎస్పీ కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
29-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
655	203
73,651	22,327

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,381	▼	19
డోజోన్స్	39,765	▲	4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲	21
డాక్స్	18,492	▲	15
షాంఘై	3,110	▲	18
నికాయ్	40,168	▼	595

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
66,760	▲	126
బంగారం (99.5 స్వచ్ఛత)		
66,691	▲	125
వెండి (కిలో)		
74,747	▲	250

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.93	83395
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.32	106.84
€	యూరో	ఎస్‌బీఐ	89.25	90.68
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.34	56.14
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.54	55.75
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.34	64.75
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

చేతులు కలిపిన అంబానీ- అదానీ

అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్‌కు 26 శాతం వాటా



న్యూఢిల్లీ: బిలియనీర్ పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ తొలిసారి చేతులు కలిపారు. దీనిలో భాగంగా అదానీ పవర్‌కు చెందిన పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) 26 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. అంతేకాకుండా మధ్యప్రదేశ్‌లోని ఈ ప్లాంటుకు చెందిన 500 మెగావాట్ల యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఆర్ఐఎల్ సొంత అవసరాలకు వినియోగించుకునేందుకు రెండు సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వెరసి అదానీ పవర్ పూర్తి అనుబంధ సంస్థ మహన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో 5 కోట్ల ఈక్విటీ షేర్లను ఆర్ఐఎల్ సొంతం చేసుకోనుంది. రూ. 10 ముఖ విలువకే(రూ. 50 కోట్లు) వీటిని చేజిక్కించుకోవడంతోపాటు.. 500 మెగావాట్ల విద్యుత్‌ను సొంత అవసరాలకు ఆర్ఐఎల్ వినియోగించుకోనుంది. సొంత వినియోగ పాలసీలో భాగంగా ఆర్ఐఎల్ 20 ఏళ్ల దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని(పీపీఏ) ఎంఈఎల్‌తో కుదుర్చుకున్నట్లు అదానీ పవర్ వెల్లడించింది. మొత్తం 2,800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఎంఈఎల్ ప్లాంటులో 600 మెగావాట్ల యూనిట్‌ను సొంత అవసరాల పద్ధతిలో తెరతీయనున్నట్లు వివరించింది.

అదానీ గ్రూప్ ప్రపంచ అతిపెద్ద కాపర్ ప్లాంట్

గుజరాత్‌లోని ముంద్రాలో అదానీ గ్రూప్ భారీ కాపర్ ప్లాంటు తొలి దశను ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే సింగిల్ లొకేషన్‌లో ఏర్పాటైన అతి పెద్ద కాపర్ తయారీ కర్మాగారంగా నిలవనుంది. దీనితో దిగుమతులపై ఆధారపడే పరిస్థితి కొంత తగ్గనుంది.

అంబుజాలో అదానీ వాటా అప్
రూ. 6,661 కోట్ల పెట్టుబడులు

డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా అంబుజా సిమెంట్స్‌లో వాటాను పెంచుకుంది. 21.2 కోట్ల వారంట్లను ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసుకోవడం ద్వారా 3.6 శాతం అదనపు వాటాను పొందింది. ఇందుకు రూ. 6,661 కోట్లు వెచ్చించగా.. ప్రస్తుతం అంబుజాలో అదానీ వాటా 66.7 శాతానికి చేరింది. దేశీయంగా సిమెంట్ తయారీలో రెండో పెద్ద కంపెనీగా నిలుస్తున్న అంబుజాలో ప్రమోటర్ సంస్థ హార్మోనియా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ షేరుకి రూ. 314.15 సగటు ధరలో వారంట్లను మార్పిడి చేసుకుంది. ఇంతక్రితం 2022 అక్టోబర్‌లోనూ ప్రమోటర్ సంస్థ వారంట్లను అందుకోవడం ద్వారా రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా హార్మోనియాకు 47.74 కోట్ల మార్పిడికి వీలయ్యే వారంట్లను అంబుజా సిమెంట్స్ జారీ చేసింది.

చిన్న పొదుపులపై వడ్డీరేట్లు యథాతథం



న్యూఢిల్లీ: చిన్న పొదుపులపై వడ్డీరేట్లు ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో జనవరి–మార్చి తరహాలోనే యథాతథంగా కొనసాగనున్నాయి. వీటిలో ఎటువంటి మార్పూ ఉండబోదని కేంద్రం ప్రకటించింది. ప్రకటన ప్రకారం సుకన్య సమృద్ధి యోజనపై 8.2% వడ్డీరేటు అమలవుతుంది. మూడేళ్ల టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 7.1%. పీపీఎఫ్‌పై వడ్డీ 7.1 శాతంకాగా, పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీమ్‌పై 4% వడ్డీ అమలవుతుంది. కిసాన్ వికాస పత్రపై 7.5% వడ్డీ లభిస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ మెచ్యూరిటీ కాలం 115 నెలలు. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌పై వడ్డీ 7.7%. నెలవారీ ఆదాయ పథకంపై 7.4% వడ్డీ లభిస్తుంది.

ఫిబ్రవరిలో మౌలికం నెమ్మది



న్యూఢిల్లీ: ఎనిమిది కీలక పరిశ్రమలతో కూడిన భారత్ మౌలిక రంగం ఫిబ్రవరిలో 6.7 శాతం పురోగమించింది. 2023 ఇదే నెల్లో ఈ వృద్ధి రేటు 7.4 శాతం. అయితే జనవరితో పోల్చితే (4.1 శాతం) గ్రూప్ పురోగమించడం గమనార్హం. సమీక్షా నెల్లో ఎరువుల రంగంలో వృద్ధిలేకపోగా, క్షీణ రేటు నమోదయ్యింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ పురోగతి గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 8.2% నుంచి 7.7 శాతానికి తగ్గింది. ఎరువులుసహా బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్టులు, స్టీల్, సిమెంట్, ఎలక్ట్రిసిటీ రంగాలు ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో వీటి వెయిటేజ్ 42 శాతం.

కొటక్ బ్యాంక్ చేతికి సొనాటా ఫైనాన్స్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ తాజాగా ఎన్‌బీఎఫ్‌సీ.. సొనాటా ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 537 కోట్లు వెచ్చించింది. 549 బ్రాంచీల ద్వారా సొనాటా 10 రాష్ట్రాలలో కార్యకలాపాలు విస్తరించింది. ఆర్‌బీఐ రిజిస్టర్డ్ మైక్రోఫైనాన్స్ సంస్థ సొనాటా నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) సుమారు రూ. 2,620 కోట్లుకాగా.. 100 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు కొటక్ బ్యాంక్ పేర్కొంది. దీంతో సొనాటా పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించినట్లు వెల్లడించింది.

ఈ వార్తల నేపథ్యంలో కొటక్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.6 శాతం బలపడి రూ. 1,786 వద్ద ముగిసింది.

ఆర్థిక సంవత్సరానికి
లాభాలతో గుడ్ బై...

- సెన్సెక్స్ 655 పాయింట్లు ప్లస్
- 22,250 స్థాయి పైకి నిఫ్టీ
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

● సెన్సెక్స్ 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ (0.50%), రిలయన్స్ (0.37%), హెచ్‌సీఎల్ (0.26%), టెక్ మహీంద్రా (0.25%) మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 26 షేర్లూ లాభపడ్డాయి.

● బీఎస్ఈ, నిఫ్టీలు ఎంపిక చేసుకున్న షేర్లలో బీటా వెర్షన్ టీ+0 ట్రేడ్ సెటిల్‌మెంట్‌ను ప్రారంభించాయి. తొలి రోజున రెండు ఎక్స్ఛేంజీల్లో 60 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు.

ముంబై: ఆర్థిక సంవత్సరం చివరి రోజైన గురువారం స్టాక్ సూచీలు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 655 పాయింట్లు పెరిగి 73,651 వద్ద ముగిసింది. నిఫ్టీ 203 పాయింట్లు బలపడి 22,327 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి మీడియా మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,194 పాయింట్లు పెరిగి 74,190 వద్ద, నిఫ్టీ 392 పాయింట్లు బలపడి 22,516 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. స్టాక్ మార్కెట్ సంబంధించి ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో పాటు ఫారెక్స్ మార్కెట్లో బలహీనతల కారణంగా ఆఖర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీలు కొంతమేర ఆరంభ లాభాలు కోల్పోయాయి. సెన్సెక్స్ దాదాపు ఒకశాతం లాభపడటంతో బీఎస్ఈలో రూ.3.33 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

నేడు ఎక్స్ఛేంజీలకు గుడ్‌ఫ్రైడే సెలవు. శని, ఆదివారాలు సాధారణ సెలవులు రోజులు కావడంతో ట్రేడింగ్ సోమవారం ప్రారంభం అవుతుంది.

ర్యాలీ ఎందుకంటే

ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్ల(ఏఐఎఫ్)లో రుణదాతల పెట్టుబడులపై గతంలో కఠిన ఆంక్షల విధించిన ఆర్‌బీఐ తాజాగా నిబంధనలను సులభతరం చేయడంతో అధిక వెయిటేజీ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులతో పాటు ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. మోర్గాన్ స్టాన్లీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి గానూ భారత వృద్ధి అవుట్‌లుక్‌ను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి అప్‌గ్రేడ్ చేసింది. ఇటీవల ఎఫ్ఐఐలు భారత ఈక్విటీల పట్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. అమెరికా సూచీలు రికార్డు స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5% పెరిగాయి.

2023- 24లో రూ.128 లక్షల కోట్ల సృష్టి

దేశీయ స్టాక్ మార్కెట్ 2023–24లో గణనీయమైన లాభాలు పంచింది. సెన్సెక్స్ 14,660 పాయింట్లు (25%) ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో కంపెనీల మొత్తం విలువ ఏడాది వ్యవధిలో 128 లక్షల కోట్లు పెరిగి రూ.387 లక్షల కోట్లు చేరింది. సెన్సెక్స్ మార్చి 7న 74,245 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్చి 2న ఇన్వెస్టర్ల సంపద సైతం రూ.394 లక్షల వద్ద ఆల్‌టైం హైని తాకింది. ఇదే కాలంలో నిఫ్టీ 4,967 పాయింట్లు(29%) పెరిగింది. మార్చి 11న 22,526 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది. 2022–23లో 423 పాయింట్లు పెరిగినప్పటికీ ఇన్వెస్టర్లకు రూ. 5.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.



ఐసీఐసీఐ సెక్యూరిటీస్ డీలిస్టింగ్

స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసేందుకు 72 శాతం వాటాదారులు అనుమతించినట్లు ఐసీఐసీఐ సెక్యూరిటీస్ తాజాగా వెల్లడించింది. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు ఈ పథకాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. డీలిస్టింగ్ తదుపరి మాతృ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్‌లో విలీనంకానున్నట్లు తెలియజేసింది. డీలిస్టింగ్ పథకంలో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వాటాదారులు తమ వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లను పొందనున్నట్లు వెల్లడించింది.

కార్వీకి సెబీ మరో షాక్

కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్‌కు సెబీ మరో షాక్ ఇచ్చింది. అర్హత ప్రమాణాలను ఉల్లంఘించినందుకు మర్చంట్ బ్యాంకర్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. 2023 మార్చి 15–17 తేదీల్లో కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్‌ను సెబీ బృందం తనిఖీల నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకుంది. గతంలోనూ సెబీ కార్వీపై పలు చర్యలు తీసుకున్న సంగతి విదితమే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
29-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

టయోటా వాహనాలు కాస్త ప్రియం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టయోటా మోటార్ ఎంపిక చేసిన మోడళ్లపై 1 శాతం వరకు ధరలు పెంచనుంది. ఏప్రిల్ 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి రానున్నాయని కంపెనీ గురువారం ప్రకటించింది. తయారీ, నిర్వహణ వ్యయాలు అధికం అవుతున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. టయోటా తయారు చేస్తున్న మోడళ్ల ధర ఎక్స్‌షోరూంలో రూ.6.86 లక్షలు మొదలుకుని రూ.51.44 లక్షల వరకు ఉంది.

భారత్‌లో ఐఏఐ అనుబంధ సంస్థ ఏర్పాటు



న్యూఢిల్లీ: ఏరోస్పేస్, రక్షణ రంగ దిగ్గజం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) భారత్‌లో తమ అనుబంధ సంస్థ ఏరోస్పేస్ సర్వీసెస్ ఇండియా (ఏఎస్ఐ)ని ప్రారంభించింది. మేక్ ఇన్ ఇండియా లక్ష్య సాధనలో పాలుపంచుకోవడంపై తమ నిబద్ధతకు ఇది నిదర్శనమని ఏఎస్ఐ సీఈవో డ్యానీ లాబర్ తెలిపారు. భారతీయ సాయుధ బలగాల కోసం అధునాతన సిస్టమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా ఐఏఐ, డీఆర్‌డీవో మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఇది దోహదపడగలదని వివరించారు.


సినిమా

ఆ రోజే టైటిల్


● రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. కాగా ఈ సినిమా టైటిల్ రిలీజ్ టీజర్‌ను ఏప్రిల్ 22న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. జూన్‌లో చిత్రీకరణను ప్రారంభించాలనుకుంటున్నారు. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా విడుదలయ్యే అవకాశం ఉందని కోలీవుడ్ సమాచారం. ఇక ప్రస్తుతం 'వేట్టయాన్' సినిమాతో బిజీగా ఉన్నారు రజనీకాంత్. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే విడుదల కానుంది.

గుర్తుండే ఫ్యామిలీ స్టార్


● విజయ్ దేవరకొండ

''ఇరవైఐకటేళ్ల కింద ఏప్రిల్ 5న 'దిల్' సినిమా నిర్మాతగా 'దిల్ రాజు'గా మారాను. 21 ఏళ్ల తర్వాత ఇదే తేదీన మా 'ఫ్యామిలీ స్టార్' సినిమా రిలీజ్ అవుతోంది. మాస్, క్లాస్, యూత్, ఫ్యామిలీ అనే తేడా లేకుండా అందరికీ నచ్చే కథతో ఈ చిత్రం రూపొందింది'' అని 'దిల్' రాజు అన్నారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా పరశురామ్ పెట్ల దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన 'ఫ్యామిలీ స్టార్' వచ్చే నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ కార్యక్రమంలో 'దిల్' రాజు ఇంకా మాట్లాడుతూ – ''తన కుటుంబాన్ని పైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించే ప్రతి వ్యక్తి ఫ్యామిలీ స్టార్ అని చెప్పడమే ఈ సినిమా కథాంశం. మీలోనూ (ప్రేక్షకులు) ఫ్యామిలీ స్టార్స్ ఉంటారు. లేకపోతే ఈ సినిమా చూశాక ఫ్యామిలీ స్టార్ అవ్వాలని కోరుకుంటారు. 'గీత గోవిందం' తర్వాత పరశురామ్, విజయ్ కాంబినేషన్‌లో రూపొందిన ఈ చిత్రం ఈ సమ్మర్‌లో అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు. ''ఈ చిత్రాన్ని, విజయ్ దేవరకొండను, మృణాల్ ఠాకూర్‌ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు, ప్రతి తెలుగు కుటుంబం కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటారు'' అని పరశురామ్ అన్నారు.

ప్రేమ... నవ్వు... యుద్ధం


● కార్తీక్ సుబ్బరాజు, సూర్య

'లవ్... లాఫ్టర్... వార్...' అంటూ సూర్య కొత్త చిత్రం అధికారిక ప్రకటన గురువారం వెలువడింది. 'పిజ్జా, పేటా, జిగర్ తండా, జిగర్ తండా డబుల్ ఎక్స్' వంటి హిట్ చిత్రాల దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. హీరో సూర్యకి ఇది 44వ చిత్రం. అయితే ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. సినిమా ప్రకటించిన సందర్భంగా 'లవ్... లాఫ్టర్... వార్...' (ప్రేమ.. నవ్వు.. యుద్ధం) అని ఉన్న పోస్టర్‌ని ఎక్స్‌లో షేర్ చేశారు కార్తీక్ సుబ్బరాజు. త్వరలోనే పూర్తి వివరాలను ప్రకటిస్తారు. ఈ చిత్రాన్ని సూర్య సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, కార్తీక్ సుబ్బరాజు స్టోన్ బెంచ్ క్రియేషన్స్ నిర్మించనున్నాయి. ఇక ప్రస్తుతం శివ దర్శకత్వంలో 'కంగువ' చిత్రంలో నటిస్తున్న సూర్య తనకు 'ఆకాశం నీ హద్దు రా' వంటి సూపర్ హిట్ ఇచ్చిన సుధ కొంగర దర్శకత్వంలో ఓ సినిమాకి పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే.

ఇక నా మాటే...


● శర్వానంద్

లండన్‌లో 'ఇక నా మాటే...' అంటూ ఆడి పాడారు శర్వానంద్. ఈ పాటకు జోష్‌గా స్టయిలిష్ స్టెప్స్ వేసి ఎంజాయ్ చేశారు. ఇదంతా 'మనమే' చిత్రం కోసమే. శర్వానంద్ హీరోగా కృతీ శెట్టి హీరోయిన్‌గా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి 'ఇక నా మాటే..' పాటను గురువారం విడుదల చేశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన ఈ పాటకు కృష్ణచైతన్య సాహిత్యం అందించారు. ''ఈ పాటకు మంచి ట్యూన్ ఇవ్వడంతో పాటు హేషమ్ అద్భుతంగా పాడారు. లండన్‌లోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ పాటకు క్రాంతి వర్మ కొరియోగ్రఫీ చేశారు. విష్ణు శర్మ, జ్ఞాన శేఖర్‌ల కెమెరా వర్క్ కనువిందుగా ఉంటుంది. ఇక శర్వానంద్ స్టయిలిష్ డ్రెస్సింగ్, స్టైలిష్ మూవ్స్ ఆకట్టుకునేలా ఉంటాయి. కాలేజ్ స్టూడెంట్స్‌ని అలరించే పాట ఇది. యునిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఎస్..చెప్పుకున్నారు


● అదితి, సిద్దార్థ్

సిద్దార్థ్, అదితీరావ్ హైదరీల వివాహం తెలంగాణలోని వనపర్తి జిల్లా రంగనాయక స్వామి దేవాలయంలో జరిగిందనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే సిద్దార్థ్, అదితీల పెళ్లి ఇంకా జరగలేదని, వనపర్తిలో వీరిద్దరి నిశ్చితార్థం జరిగిందని తెలుస్తోంది. అదితీతో తాను కలిసి ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో షేర్ చేసి...'ఆమె ఎస్ చెప్పింది... ఎంగేజ్డ్' అని క్యాప్షన్ ఇచ్చారు సిద్దార్థ్. ఇదే ఫొటోను షేర్ చేసి.. 'అతను ఎస్ చెప్పాడు... ఎంగేజ్డ్' అని పేర్కొన్నారు అదితీరావ్ హైదరీ. కాగా వీరి పెళ్లి తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

టిల్లు నవ్వడు... ప్రేక్షకులను నవ్విస్తాడు



''డీజే టిల్లు' సినిమా రిలీజ్ సమయంలో ఆ సినిమాపై అంచనాలు లేవు. టిల్లు పాత్ర ఎలా ఉంటుందో తెలియదు. కానీ థియేటర్స్‌లో టిల్లు క్యారెక్టరైజేషన్‌ను చూసి ప్రేక్షకులు సర్‌ప్రైజ్ అయ్యారు. అయితే ఇప్పుడు పరిస్థితి వేరు. తెలిసిన డీజే టిల్లు పాత్రతోనే మరోసారి మ్యాజిక్ చేసి, ఆడియన్స్‌ను మెప్పించాలంటే కాస్త ఒత్తిడి ఉంటుంది. అయితే ఈ ఒత్తిడిని జయించి మెరుగైన అవుట్‌పుట్‌ని ప్రేక్షకులకు ఇచ్చేందుకు యూనిట్ అంతా కష్టపడ్డాం'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా విమల్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. 2022లో విజయం సాధించిన 'డీజే టిల్లు' సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''సీక్వెల్‌లో టిల్లు పాత్ర ఇంకా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. అయితే సీక్వెల్‌లో టిల్లు మరో పెద్ద సమస్యలో చిక్కుకుంటాడు. ఆ సమస్య ఏంటి? అనేది ఆడియన్స్ థియేటర్స్‌లోనే చూడాలి. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు, షాక్‌లు ఉన్నాయి. సినిమాలో టిల్లు ఎక్కడా నవ్వడు... కానీ ఆడియన్స్‌ను నవ్విస్తాడు. అంటే టిల్లు ట్రాజెడీ.. ఆడియన్స్‌కు కామెడీ అన్నమాట. ఇక హీరోయిన్‌గా అనుపమగారి పాత్ర బలంగానే ఉంటుంది. 'టిల్లు' టైటిల్ సాంగ్ ఉండొచ్చు. త్రివిక్రమ్‌గారి సలహాలు 'టిల్లు స్క్వేర్'కు ఉపయోగపడ్డాయి. 'డీజే టిల్లు'కు తమన్‌గారి నేపథ్య సంగీతం ఎలా వర్కౌట్ అయ్యిందో, సీక్వెల్‌కు భీమ్స్ మ్యూజిక్ అలానే వర్కౌట్ అవుతుంది. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్'కు రైటర్‌గా చేశాను. వెంటనే 'టిల్లు 3' రాయాలనుకోవడం లేదు. మరో కథ రాయాలని ఉంది. నా తర్వాతి చిత్రం 'జాక్' చిత్రీకరణ 30 శాతం పూర్తయింది. నీరజ కోనగారి దర్శకత్వంలోని సినిమాకు స్క్రీన్ ప్లే వర్క్ జరుగుతోంది'' అని చెప్పుకొచ్చారు.

– సిద్ధు జొన్నలగడ్డ

నవీన్‌కు గాయాలు?


● నవీన్ పొలిశెట్టి

'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రాల్లో హీరోగా నటించిన నవీన్ పొలిశెట్టి తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. కాగా అమెరికాలో నవీన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారని, చేతికి గాయమైందనే వార్తలు వస్తున్నాయి. దాదాపు రెండు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సినదిగా వైద్యులు సూచించారట. వెకేషన్‌లో భాగంగా నవీన్ అమెరికా వెళ్లారని భోగట్టా.


● మృణాల్ ఠాకూర్

కొత్త జోడీ కుదిరేనా?


● వరుణ్ ధావన్

బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. 'మై తేరా హీరో', 'జుడ్వా 2', 'కూలీ నెం.1' వంటి సినిమాల తర్వాత హీరో వరుణ్ ధావన్, దర్శకుడు డేవిడ్ ధావన్ కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా తెరకెక్కనుందని బీ టౌన్ సమాచారం. ఈ సినిమాలో ఇద్దరు కథానాయికలకు చోటు ఉందని, ఓ కథనాయికగా మృణాల్ ఠాకూర్‌ను యూనిట్ ఎంపిక చేసుకుందని బాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. మరి.. వరుణ్, మృణాల్‌ల జోడీ కుదురుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్


● ఎమ్మా స్టోన్

ఆస్కార్ విన్నింగ్ యాక్ట్రస్ ఎమ్మా స్టోన్ మెయిన్ లీడ్ రోల్‌లో నటించిన తాజా హాలీవుడ్ ఆంథాలజీ ఫిల్మ్ 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్'. 'పూర్ థింగ్స్' సినిమా తర్వాత దర్శకుడు యోర్గోస్ లాంటిమోస్‌తో కలిసి ఎమ్మా స్టోన్ చేసిన చిత్రం ఇది. జెస్సీ ప్లెమోన్స్, విల్లెం డాఫో, మార్గరెట్ క్వాలీ, హాంగ్ చౌ, జో ఆల్విన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. విభిన్న భాగాలు ఉండే ఆంథాలజీగా 'కైండ్స్ ఆఫ్ కైండ్‌నెస్' ఉంటుందని హాలీవుడ్ సమాచారం. స్వీయ నియంత్రణ కోల్పోయిన ఓ వ్యక్తి, భార్య ప్రవర్తనలో అనూహ్య మార్పులు గమనించిన ఓ పోలీసాఫీసర్, ఆధ్యాత్మిక గురువు కావాలనుకునే ఓ మహిళ.. ఇలా విభిన్నమైన విభాగాలను దర్శకుడు ఈ సినిమాలో చెబుతున్నారని టాక్. ఇక ఈ చిత్రం అమెరికాలో జూన్ 21న, యూకేలో జూన్ 28న విడుదల కానుంది.



రాజస్తాన్ రాయల్స్ జట్టులో కేశవ్ మహరాజ్

దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌కు ఐపీఎల్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. గాయంతో ఐపీఎల్ టోర్నీకి దూరమైన బౌలర్ ప్రసిధ్ కృష్ణ స్థానంలో రాజస్తాన్ రాయల్స్ జట్టు కేశవ్‌ను అతని కనీస ధర రూ. 50 లక్షలకు జట్టులోకి తీసు కుంది. 34 ఏళ్ల కేశవ్ దక్షిణాఫ్రికా తరఫున 27 టి20లు, 44 వన్డేలు, 50 టెస్టులు ఆడి మొత్తం 237 వికెట్లు తీశాడు. మరోవైపు గాయపడ్డ ముజీబ్ ఉర్ రెహ్మాన్ స్థానంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ అఫ్గానిస్తాన్‌కు చెందిన 16 ఏళ్ల స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను జట్టులోకి తీసుకుంది.

సూర్య... ఇంకొన్ని మ్యాచ్‌ల తర్వాతే!

ప్రపంచ నంబర్‌వన్ టి20 బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున బరిలోకి దిగేందుకు ఇంకొంత సమయం పడుతుందని బీసీసీఐ తెలిపింది. జూన్‌లో టి20 ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో తొందరపడి సూర్యను ఐపీఎల్‌లో వెంటనే బరిలోకి దించాలని బోర్డు భావించడం లేదు. జనవరిలో సూర్యకు 'స్పోర్ట్స్ హెర్నియా' ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం అతను జాతీయ క్రికెట్ అకాడమీలో కోలుకుంటున్నాడు.





రియాన్ పరాగ్

పరాగ్ ప్రతాపం

రాజస్తాన్ రాయల్స్ బ్యాటర్ మెరుపు ఇన్నింగ్స్

- 45 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లతో 84 నాటౌట్
- రాయల్స్‌కు రెండో గెలుపు
- 12 పరుగులతో ఓడిన ఢిల్లీ

జైపూర్: సొంతగడ్డపై రాజస్తాన్ రాయల్స్ వరుసగా రెండో విజయాన్ని సాధించింది. టాపార్డర్ చేతులెత్తేసిన వేళ రియాన్ పరాగ్ (45 బంతుల్లో 84 నాటౌట్; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లందరినీ చితగ్గొట్టాడు. దీంతో ఐపీఎల్ 17వ సీజన్‌లో మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ 12 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. టాస్ గెలిచిన ఢిల్లీ బౌలింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రియాన్ పరాగ్ ఒంటిచేత్తో స్కోరు బోర్డును హోరెత్తించాడు. ఖలీల్, ముకేశ్, నోర్జే, అక్షర్, కుల్దీప్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి ఓడింది. డేవిడ్ వార్నర్ (34 బంతుల్లో 49; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (23 బంతుల్లో 44 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. బర్గర్, చహల్ చెరో 2 వికెట్లు తీశారు.

పరాగ్ మెరుపులతో....

రాజస్తాన్ ఆదిలోనే కష్టాల్లో పడింది. 7.2 ఓవర్లలో జట్టు స్కోరు 36/3. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (5) రెండో ఓవర్లో, కెప్టెన్ సంజూ సామ్సన్ (15) ఆరో ఓవర్లో పెవిలియన్ చేరారు. పవర్‌ప్లేలో వీళ్లిద్దరి వికెట్లు కోల్పోయిన రాయల్స్ 31 పరుగులే చేసింది. కాసేపటికే బట్లర్ (11)కు కుల్దీప్ ముగింపు పలికాడు. ఈ దశలో రియాన్ పరాగ్ ఇన్నింగ్స్‌కు అంత తానై నడిపించాడు. చెత్తబంతుల్ని బౌండరీలతో శిక్షించాడు. సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. బ్యాటింగ్ ప్రమోషన్‌లో వచ్చిన అశ్విన్ (19 బంతుల్లో 29; 3 సిక్స్‌లు) చూడచక్కని సిక్స్‌లతో అలరించాడు. నాలుగో వికెట్‌కు 54 పరుగులు జతచేసిన అశ్విన్, పరాగ్ జోడీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. అశ్విన్ అవుటయ్యాక 15వ ఓవర్లో రాజస్తాన్ వంద పరుగుల మైలురాయిని చేరుకుంది. ఆ ఓవర్ ముగిసేసరికి రాజస్తాన్ జట్టు స్కోరు 108/4. ఇలాంటి స్థితి నుంచి 180 పైచిలుకు స్కోరు చేస్తుందని ఎవరూ ఊహించలేదు. 34 బంతుల్లో పరాగ్ అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. ఆ తర్వాత పరాగ్ బ్యాట్ విధ్వంసమే చేసింది. దీంతో ధ్రువ్ జురెల్ (12 బంతుల్లో 20; 3 ఫోర్లు)తో పరాగ్ ఐదో వికెట్‌కు 23 బంతుల్లోనే 52 పరుగులు చకచకా జోడించాడు. ఆ తర్వాత హెట్‌మైర్‌తో కలిసి ఆరో వికెట్‌కు 16 బంతుల్లోనే 43 పరుగులు జతచేశాడు. నోర్జే వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో పరాగ్ వరుసగా 4, 4, 6, 4, 6, 1లతో 25 పరుగులు దంచుకున్నాడు. దీంతో చివరి 5 ఓవర్లలో రాజస్తాన్ 77 పరుగుల్ని అవలీలగా సాధించింది.

బర్గర్ దెబ్బ...

వార్నర్‌తో ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన మిచెల్ మార్ష్ (12 బంతుల్లో 23; 5 ఫోర్లు) బౌండరీలతో రెచ్చిపోయాడు. కానీ అంతలోనే ఇంపాక్ట్ బౌలర్ నాండ్రె బర్గర్... మార్ష్‌తో పాటు రికీ భుయ్ (0)ని మూడు బంతుల వ్యవధిలో అవుట్ చేసి ఢిల్లీని కష్టాల్లో పడేశాడు. ఈ దశలో వార్నర్ సిక్స్‌లు, ఫోర్లతో లక్ష్యానికి తగ్గ రన్‌రేట్‌తో క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌ను ధాటిగా నడిపించాడు. 11 ఓవర్లదాకా 93/2 స్కోరుతో ఢిల్లీ పటిష్టస్థితిలో ఉంది. కానీ తర్వాతి ఓవర్లో ఫిఫ్టీకి పరుగు దూరంలో ఉన్న వార్నర్... సందీప్ శర్మ కళ్లు చెదిరే క్యాచ్‌కు నిష్క్రమించాడు. కాసేపటికే కెప్టెన్ రిషభ్ పంత్ (26 బంతుల్లో 28; 2 ఫోర్లు, 1 సిక్స్)ను స్పిన్నర్ చహల్ వెనక్కి పంపాడు. ఇంపాక్ట్‌గా వచ్చిన పొరెల్ (9) కూడా చహల్ బౌలింగ్‌లో బోల్తా పడ్డాడు. బౌల్ట్ క్యాచ్ వదిలేయడంతో 14 పరుగుల స్కోరువద్ద బతికిపోయిన స్టబ్స్ తర్వాత వరుస రెండు బంతుల్లో భారీ సిక్స్‌లు కొట్టాడు. అక్షర్ (13 బంతుల్లో 15 నాటౌట్; 1 ఫోర్) పరిస్థితులకు తగ్గట్లు ఆడలేకపోయాడు. దీంతోపాటు డెత్ ఓవర్లలో సందీప్, అవేశ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. ఈ సీజన్‌లో జరిగిన 9 మ్యాచ్‌ల్లోనూ హోమ్ టీమ్ నెగ్గడం విశేషం.



వార్నర్

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (బి) ముకేశ్ 5; బట్లర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 11; సామ్సన్ (సి) పంత్ (బి) ఖలీల్ 15; పరాగ్ (నాటౌట్) 84; అశ్విన్ (సి) స్టబ్స్ (బి) అక్షర్ 29; జురెల్ (బి) నోర్జే 20; హెట్‌మైర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 185. **వికెట్ల పతనం:** 1-9, 2-30, 3-36, 4-90, 5-142.
బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 4-0-24-1, ముకేశ్ 4-0-49-1, నోర్జే 4-0-48-1, అక్షర్ పటేల్ 4-0-21-1, కుల్దీప్ 4-0-41-1

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) సందీప్ (బి) అవేశ్ ఖాన్ 49; మార్ష్ (బి) బర్గర్ 23; రికీ భుయ్ (సి) సామ్సన్ (బి) బర్గర్ 0; పంత్ (సి) సామ్సన్ (బి) చహల్ 28; స్టబ్స్ (నాటౌట్) 44; అభిషేక్ పొరెల్ (సి) బట్లర్ (బి) చహల్ 9; అక్షర్ పటేల్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 175. **వికెట్ల పతనం:** 1-30, 2-30, 3-97, 4-105, 5-122.
బౌలింగ్: ట్రెంట్ బౌల్ట్ 3-0-29-0, బర్గర్ 3-0-29-2, అశ్విన్ 3-0-30-0, అవేశ్ ఖాన్ 4-0-29-1, చహల్ 3-0-19-2, సందీప్ 4-0-36-0.

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X కోల్‌కతా
వేదిక: బెంగళూరు
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
చెన్నై	2	2	0	4	1.979
రాజస్తాన్	2	2	0	4	0.800
హైదరాబాద్	2	1	1	2	0.675
కోల్‌కతా	1	1	0	2	0.200
పంజాబ్	2	1	1	2	0.025
బెంగళూరు	2	1	1	2	-0.180
గుజరాత్	2	1	1	2	-1.425
ఢిల్లీ	2	0	2	0	-0.528
ముంబై	2	0	2	0	-0.925
లక్నో	1	0	1	0	-1.000

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఫైనల్లో బోపన్న జోడీ



ఫ్లోరిడా: ప్రతిష్టాత్మక మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ రోహన్ బోపన్న డబుల్స్ విభాగంలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో టాప్ సీడ్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-1, 6-4తో నాలుగో సీడ్ మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్)-హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా) జంటపై విజయం సాధించింది. 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 3-6, 7-6 (7/3), 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో జాన్ ప్యాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా)-సెమ్ వెర్‌బీక్ (నెదర్లాండ్స్) జోడీపై గెలిచింది. భారత్‌కే చెందిన మహేశ్ భూపతితో కలిసి బోపన్న చివరిసారి 2012లో మయామి ఓపెన్ టోర్నీ డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి ప్రవేశించి ఓడిపోయాడు.

పోరాడి ఓడిన మనిక



ఇంచియోన్ (దక్షిణ కొరియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చాంపియన్స్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 38వ ర్యాంకర్ మనిక 12-10, 9-11, 6-11, 11-8, 8-11తో ప్రపంచ ఆరో ర్యాంకర్ హినా హయాటా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక ఐదో సెట్‌లో కీలక తరుణంలో మనిక తప్పిదాలు చేసి ఓటమి పాలైంది. తొలి రౌండ్‌లో ఓడిన మనిక బత్రాకు 3,500 డాలర్ల (రూ. 2 లక్షల 91 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

క్వార్టర్ ఫైనల్లో సింధు

మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి-సుమీత్ రెడ్డి జోడీ ముందంజ





మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో సీడ్, భారత స్టార్ పీవీ సింధు జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో విజయంతో ఈ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 21-14, 21-12తో హువాంగ్ యు సున్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు తొలి గేమ్ ఆరంభంలో కాస్త పోటీ ఎదురైంది. స్కోరు 11-12 వద్ద సింధు ఒక్కసారిగా చెలరేగి వరుసగా తొమ్మిది పాయింట్లు గెలిచి 20-12తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ సింధు దూకుడు కొనసాగింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో థాయ్‌లాండ్ ప్లేయర్ సుపనిదతో సింధు ఆడుతుంది. ముఖా ముఖి రికార్డులో సింధు 5-3తో ఆధిక్యంలో ఉంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణకు చెందిన సిక్కి రెడ్డి-సుమీత్ రెడ్డి జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి-సుమీత్ ద్వయం 22-20, 21-18తో ప్రెస్లీ స్మిత్-అలీసన్ లీ (అమెరికా) జంటపై గెలిచింది.

అశ్విని-తనీషా జోడీ గెలుపు

మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) ద్వయం క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా జంట 21-14, 21-8తో టిఫానీ హో-గ్రోన్యా సోమర్‌విల్లె (ఆస్ట్రేలియా) జోడీపై విజయం సాధించింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ధ్రువ్ కపిల-అర్జున్ (భారత్) ద్వయం 21-17, 21-19తో క్రిస్టోఫర్-మాథ్యూ గ్రిమ్లె (స్కాట్లాండ్) జంటపై నెగ్గగా... గరగ కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ (భారత్) జోడీ 16-21, 21-15, 16-21తో క్రిస్టో పొపోవ్-తొమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది.

లాటిన్ అమెరికా క్లబ్ ఫుట్‌బాల్‌లో తొలి భారతీయ ప్లేయర్



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాలర్ బిజయ్ ఛెత్రి అరుదైన ఘనత సాధించాడు. లాటిన్ అమెరికా క్లబ్ ఫుట్‌బాల్‌లో బరిలోకి దిగనున్న తొలి భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందనున్నాడు. మణిపూర్‌కు చెందిన 22 ఏళ్ల బిజయ్‌తో ఉరుగ్వేకు చెందిన కొలోన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) ఒప్పందం చేసుకుంది. ఇంకా భారత సీనియర్ జట్టుకు ఆడని బిజయ్ 2016లో షిల్లాంగ్ లాజోంగ్ క్లబ్ తరఫున అరంగేట్రం చేశాడు. ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్‌లో చెన్నైయిన్ ఎఫ్‌సీ తరఫున ఆడుతున్న బిజయ్ గతంలో ఇండియన్ యారోస్, చెన్నై సిటీ, రియల్ కశ్మీర్, శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ తరఫున బరిలోకి దిగాడు.

నితిన్ మీనన్ కొనసాగింపు

ఐసీసీ ఎలైట్ అంపైర్ల జాబితా ప్రకటన



దుబాయ్: భారత అంపైర్ నితిన్ మీనన్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఎలైట్ అంపైర్ల ప్యానెల్‌లో వరుసగా ఐదో ఏడాది తన స్థానం పదిలం చేసుకున్నారు. ఇండోర్‌కు చెందిన నితిన్ తొలిసారి 2020లో ఐసీసీ ఎలైట్ అంపైర్ల జాబితాలో చోటు దక్కించుకున్నారు. గత నాలుగేళ్లుగా ఐసీసీ ఆయన సేవల్ని గుర్తించి ఎలైట్ ప్యానెల్‌లో కొనసాగిస్తూ వచ్చింది. తాజాగా ఈ ఏడాది కూడా మరోసారి పొడిగింపు లభించింది. ఓవరాల్‌గా అత్యున్నత అంపైర్ల ప్యానెల్‌కు ఎంపికైన మూడో భారత అంపైర్ మీనన్. గతంలో ఎస్. రవి, మాజీ స్పిన్నర్ ఎస్. వెంకటరాఘవన్‌లు ఎలైట్ క్లబ్‌లో ఉండేవారు. రవి 33 టెస్టు మ్యాచ్‌లకు ఫీల్డ్ అంపైర్‌గా సేవలందించగా, వెంకటరాఘవన్ ఏకంగా 73 టెస్టులకు (అన్ని ఫార్మాట్లలో 125 మ్యాచ్‌లు) అంపైరింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం 12 మంది సభ్యులు గల ఈ ఎలైట్ క్లబ్‌లో భారత్ నుంచి 40 ఏళ్ల నితిన్ మీనన్ ఒక్కరే ఉన్నారు. కేవలం నాలుగేళ్ల కాలంలోనే ఆయన 122 అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేశారు. ఇక ఈ ఏడాది బంగ్లాదేశ్‌కు చెందిన షర్ఫుద్దౌలా షాహిద్‌కు కొత్తగా ఎలైట్ అంపైర్ల జాబితాలో చోటు దక్కింది. బంగ్లా తరఫున ఈ అర్హత సాధించిన తొలి అంపైర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ఐసీసీ ఎలైట్ మ్యాచ్ రిఫరీల జాబితా నుంచి సీనియర్ రిఫరీ క్రిస్ బ్రాడ్‌ను తొలగించారు. 2003 నుంచి సుదీర్ఘకాలం కొనసాగిన ఆయన 123 టెస్టులు, 361 వన్డేలు, 135 టి20లు, 15 మహిళల టి20లకు రిఫరీగా బాధ్యతలు నిర్వర్తించారు. పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగానే ఆయన్ని తప్పించామని, ఇతరత్రా కారణాల్లేవని ఐసీసీ తెలిపింది.

అనిరుధ్-విజయ్ జోడీకి నిరాశ



కోస్టా బ్రావా (స్పెయిన్): జిరోనా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ తన భాగస్వామి విజయ్ సుందర్ ప్రశాంత్‌తో కలిసి తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. మూడో సీడ్ సాండెర్ అరెండ్స్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీతో జరిగిన మొదటి రౌండ్ మ్యాచ్‌లో అనిరుధ్-విజయ్ ద్వయం 4-6, 4-6తో ఓటమి పాలైంది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జంట మూడు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ (భారత్)-ఆండ్రీ బెగెమాన్ (జర్మనీ) ద్వయం 4-6, 3-6తో ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)-హెన్రీ పాటెన్ (బ్రిటన్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. తొలి రౌండ్‌లో ఓడిన అనిరుధ్-విజయ్; బాలాజీ-బెగెమాన్ జోడీలకు 800 యూరోలు (రూ. 72 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్తాన్

మహిళల ఆసియా కప్ టి20 టోర్నీ షెడ్యూల్ విడుదల



దుబాయ్: ఈ ఏడాది మహిళల ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌కు శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనుంది. జూలై 19 నుంచి 28 వరకు దంబుల్లాలో ఈ టోర్నీ జరుగుతుందని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు, బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. చివరిసారి 2022లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఈ టోర్నీలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఏడోసారి విజేతగా నిలిచింది. క్రితంసారి ఏడు జట్లు పాల్గొనగా... ఈసారి ఎనిమిది జట్లు పోటీపడనున్నాయి. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, యూఏఈ, నేపాల్... గ్రూప్ 'బి'లో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేసియా, థాయ్‌లాండ్ జట్లున్నాయి. భారత్ తమ మూడు లీగ్ మ్యాచ్‌లను వరుసగా యూఏఈ (జూలై 19న), పాకిస్తాన్ (జూలై 21న), నేపాల్ (జూలై 23న) జట్లతో ఆడుతుంది. జూలై 26న సెమీఫైనల్స్... జూలై 28న ఫైనల్ జరుగుతాయి.

నెట్ స్కోర్‌తో పీహెచ్‌డీ ప్రవేశాలు

యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో పీహెచ్‌డీ ప్రవేశాల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టినట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ జగదీశ్‌కుమార్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి జాతీయ అర్హత పరీక్ష (యూజీసీ నెట్) ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. గతంలో వర్సిటీలు విడివిడిగా పీహెచ్‌డీ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించేవని, ఇలా విద్యార్థులు బహుళ పరీక్షలతో అవస్థలు పడేవారన్నారు. వారికి ఉపశమనం కల్పించేలా నెట్ ద్వారా 3 కేటగిరీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు వీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నెట్ స్కోర్‌ను ఆధారంగా జేఆర్ఎఫ్ అవార్డు, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీకి అర్హత సాధించడం, ఆ తర్వాత అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హతతోపాటు పీహెచ్‌డీలో ప్రవేశం, కేవలం పీహెచ్‌డీలో మాత్రమే ప్రవేశాలు ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేశామన్నారు.

ఏపీ ఆర్‌సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: ఏపీలో పీహెచ్‌డీ ప్రవేశాలకు నిర్వహించే ఆర్‌సెట్ 2023–24 దరఖాస్తు గడువును రూ.2,000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 3 వరకు, రూ.5,000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 6 వరకు పొడిగిస్తున్నట్లు సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు గురువారం తెలిపారు.

ఈఏపీసెట్, నీట్ విద్యార్థులకు
'సాక్షి' ఆధ్వర్యంలో మాక్ టెస్ట్‌లు

- ఏప్రిల్ 27న నీట్.. 28న ఈఏపీసెట్ పరీక్ష
- రిజిస్ట్రేషన్‌లకు ఏప్రిల్ 22 వరకు అవకాశం



సాక్షి ఎడ్యుకేషన్: ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం ..ఇంజినీరింగ్, లేదా మెడిసిన్. అధిక శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజినీరింగ్/మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్..అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్/అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్లుకల్పించే ఈఏపీసెట్‌కు లక్షల మంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్ పరీక్షలకు 'సాక్షి' మాక్ టెస్ట్‌లు నిర్వహించనుంది. దీనికి టెక్నాలజీ పార్ట్‌నర్‌గా 'మై ర్యాంక్' వ్యవహరిస్తోంది. పరీక్షకు కొద్దిరోజుల ముందు వాస్తవ పరీక్ష లాంటి వాతావరణంలో జరిగే 'సాక్షి' మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్స్ స్థాయిని అంచనా వేసుకుని, దాన్ని మరింత మెరుగుపరచుకోవచ్చు. ఆసక్తి ఉన్నవారు https://www.arenaone.in/mock ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్‌ఫీజు రూ.250గా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్‌కు ఏప్రిల్ 22 చివరి తేదీ. రిజిస్టర్ చేసుకున్న ఈ మెయిల్‌కు హాల్ టికెట్ నంబర్ వస్తుంది. ఏప్రిల్ 27న నీట్, ఏప్రిల్ 28న ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఇంజినీరింగ్ పరీక్షలుంటాయి. ఈ ఆన్‌లైన్ టెస్ట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో ఎప్పుడైనా రాసుకోవచ్చు. పరీక్షా సమయం 3 గంటలు. ఈ పరీక్షలకు హాల్ టికెట్ నంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నెంబర్ (పాస్‌వర్డ్)తో ఆ సమయంలో ఎప్పుడైనా లాగిన్ అయ్యి రాసుకోవచ్చు. పరీక్ష ముగిసిన వెంటనే స్కోర్‌ను వెంటనే చెక్ చేసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshimocktest.myrank.co.inలో నిర్వహిస్తారు. టెస్ట్ కీ ని ఏప్రిల్ 30న ఇదే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. పూర్తి వివరాలకు 95055 14424, 96660 13544, 96665 72244 నంబర్లకు కాల్ చేయవచ్చు.

క్యూట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

31వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం

సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ(క్యూట్)–యూజీ) దరఖాస్తు గడువు ఈ నెల 31 వరకు పొడిగించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం ద్వారా దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, డీమ్డ్‌టుబీ వర్సిటీల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. ఏప్రిల్ 2, 3 తేదీల్లో దరఖాస్తులో సవరణలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 15 నుంచి 31 వరకు ప్రవేశ పరీక్షలకు షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. మే రెండో వారంలో అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ సూచించింది.

దేశ వ్యాప్తంగా 354 పరీక్షా కేంద్రాలతో పాటు విదేశాల్లో మరో 26 కేంద్రాల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్టు(సీబీటీ)కు ఎన్‌టీఏ ఏర్పాట్లు చేసింది. క్యూట్‌లో ప్రతిభ ఆధారంగా దేశంలోని 47 కేంద్ర, 54 రాష్ట్ర, 37 డీమ్డ్, 177 ప్రైవేట్, 6 ఇతర విశ్వవిద్యాలయాలు, అటానమస్ కాలేజీల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ స్క్రీనింగ్ టెస్టు వాయిదా

సాక్షి, అమరావతి: డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ స్క్రీనింగ్ టెస్టు షెడ్యూల్‌ను వాయిదా వేస్తున్నట్లు ఏపీపీఎస్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 13న జరగాల్సిన స్క్రీనింగ్ టెస్టును మే 25న నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఎన్నికలు, డీఎస్సీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేసినట్లు పేర్కొంది.

నూతన జాతీయ విద్యావిధానంపై నేడు 'శశి'లో సదస్సు

ఉండ్రాజవరం: నూతన జాతీయ విద్యా విధానం, సీబీఎస్ఈ కోర్సుపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం సదస్సు నిర్వహించనున్నట్లు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ గురువారం తెలిపారు. ఈ సదస్సు వేలివెన్ను క్యాంపస్‌లో జరుగుతుందని పేర్కొన్నారు. 10వ తరగతి తరువాత విద్యార్థులు ఇంటర్‌లో ఏ కోర్సుల్లో చేరడానికి అవకాశాలుంటాయో తెలియజేయడంతోపాటు ఐఐటీ, నీట్, ఇతర కోర్సుల్లో సందేహాలను నివృత్తి చేయనున్నామన్నారు. విద్యారంగంలో 44 సంవత్సరాల అపార అనుభవం గల శశి విద్యాసంస్థలోని అధ్యాపక బృందం ఈ కోర్సులపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ విద్యపై అవగాహన కల్పిస్తారని వివరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 95532 00007, 95428 50007 సెల్ నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం । 29 । మార్చి । 2024



పీహెచ్‌సీ సందర్శన

కంచికచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ టీమ్ (ఐఐపీహెచ్) గురువారం సందర్శించింది. ప్రొఫెసర్ రాజన్ శుక్ల తదితరులు పాల్గొన్నారు.



యార్డులో 1,12,869 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,03,020 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,12,869 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

ఇఫ్తార్ విందులో మంత్రి జోగి



ఉయ్యూరు: పట్టణంలోని దయారా మసీదులో గురువారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
విజయవాడ	6.25	4.47
జగ్గయ్యపేట	6.27	4.53
మచిలీపట్నం	6.24	4.44
గుడివాడ	6.25	4.47

న్యూస్‌రీల్

నూతన వధూవరులకు అమ్మవారి దీవెనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన నూతన వధూవరులకు ఆలయ అధికారులు అంతరాలయ దర్శనంతో పాటు వేద ఆశీర్వచనాన్ని ఉచితంగా అందజేశారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు ఇంద్రకీలాద్రిపై నూతనంగా ప్రవేశపెట్టిన సౌభాగ్యమస్తు కార్యక్రమంలో భాగంగా గురువారం పలువురు నూతన వధువరులకు ఆలయ అర్చకులు అమ్మవారి తరుపున దీవెనలు అందించారు. 200 మంది కొత్త జంటలకు ఆశీర్వచనం అందచేసినట్లు ఆలయ ఏఈవో ఎన్. రమేష్‌బాబు పేర్కొన్నారు.

దుర్గమ్మకు బంగారపు తాడు, సూత్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన భక్తులు గురువారం బంగారపు తాడు, సూత్రాలను కానుకగా సమర్పించారు. మార్టూరుకు చెందిన శ్రీ మహాలక్ష్మీ సాయి గ్రానైట్స్‌కు చెందిన టి.మల్లికార్జునరావు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి సుమారు రూ.8.50 లక్షల వ్యయంతో 124 గ్రాముల బంగారంతో తయారు చేయించిన తాడు, రెండు సూత్రాలను కానుకగా సమర్పించారు. తొలుత దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు, అమ్మవారికి సమర్పించిన బంగారపు తాడు, సూత్రాలకు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అలంకరించారు. దాతలకు వేద పండితుల ఆశీర్వచనం అందచేయగా, ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ పర్యవేక్షకులు జగదీష్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి



చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల సంఘం నిబంధనలు క్షుణ్ణంగా అవగాహన చేసుకొని విధులు సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1763 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే శిక్షణలో నివృత్తి చేసుకోవాలని కోరారు. ప్రతి చిన్న విషయం క్షుణ్ణంగా పరిశీలించి తగిన జాగ్రత్త వహించాలన్నారు. శిక్షణ ఇచ్చిన అంశాలపై పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీటి ద్వారా శిక్షణలో గ్రహించిన విషయాలు ఏ మేరకు అర్థం చేసుకున్నారో తెలుకుంటామని వెల్లడించారు. పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయటం, ఈవీఎం, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్ల కనెక్షన్లు వాటిని వినియోగించే విధానం, మాక్ పోలింగ్ తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో విద్యుత్ వెలుగులు

ప్రభుత్వ చర్యలతో ప్రజలకు తొలగిన విద్యుత్ కష్టాలు

- అన్ని వర్గాల ప్రజలకు సౌకర్యవంతంగా సరఫరా
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఐదేళ్లలో రూ.1500 కోట్లకు పైగా ఖర్చు
- 3.14 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్‌ల మంజూరు

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు విద్యుత్ కష్టాలు తొలగించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉండేది. ప్రజలు నానా అవస్థలు పడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యుత్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. పల్లెవాసులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేశారు. రైతులకు పగటిపూటే నిరంతరాయంగా విద్యుత్ అందించి ఎంతో మేలు చేశారు. ఐదేళ్లలో విద్యుత్‌శాఖలో తీసుకున్న సమగ్రమైన చర్యల వల్లన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూ.1500 కోట్లకు పైగా ఖర్చు చేసింది. గృహ, వ్యాపార, పరిశ్రమ, వ్యవసాయ, ఆక్వా విద్యుత్ కనెక్షన్‌లను పెంచడంతో పాటు, అవసరమైన చోట నూతన సబ్ స్టేషన్‌ల నిర్మాణం, నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్‌లు ఏర్పాటు, సబ్‌స్టేషన్‌లలో నెలవారీ మరమ్మతులు చేపట్టడం వంటి చర్యలతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

వ్యవసాయానికి పగటిపూటే....

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సరఫరా చేసే 9గంటల వ్యవసాయ విద్యుత్‌ను పగటిపూట ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ విద్యుత్‌ను రాత్రి సమయాల్లో సరఫరా చేయడం వల్లన రైతులు విద్యుత్‌షాకులకు గురికావడం, విష పురుగుల బారినపడి మరణించడం వంటి ఘటనలు జరగుతున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా చేశారు.



తిరువూరు మండలం జి.కొత్తూరులో నూతనంగా ప్రారంభించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

ట్రాన్స్‌ఫార్మర్‌లు, సబ్‌స్టేషన్‌లు, వెచ్చించిన ఖర్చులు...

ఉమ్మడి కృష్ణా జిల్లాలో 33/11కేవీ మొతం సబ్‌స్టేషన్‌లు	:	306
2019–24మధ్య కాలంలో నిర్మించిన సబ్‌స్టేషన్‌లు	:	48
మొత్తం ట్రాన్స్‌ఫార్మర్లు	:	2లక్షలకు పైగా
2019–24 మధ్య కాలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు	:	43,666
2019–24 మధ్య కాలంలో సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి ఖర్చు	:	రూ.155 కోట్లు
2019–24మధ్య కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఖర్చు	:	రూ.1309.98 కోట్లు
2019–24మధ్య కాలంలో విద్యుత్ సరఫరాకి ఇతర ఖర్చులు	:	రూ.35కోట్లు

విద్యుత్ కనెక్షన్‌ల వివరాలు

కేటగిరి	2019 వరకు	2019–24	మొత్తం:
గృహ కనెక్షన్‌లు	13,13,765	2,35,153	15,06,339
వ్యాపార కనెక్షన్‌లు	1,58,322	46,853	1,91,326
పరిశ్రమల కనెక్షన్‌లు	7,087	733	6,992
జనరల్ కనెక్షన్‌లు	24,474	4085	27,939
వ్యవసాయ కనెక్షన్‌లు	1,02,124	22,115	1,22,902
అక్వా కనెక్షన్‌లు	12,464	5,349	17,295



రాష్ట్రంలోనే తొలి కంటైనర్ సబ్‌స్టేషన్....

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రాష్ట్రంలోనే తొలిసారిగా ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ సమీపంలోని గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేశారు. అదే విధంగా విజయవాడలోనే మరో కంటైనర్ సబ్‌స్టేషన్ ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. తక్కువ స్థలంలో ఏర్పాటు చేసే ఈ సబ్‌స్టేషన్‌ల వల్ల తక్కువ నిర్వహణ ఖర్చులు, సిబ్బందికి రక్షణ, కంప్యూటర్‌తో ఆపరేటింగ్ వంటి సౌకర్యాలతో విద్యుత్ సరఫరాకి వీలు కలుగుతుంది.



గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన తొలి కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్

రైతులకు ఇబ్బంది తొలగింది



ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయానికి ఇచ్చే తొమ్మిది గంటల విద్యుత్‌ని పగలు సమయంలో సరఫరా చేయడం వల్ల రైతులకు ఇబ్బందులు తొలగిపోయాయి. రాత్రి సమయాల్లో పొలాల్లోకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉండేది. గతం కంటే మిన్నగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు.

– వేమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, కొత్తమంగాపురం, మైలవరం మండలం

వెంటనే స్పందిస్తున్నారు



ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరంతరాయంగా విద్యుత్‌ను అందిస్తున్నారు. గతంలో కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. నూతన విద్యుత్ కనెక్షన్‌లు కావాలన్నా వెంటనే ఇస్తున్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేస్తున్నారు.

– ఇరుగుల మురళీరెడ్డి, మునగపాడు, జి.కొండూరు మండలం

పోలింగ్ కేంద్రాలు పరిశీలన



నున్న(విజయవాడరూరల్): గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా అధికారులతో కలిసి నున్న గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. కోటకట్ట సెంటర్లోని ఎలిమెంటరీ స్కూల్లో మూడు, జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. హైస్కూల్లో 4వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఎంత మంది ఓటర్లున్నారని బీఎల్వో సూర్యను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారికి ఇంటి వద్ద ఓటు వేసే సదుపాయం ఎవరికైనా కల్పించారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత నున్న గ్రామంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ వద్ద ఏర్పాటు చేసిన వెహికల్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. నగర డీసీపీ 1 అదిరాజ్ సింగ్ రాణా, విజయవాడ రూరల్ తహసీల్దార్ పి.జాహ్నవి, ఈవోఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, నున్న సీఐ ఎస్.దుర్గాప్రసాద్ వున్నారు. అనంతరం పాతపాడు గ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

31వరకు ధాన్యం కొనుగోలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఖరీఫ్ పంటలో జిల్లాలో ఇప్పటి వరకు 55,562 మంది రైతుల నుంచి రూ. 1070.07 కోట్ల విలువైన 4,88,590 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. జిల్లాలోని రైతులందరూ వారు పండించిన ధాన్యం నెలాఖరులోగా కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మీడియా సహకారంతో ఎన్నికలు

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



డీపీఆర్వో కార్యాలయంలో మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా, జేసీ సంపత్‌కుమార్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మీడియా సహకారంతో విజయవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. నగరంలో స్టేట్ గెస్ట్ హౌస్ ఆవరణలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, సీపీ టీకే రాణా, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకమని తెలిపారు. మే 13న పోలింగ్ జరగనుందని.. పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత ఈ మూడు దశలకు సంబంధించి ఎన్నికల సమాచారాన్ని, స్వీప్ కార్యక్రమాల సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. జిల్లాకు సంబంధించి ప్రదర్శించిన సమగ్ర సమాచారాన్ని, ఎన్నికల ప్రక్రియ మార్గదర్శకాలు, నిబంధనలతో ఈసీఐ రూపొందించిన హ్యాండ్ బుక్స్ స్టాల్‌ను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో నగదు, మద్యం, విలువైన లోహాలు రూ. 3.68 కోట్లు సీజ్ చేశామని ఇందులో ఒక్క నగదే రూ. 1.48 కోట్ల మేర ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో గరికపాడుతో పాటు 11 కీలక పాయింట్లలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలైన్స్ టీమ్స్ క్రియాశీలంగా పనిచేస్తున్నాయన్నారు. వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. సీపీ టీకే రాణా మాట్లాడుతూ మంచి ఏర్పాట్లతో మీడియా సెంటర్‌ను ప్రారంభించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. సెన్సేషన్‌కు ప్రాధాన్యమివ్వకుండా కచ్చితమైన సమాచారాన్ని ప్రచురించడం లేదా ప్రసారం చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. జేసీ డాక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ మీడియాకు సహాయ సహకారాలు అందించేందుకు సెంటర్ ఏర్పాటుచేశామని తెలిపారు. విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించవచ్చన్నారు. డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్‌వీ మోహనరావు, అడిషనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సహాయకులు వీవీ ప్రసాద్, ఏవీఎస్ సాయిబాబా, కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్ పంపిణీ



ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్ అందజేస్తున్న సీపీ రాణా

విజయవాడస్పోర్ట్స్: ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీసులు వేసవి వడగాడ్పుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. 358 మంది ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్స్‌ను కమిషనరేట్ కార్యాలయంలో గురువారం అందజేశారు. కిట్ బ్యాగ్‌లో ఒక లీటరు మిల్టన్ వాటర్ బాటిల్, కూలింగ్ స్పెట్స్, ఒక కేజీ గ్లూకోస్ డీ, 60 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నాప్కిన్స్ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి పాల్గొన్నారు.

బాలశౌరికి భంగపాటు!

- జనసేన నుంచి ఎంపీ సీటుపై ఇంకా రాని స్పష్టత
- తాజాగా గ్రీన్‌కో కంపెనీ డైరెక్టర్ నరసింహారావు పేరు తెరపైకి
- అవనిగడ్డ అసెంబ్లీ స్థానానికి బాలశౌరి పేరు పరిశీలన



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో జనసేన పరిస్థితి అయోమయంగా మారింది. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా తొలుత మచిలీపట్నం పార్లమెంటు, అవనిగడ్డ, విజయవాడ వెస్ట్ సీట్లు దక్కాయి. అయితే ఇప్పటికే వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన ఎంపీ బాలశౌరికి మచిలీపట్నం పార్లమెంటు సీటు కేటాయిస్తున్నట్లు సాక్షాత్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. తాజాగా ఈ సీటుపై జనసేన అధినేత మళ్లీ మడతపేచీ పెట్టారు. జనసేన సీట్ల కేటాయింపులో డబ్బు మూటలనే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే వైఎస్సార్ సీపీలో సీటు దక్కని బాలశౌరిని పార్టీలో చేర్చుకున్నారు. అయితే కథ అడ్డం తిరిగింది. బాలశౌరి కంటే ఎక్కువ ప్యాకేజీ ఇచ్చే నేతను జనసేన అధినేత వెతికి పట్టుకోవడంతో ఆయనను వదిలించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా గ్రీన్‌కో కంపెనీ డైరెక్టర్ బండారు నరసింహారావు పేరును తెరపైకి తెచ్చారు. నాగబాబు పేరును సైతం పరిశీలిస్తున్నారు. ఈ సీటు వ్యవహారంపై బాలశౌరిని జనసేన పార్టీ కార్యాలయానికి పిలిపించి మాట్లాడినట్లు తెలిసింది. సీటు కేటాయింపుపై ఆయనకు స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ఇదే అనుమానాలకు తావిస్తోంది. మచిలీపట్నం పార్లమెంటు సీటు ఇవ్వకపోయినా, కనీసం అవనిగడ్డ అసెంబ్లీ సీటయినా కేటాయించాలని బాలశౌరి అడిగినట్లు సమాచారం. దీనిపై కూడా జనసేన అధినేత నుంచి స్పష్టమైన హామీ లభించలేదని తెలిసింది. దీంతో బాలశౌరికి శృంగభంగం తప్పదని జనసేన కార్యకర్తలే పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో పొత్తులో భాగంగా దక్కించుకొన్న ఏకైక సీటు అవనిగడ్డలో సైతం జనసేన నేత పవన్‌కళ్యాణ్ అభ్యర్థిని ఇంత వరకు ప్రకటించలేదు. ఐవీఆర్‌ఎస్ సర్వేలో బండ్రెడ్డి రామకృష్ణ, బండి రామకృష్ణ, విక్కుర్తి శ్రీనివాస్ పేర్లను పరిశీలిస్తున్నారు. ప్రధానంగా ఆది నుంచి పార్టీకి సేవ చేసిన వారిని కాదని, డబ్బున్న నేతల కోసమే వేట సాగించారు. ఇందులో భాగంగానే సర్వేల పేరుతో విక్కుర్తి శ్రీనివాస్ వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. జనసేన కోటాలో విజయవాడ వెస్ట్ సీటును జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్‌కు ఇస్తామని చెప్పారు. దీంతో ఆయన నియోజకవర్గమంతా అభ్యర్థిని తానేనని కాలికి బలపం కట్టుకొని తిరిగారు. అయితే జనసేన అధినేత నాలుక మడత పెట్టి పొత్తులో భాగంగా ఆ సీటు బీజేపీకి కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇలా నిలకడలేని పవన్ నిర్ణయాలపై జనసేన కార్యకర్తలు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ డీలర్లు ప్రచారానికి దూరంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్



మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా పంపిణీ వ్యవస్థలో పనిచేసే రేషన్ డీలర్లు, రేషన్ డోర్ డెలివరీ చేసే ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, ఓటర్లను ప్రభావితం చేసినా అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం గవర్నర్‌పేటలోని అంబేడ్కర్ భవనంలో జిల్లా స్థాయిలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ సంపత్ కుమార్ ఎన్నికల నియమావళి గురించి వివరించారు. ప్రభుత్వం తరపున పౌరసరఫరాల విభాగం ఆధ్వర్యంలో ప్రజలకు నిత్యవసరాలు అందించే రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కూడా ప్రభుత్వ ప్రతినిధులుగానే చట్టం పరిగణిస్తోందని స్పష్టం చేశారు. అందువలన రేషన్ డీలర్లు, వారి సంబంధీకులు అనగా ఈపాస్ మెషిన్‌లో నామినిగా నమోదైన వ్యక్తులు, ఎండీయూ ఆపరేటర్లు ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ ప్రచారం చేయడం నిషేధమన్నారు. ఎండియూ ఆపరేటర్లు తమకు ఇచ్చిన వాహనాల మీద ముఖ్యమంత్రి ఫొటో కనిపించకుండా స్టిక్కరింగ్ చేయాలని సూచించారు. వాహనాలు పార్కింగ్ చేసిన సమయంలో ఎవరైనా స్టిక్కర్ తొలగించినా దానికి బాధ్యత ఎండీయూ ఆపరేటర్‌దేనని తెలిపారు.

షెడ్యూల్ ప్రకారమే సరుకులు పంపిణీ....

ఆపరేటర్లు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార మొదలైన నిత్యావసర సరుకులు కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయాలన్నారు.

మోపిదేవి ఆలయంలో బహిరంగ వేలం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ కేటగిరిల్లో లైసెన్సు హక్కునకు బహిరంగ వేలం పాటలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 ఒక సంవత్సరం కాల పరిమితికి గాను పలు షాపుల నిర్వహణకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేయు లైసెన్స్ హక్కునకు మోపిదేవికి చెందిన విస్సంశెట్టి రాజా రూ. 18 లక్షలకు హెచ్చు పాట పాడారు. భక్తుల పాదరక్షలు భద్రపరచి రుసుం వసూలు చేసుకునేందుకు స్థానికులు విస్సంశెట్టి శ్రీనివాసరావు రూ. 6 లక్షల 5 వేలకు హెచ్చుపాట పాడినట్లు తెలిపారు. భక్తులు సమర్పించిన చీరలు, పంచెలు పోగు చేసుకునేందుకు కోసూరువారిపాలెంకు చెందిన ఎస్.సాయివెంకట్ రూ. 3 లక్షల 60 వేల 500 కు సీల్డ్ టెండర్ ద్వారా హక్కు పొందినట్లు చెప్పారు. డివిజన్ తనిఖీ అధికారి కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక సదుపాయాలు

ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులు, ట్రాన్స్‌జండర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించామని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు, పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన సదుపాయాలపై వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్స్, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఢిల్లీరావు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు కల్పించామన్నారు. ఓటింగ్ శాతం 80 నుంచి 85 వరకు నమోదయ్యేలా స్వీప్ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 85 ఏళ్ల పై బడిన వారు 9,572 మంది, పర్సన్స్ విత్ డిజేబుల్డ్ (పీడబ్ల్యూడీ) 14,838 మంది ఉన్నారని వివరించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సదుపాయాలు కల్పించామన్నారు. దీనిలో భాగంగా ర్యాంప్, వీల్‌చైర్, వలంటరీ సర్వీస్, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 85 ఏళ్లపైబడి, పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయలేని స్థితిలో ఉండి ఫారం-12 ద్వారా నమోదు చేసుకున్న వారి అర్హతను బట్టి ఓట్ ఫ్రం హోం సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాస రావు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కామరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.విజయభారతి పాల్గొన్నారు.

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ బలపరిచిన బూరగడ్డ అశోక్‌కుమార్ ఎన్నిక



బార్‌అసోసియేషన్ నూతన కార్యవర్గం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం మచిలీపట్నం బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరిగాయి. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ బలపరిచిన బూరగడ్డ అశోక్‌కుమార్, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మాదివాడ వెంకట నరసింహారావు పోటీ పడ్డారు. మొత్తం 256 ఓట్లు పోలవగా అశోక్‌కుమార్‌కు 163, మాదివాడ వెంకటనరసింహారావుకు 81, నోటాకు పది ఓట్లు చొప్పున పోలవగా, రెండు ఓట్లు చెల్లలేదని ఎన్నికల అధికారి వింజమూరు శివరాం తెలిపారు. బూరగడ్డ అశోక్‌కుమార్ 82 ఓట్ల ఆధిక్యంతో నరసింహారావుపై గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా కె.నాగాంజనేయులు, జనరల్ సెక్రటరీగా ఎస్.ఎస్.ఎస్.సాయిబాబు, కోశాధికారిగా అద్దేపల్లి నిరంజనరావు, జాయింట్ సెక్రటరీగా టి.రూపారాణి, లైబ్రరీ సెక్రటరీగా సర్వా లలితకుమారి, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పి.సూర్యప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వి.వెంకటేశ్వరరావు, అర్జా శ్యాంప్రసాద్, పడమట ప్రవీణ్‌కుమార్, గండేపల్లి శ్రీనివాస్, జి.వెంకటరమణమ్మ, బి.కిరణ్‌కుమార్, జి.విజయబాబు, వి.రాధాకృష్ణమూర్తిని ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గాన్ని పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అభినందించారు.

ఇఫ్తార్ విందులో మంత్రి జోగి రమేష్



భోజనం వడ్డిస్తున్న జోగి రమేష్

ఉయ్యూరు: పట్టణంలోని దయారా మసీదులో గురువారం ఇఫ్తార్ విందు జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, షాదీఖానా కమిటీ చైర్మన్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, కౌన్సిలర్లు బేగ్, గోన మదన్, గుంజా సుధాకర్, రాజులపాటి చిన్ని, నాయకులు సలీమ్‌బేగ్, అబ్దుల్ సద్దాం, జంపాన కొండలరావు, రసూల్ పాల్గొన్నారు.

2న కృష్ణా వర్సిటీలో క్యాంపస్ సెలక్షన్లు

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఏప్రిల్ రెండో తేదీన క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు వర్సిటీ రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డి.రాజశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి తీసుకున్న ప్రత్యేక చొరవతో ప్రఖ్యాత మందుల తయారీ సంస్థ హెటిరో కంపెనీ ప్రాంగణ ఎంపికలకు హాజరవుతోందన్నారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ పూర్తి చేసిన విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, బీఫార్మసీ చదివిన విద్యార్థులు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఎంఫార్మసీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, పూర్తి చేసిన విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు అర్హులని తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం విద్యార్థులే కాకుండా అర్హతలు ఉన్న అభ్యర్థులు ఎవరైనా హాజరుకావొచ్చని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆకర్షణీయమైన ప్రారంభ వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో పాటు పాస్ పోర్ట్ సైజు ఫొటో, విద్యార్హత పత్రాలు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో ఏప్రిల్ రెండో తేదీ ఉదయం తొమ్మిది గంటల్లోపు విశ్వవిద్యాలయానికి హాజరవ్వాలని సూచించారు.

గురుకుల కళాశాలల్లో సీట్ల భర్తీకి సన్నాహాలు

- నోటిఫికేషన్ జారీ చేసిన ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ
- మార్చి 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచన
- ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష

కంకిపాడు: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల జూనియర్ కళాశాలలో సీట్ల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయి. గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ (ఆంగ్ల మాధ్యమం) మొదటి సంవత్సరం ప్రవేశానికి గుంటూరు కేంద్రంగా ఉన్న ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 31 తుదిగడువుగా నిర్ణయించారు. ఇందుకు గానూ ఏపీ ఆర్‌జేసీ సెట్-2024 నోటిఫికేషన్‌లో పేర్కొంది.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిమ్మకూరు ఏపీఆర్‌జేసీ

రాష్ట్ర వ్యాప్తంగా పది జూనియర్ గురుకుల కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించి నిమ్మకూరు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల జూనియర్ కళాశాల (సహ విద్య) ఉంది. 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఏపీఆర్‌జేసీ సెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా https://aprs.apcfss.in వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తులు చేసుకున్న వారికి ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అర్హత సాధించిన విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ గ్రూపుల్లో చేరేందుకు అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా పది గురుకుల కళాశాలల్లో 1,149 సీట్లు ఉన్నాయి. కృష్ణా జిల్లా నిమ్మకూరు కేంద్రంగా నిర్వహిస్తున్న ఏపీఆర్‌జేసీకి 195 సీట్లు కేటాయించారు. ఇక్కడ విద్యనభ్యసించేందుకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. సీట్ల భర్తీ విషయంలో అర్హులైన బాలురు లేని పక్షంలో ఆ సీట్లు బాలికలకు కేటాయించనున్నారు.

ఎంపిక విధానం

ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్, స్పెషల్ కేటగిరీ, స్థానికత ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.

పరీక్ష విధానం

ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ విధానంలో ఉంటుంది. మొత్తం 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు ఎంపిక చేసే కోర్సులు ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నాపత్రం తెలుగు/ఇంగ్లిషు/ఉర్దూ మాధ్యమాల్లో ఉంటుంది. పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి.

సీట్ల కేటాయింపు ఇలా...

ఓసీ-38 శాతం, బీసీ (ఏ)-7 శాతం, బీసీ (బీ)-10 శాతం, బీసీ (సీ)-1 శాతం, బీసీ(డీ)-7 శాతం, బీసీ(ఈ)-4 శాతం, ఎస్సీ,-15 శాతం, ఎస్టీ-6 శాతం, దివ్యాంగులు-3 శాతం, క్రీడలు-3 శాతం, అనాథలు-3 శాతం, ఆర్మీ-3 శాతంగా నిర్ణయించారు. ఈ రిజర్వేషన్ల కేటగిరీ ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఈ విద్యాసంవత్సరం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఏపీఆర్‌జేసీకి అర్హులు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉన్నత విద్య అభ్యసించేందుకు ఇదొక చక్కటి అవకాశం. ఈ నెల 31తో దరఖాస్తుల గడువు ముగుస్తుంది. విద్యార్థులు త్వరపడి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న విజయవాడ, మచిలీపట్నంలో జరుగుతుంది.

– తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణాజిల్లా

దస్తావేజులు పోగొట్టినందుకు పరిహారం చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): తీసుకున్న రుణం చెల్లించినప్పటికీ దస్తావేజులు ఇవ్వక పోవటంతో ఖాతాదారునికి నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయలు గురువారం తీర్పు చెప్పారు. మచిలీపట్నానికి చెందిన సన్నాల రమాదేవి శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ కంపెనీలో ఇంటి పత్రాలను తాకట్టు పెట్టి రూ.6 లక్షల రుణం తీసుకున్నారు. గడువు తేదీలోగా రుణం మొత్తం చెల్లించారు. ఇంటి పత్రాలను ఆ కంపెనీ తిరిగి ఇవ్వలేదు. ఫైనాన్స్ కంపెనీ చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఇంటి పత్రాలు కనపడలేదని తిరిగి ఇవ్వలేదు. దీంతో రమాదేవి వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలను విచారించిన కమిషన్ సభ్యులు, బాధితురాలు రమాదేవికి డాక్యుమెంట్లు తిరిగి ఇవ్వనందున నష్టపరిహారంగా రూ.4,47,761 నగదును కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నాటి నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదనకు రూ.30 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను 30 రోజుల్లోగా చెల్లించాలని తీర్పు చెప్పారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



నిడుమోలు(మొవ్వ): గ్రామంలోని 65 నంబరు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. కూచిపూడి ఎస్‌ఐ టి.శ్రీనివాస్ కథనం మేరకు.. నిడుమోలు హైస్కూల్ దాటిన తరువాత రోడ్డు దాటుతున్న చినముత్తేవి గ్రామానికి చెందిన చీలి వీరాస్వామి (83)ను విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరాస్వామి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వీరాస్వామి కుమారుడు చీలి వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూచిపూడి ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

● **మోపిదేవి:** స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా రూ.79,69,009 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధర రావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు సమక్షంలో గురువారం కానుకలను లెక్కించారు.

1 నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మచిలీపట్నంటౌన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పలు కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డాక్టర్ పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ గోపీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బ్యూటీపార్లర్, మే నెలలో జర్దోసి మగ్గం వర్క్, ఏసీ మెకానిజం, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 80089 96818 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

చెక్ పోస్ట్‌ల్లో తనిఖీలు



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సరిహద్దుల్లోని గూడవల్లి, గుణదల ఇన్నర్ రింగ్‌రోడ్డు, రామచంద్రపాలెం చెక్‌పోస్ట్‌లను పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానం ప్రతి వాహనాన్ని తప్పకుండా చెక్ చేయాలన్నారు. అక్రమంగా నగదు రవాణా చేస్తున్న వాహనాలను గుర్తించాలన్నారు. మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి హెచ్చరికలు చేశారు. అనంతరం సీపీ టి.కె.రాణా నున్న, పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ పర్యటనలో డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా, స్పెషల్ బ్రాంచ్ ఏడీసీపీ టి.కనక రాజు, ఏసీపీ పార్థసారథి పాల్గొన్నారు.

481 గ్రాముల బంగారం స్వాధీనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కనకదుర్గ వారధి చెక్ పోస్ట్ వద్ద గురువారం నిర్వహించిన సోదాల్లో 481 గ్రాముల బంగారం, రూ.70 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణలంక పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆర్.అఖిల్ గురువారం నరసరావుపేట నుంచి బంగారం, నగదు తీసుకుని హైదరాబాద్‌కు తన కారులో బయలుదేరాడు. వారధి వద్ద పోలీసులు ఆ కారును తనిఖీచేసి రూ.70 వేల నగదు, 481 గ్రాములు బంగారం ఉన్నట్లు గుర్తించారు. వాటికి ఎలాంటి బిల్లులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

అరుదైన క్యాన్సర్‌కు విజయవంతంగా చికిత్స



డాక్టర్ ఎస్.మణికుమార్, రేడియేషన్ ఆంకాలజిస్ట్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): మెదడులోని ఎడమ ఫ్రంటల్ లోబ్‌లో ఆర్టెరియో వీనస్ మాల్ఫార్మేషన్ (ఏవీఎం) అనే వ్యాధితో బాధపడుతున్న 52 ఏళ్ల వ్యక్తికి అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ అరుదైన చికిత్సను విజయవతంగా నిర్వహించినట్లు రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎస్.మణి కుమార్ తెలిపారు. అసాధారణంగా రక్త నాళాలు చిక్కుముడి పడటాన్ని ఏవీ వైకల్యంగా పేర్కొంటారని, అత్యాధునిక న్యూరో ఆంకాలజికల్ చికిత్సలలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచిన హాల్సియాన్ సిస్టమ్‌ని ఉపయోగించి రోగికి స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు.

ప్రాంగణ నియామకాల్లో 30 మంది ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ప్రముఖ ఫార్మసీ కంపెనీ ఇన్‌ఫ్లోక్యూరిస్ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 30 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత తెలిపారు. వారిలో బి.ఫార్మసీ, ఫార్మా డి, ఎం.ఫార్మసీ విద్యార్థులు ఉన్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సునీత అభినందనలు తెలిపారు. కార్యక్రమాన్ని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సీహెచ్ నాగభూషణం పర్యవేక్షించారు.

కార్మికులకు మజ్జిగ పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ నాయకులు కమరం మేస్త్రీ మల్లెల రాజేష్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సాయిహోటల్ వద్ద కార్మికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వేంకట రమణారావు మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేంకట రమణరావు మాట్లాడుతూ కార్మిక వాడలో తాగు నీటి ట్యాంకు నిర్మాణం జరిగిందని, త్వరలో తాగునీరు ఇచ్చే విధంగా ఐలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవిలో దాహార్తి తీర్చేందుకు సేవ చేసేవారు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏటీఏ కార్యదర్శి రావి రామచంద్రరావు, కోశాధికారి సయ్యద్ షా సాహెబ్ హుస్సేని, తోట బాలపవన్‌కుమార్ పాల్గొన్నారు.

స్పా,బ్యూటీ పార్లర్‌లలో తనిఖీలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు కొత్తపేట పోలీసులు గురువారం స్టేషన్ పరిధిలోని స్పా, బ్యూటీ పార్లర్లు, మెన్ సెలూన్‌లలో తనిఖీలు నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ పి.మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో కొత్తపేట సీఐ టి.గణేష్ తనిఖీలలో పాల్గొన్నారు. సుబ్బరామయ్య వీధి, కొత్తపేట, కోమలవిలాస్, నెహ్రూ బొమ్మ సెంటర్, టైలర్‌పేట, పంజా సెంటర్, కేటీ రోడ్డు పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు. స్పా, సెలూన్ల ముసుగులో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించరాదని హెచ్చరికలు జారీ చేశారు.

కాకినాడ అర్చకులను పరామర్శించిన ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజహితం కోరే పురోహితులు, అర్చకులంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అపార గౌరవ మర్యాదలు ఉన్నాయని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కాకినాడ శివాలయ ఘటనలో బాధిత అర్చకుడు వెంకటసత్యసాయి, ప్రధాన అర్చకుడు కార్తీక్‌లను గురువారం ఆయన ఫోనులో పరామర్శించారు. అర్చకులకు ఎటువంటి అన్యాయం జరిగినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, ఇప్పటికే దీనిపై స్థానిక ఎమ్మెల్యే, రీజనల్ జాయింట్ కమిషనర్, ఈఓలతో మాట్లాడినట్లు తెలిపారు. అర్చక వ్యవస్థ పట్ల ప్రతి ఒక్కరూ గౌరవ భావం కలిగి ఉండాలని, వారిపై దాడికి పాల్పడే వారు ఎవరైనా పార్టీలకు అతీతంగా తమ ప్రభుత్వం స్పందిస్తుందని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, పురోహితుల హక్కులను కాపాడే విధంగా సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి బాధిత పురోహితులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

రాణిగారితోటలో రహదారులకు మహర్దశ

- సుమారు రూ.7కోట్లతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం
- పలు చోట్ల యూజీడీ పైప్‌లైన్ నిర్మాణం
- రూ.కోటి వ్యయంతో స్ట్రాం వాటర్ డ్రైనేజీ
- దేవినేని అవినాష్ చొరవతో 18వ డివిజన్‌లో గణనీయమైన అభివృద్ధి



తారకరామనగర్ కరకట్ట దిగువన నిర్మించిన సీసీ రోడ్డు



పేవర్స్ బ్లాక్స్‌తో షేక్ హుస్సేన్ వీధిలో నిర్మించిన రోడ్డు

కృష్ణలంక(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గం పరిధిలోని రాణిగారితోట, 18వ డివిజన్‌లో రోడ్లకు మహర్దశ పట్టింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయి. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ డివిజన్‌కు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఉన్నారని డివిజన్‌ను అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన దేవినేని అవినాష్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా డివిజన్‌కు కూడా కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రెయిన్‌లు, కమ్యూనిటీ హాల్, పార్కులు, యూజీడీ పైప్‌లైన్, హైమాస్ట్ లైట్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అవినాష్ చొరవతో స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరగడంతో డివిజన్‌లో అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. డివిజన్‌లో సుమారు రూ.7 కోట్లతో సీసీ రోడ్డు, బీటీ రోడ్లు, యూజీడీ పైప్‌లైన్ నిర్మాణం, రూ.కోటి వ్యయంతో స్ట్రాం వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తవడంతో డివిజన్ రూపురేఖలు మారిపోయాయి. డివిజన్‌లో దాదాపు అన్ని వీధుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తవడంతో ఏ వీధిలోకి వెళ్లినా రోడ్లు అద్దంలా మిలమిలా మెరుస్తున్నాయి. డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతుండడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.8 కోట్లతో రోడ్లు, యూజీడీ, స్ట్రాంవాటర్ డ్రైనేజీ నిర్మాణం

డివిజన్‌లో సాధారణ నిధులు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, అమృత్ పథకం నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డివిజన్లలోని కోరె నామయ్య వీధి, మాదంశెట్టి సీతయ్య వీధిలో ఆరు వీధుల్లో, బాలస్వామి వీధి, ఆంటోనీ వీధి, మాదాల వెంకటేశ్వరరావు వీధి, రాధాకృష్ణ రోడ్డు నుంచి వారధి వరకు తారకరామనగర్ కరకట్ట దిగువ రోడ్డు, కరకట్టపై రోడ్డు, తమ్మిన పోతురాజు వీధుల్లో సుమారు రూ.3కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించారు. 108 పార్కు పక్కన షేక్ హుస్సేన్ వీధిలో సుమారు రూ.5లక్షలతో పేవర్స్ బ్లాక్స్‌తో రోడ్డును అందంగా తీర్చిదిద్దారు. సిమెంట్ గోడౌన్స్ సెంటర్ నుంచి కృష్ణానది కరకట్ట వరకు వారధి వెంబడి సుమారు రూ.18 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. రాధాకృష్ణ రోడ్డు నుంచి వారధి వరకు కరకట్ట దిగువ రోడ్డులో సుమారు రూ.కోటితో స్ట్రాంవాటర్ డ్రైనేజీ నిర్మించారు. డివిజన్‌లోని అన్ని వీధుల్లో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో కొత్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. సంగూల పేరయ్య వీధిలో ఇప్పటికే కొత్త యూజీడీ పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తవగా త్వరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.



కళకళలాడుతున్న రహదారులు

గత ప్రభుత్వ హయాంలో ఈ డివిజన్ అభివృద్ధికి నోచుకోలేదు. సరైన డ్రైనేజీలు, రోడ్లు లేక ఇబ్బందులు పడేవాళ్లం. స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు నిధులు తీసుకొచ్చి ఈ డివిజన్‌ను అభివృద్ధి చేశారు.

–పగడాల చెన్నకేశవరెడ్డి, కోరె నామయ్య వీధి, రాణిగారితోట



మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చొరవతో డివిజన్‌లో రూ.12 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. గతంలో ఎన్నడూ లేని విధంగా డివిజన్‌లో అభివృద్ధి జరిగింది. ఇంకా డివిజన్‌లో పలు వీధుల్లో మిగిలిపోయిన అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించి డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా.

–వెంకట సత్యనారాయణ, 18వ డివిజన్ కార్పొరేటర్, రాణిగారితోట

మాయా కూటమికి బుద్ధి చెబుదాం

- దళితద్రోహి చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): దళితులకు తీరని అన్యాయం చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి చందా కిరణ్‌తేజ అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ అవహేళన చేసి మాట్లాడారని, ఇప్పుడు ఓట్ల కోసం మాయమాటలు చెపుతున్నాడంటూ మండిపడ్డారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార దాహంతో ఒక మాయా కూటమి ఏర్పడిందని, వచ్చే ఎన్నికల్లో ఆ కూటమికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రతి దళితుడిపై ఉందన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ చంద్రబాబు గారడీ మాటలు చెబుతూ ప్రజల్లోకి వస్తున్నారని, ఆయనను నమ్మే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. దళితుల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పేదలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశ పెట్టారని, పేదలు వెళ్లే ప్రభుత్వాస్పత్రులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. నాణ్యమైన విద్య, వైద్యంతో ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. దళితులంతా ఐక్యంగా బాబుకు బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు.

మేమంతా వైఎస్సార్‌సీపీ వెంటే...

- 15వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన
- తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



ప్రజలతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు): గత ఐదు రోజుల నుంచి రామలింగేశ్వరనగర్‌లో జరుగుతున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఏ గడపకు వెళ్లినా తమకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తామంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పూర్తిస్థాయి మద్దతు ఇస్తామని ముక్తకంఠంతో చెబుతున్నారు. గురువారం వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని శివశంకర్ రోడ్డు, వీఎంఆర్ రోడ్డు, నీలవేణి రోడ్డు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా మూడు గంటల పాటు సుమారు 300 ఇళ్లకు పైగా వెళ్లి వైఎస్సార్‌సీపీ సంక్షేమం, అభివృద్ధిని స్థానికులకు వివరించారు. తనను ఆశీర్వదించాలని అవినాష్ కోరారు. ఎంపీ అభ్యర్థిగా కేశినేని శ్రీనివాస్(నాని)కి మరోసారి, ఎమ్మెల్యేగా తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, మీ విలువైన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఆయన అభ్యర్థించారు.

చంద్రబాబు బీసీలపై సవతి ప్రేమ చూపిస్తున్నాడని, పశ్చిమలో జనసేనకు చెందిన బీసీ నాయకుడు పోతిన మహేష్‌కు కూడా సీటు రాకుండా టీడీపీ కుట్రపన్నిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీలో సామాన్యులకు, బీసీలకు 50 శాతం ఎమ్మెల్యే సీట్లు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చెల్లారావు, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, రంగారావు, బడే నవీన్, గంధం వెంకటేశ్వరరావు, హరీష్, సూరి, విస్సు, భుజంగరావు, బాలకృష్ణ, ఖాదర్, శేఖర్ పాల్గొన్నారు.

రిటైనింగ్‌వాల్ నిర్మాణంతో సంతోషంలో ప్రజలు

16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో దేవినేని అవినాష్



16వ డివిజన్ ప్రజలతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలోని 16వ డివిజన్ పరిధిలో భూపేష్‌గుప్తానగర్‌లో కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో రూ.150 కోట్లతో రిటైనింగ్‌వాల్ నిర్మాణం, పార్కు నిర్మాణంతో ఆ ప్రాంత ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. నగరంలోని 16వ డివిజన్ భూపేష్‌గుప్తానగర్‌లో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ రూ.400 కోట్లకు పైగా వ్యయంతో 15వ డివిజన్ నుంచి ఆర్టీసీ పెద్ద బస్‌స్టేషన్ వరకు రిటైనింగ్‌వాల్ (కాంక్రీట్‌తో) నిర్మాణం జరిగిందన్నారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు కొద్దిపాటి వరదలకు ఇళ్లల్లోకి వర్షం నీరు వచ్చి నానా అవస్థలు పడేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక తీరిందన్నారు. 16 డివిజన్‌లో అంతర్గత రోడ్లు, మురుగుకాల్వలు, పార్కు అభివృద్ధితో పాటు సుమారుగా రూ.10 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఇక్కడ నివసించే వారిలో అర్హులైన ప్రతి కుటుంబానికి నవరత్నాలు అందాయన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రిటైనింగ్ వాల్ పక్కన ఉన్న మరి కొందరు పేదవారికి పట్టాలు ఇచ్చే విధంగా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ ఉన్న మురుగు కాలువ వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయని సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు పలువురు అవినాష్ దృష్టికి తీసుకువచ్చారు. మురుగు సజావుగా వెళ్లేందుకు ప్రత్యేకంగా సంప్ కూడా ఏర్పాటుచేస్తామని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి బహదూర్, చల్లంశెట్టి రామకృష్ణ, షేక్ ఖాజా, మోషే, రజని, పద్మజ, శ్రీదేవి, రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రచురణకర్తలకు సెంట్రల్ రిటర్నింగ్ అధికారి హెచ్చరిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించే ప్రింటర్లు, పబ్లిషర్లపై కఠిన చర్యలు తప్పవని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్/మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్‌తో కలిసి ఎన్నికల నియమావళిని అనుసరించాల్సిన అంశంపై సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రింటర్స్/పబ్లిషర్స్ యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. పాంప్లెట్లు, పోస్టర్లు ముద్రించే విషయంలో పాటించాల్సిన నిబంధనలు, ఎన్నికల నియమావళి ప్రకారం ఎంసీసీ 127(ఎ), ఆంధ్రప్రదేశ్ డిస్ ఫిగర్‌మెంట్ ఆఫ్ ఓపెన్ ప్లేసెస్, ప్రొహిబిషన్ ఆఫ్ అబ్జక్షనబుల్ పోస్టర్స్ యాక్ట్ 1997, ప్రకటనలు ముద్రించే యజమానుల నుంచి తీసుకోవాల్సిన అండర్ టేకింగ్‌ల గురించి వివరించారు. ఇకపై పాంప్లెట్లు, పోస్టర్ల వంటి ఎన్నికలకు సంబంధించినవి ముద్రించేటప్పుడు ప్రింటర్ల చిరునామా/ఫోన్ నంబర్, ముద్రించుకునే యజమానుల చిరునామా/ఫోన్ నంబర్ ముద్రించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంచి చేసే వారిని ఆదరించండి

గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో దేవినేని సుధీర



వెంకటేశ్వరనగర్‌లో ఇంటింటికీ పర్యటిస్తున్న దేవినేని సుధీర

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి చేయడంతో పాటు, సంక్షేమ పథకాలు అందించిన వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో భాగంగా దేవినేని సుధీర్ 4వ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కరించే దేవినేని అవినాష్‌కు అండగా నిలవాలని కోరారు. ప్రజలకు ఎవరు అందుబాటులో ఉంటున్నారో, ఎవరు ప్రజలకు మంచి చేస్తున్నారో గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి అవినాష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు గల్లా రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఆచార్య హేమచంద్రారెడ్డి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని మరింత సమర్థవంతంగా ఎదగాలని ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్రారెడ్డి అన్నారు. కేబీఎన్ 59వ వార్షిక వేడుకలు కళాశాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా తమను తాము ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. రాష్ట్రంలో విద్యారంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను విస్తృతం చేసేందుకు విద్యావిధానంలో అనేక నూతన మార్పులను తీసుకొచ్చామన్నారు. విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమలోని నైపుణ్యాలను పదును పెట్టుకుని ముందుకు సాగినప్పుడు జీవితంలో చక్కగా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సింగిల్ మేజర్ సబ్జెక్ట్ వంటి అనేక సంస్కరణలను అమలు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్ వెస్ట్‌జోన్ డీసీపీ టి.హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా తమ చుట్టూ ఉన్న సమాజాన్ని చైతన్యం చేయటానికి పాటుపడాలన్నారు. మిజోరాం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాధిపతి ఆచార్య దివాకర్ తివారి మాట్లాడుతూ కళాశాల సాధిస్తున్న విజయాలను అభినందించారు. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు టి.శేషయ్య, తునికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 118 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల 59 సంవత్సరాలుగా సామాజిక వికాసానికి పాటుపడుతోందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలంలో కళాశాల సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల సహాయ కార్యదర్శి జీవీ రామారావు, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, హిందూ హైస్కూల్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబా విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులను అందించారు.

పన్ను బకాయిలను 31లోపు చెల్లించండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఇంటి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ కాలపరిమితి ఈ నెల 31వ తేదీతో ముగుస్తున్న నేపథ్యంలో పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను వసూలు కేంద్రాలు సెలవు దినాల్లో కూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేతి వేలు కొరికిన ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: కానూరు వద్ద బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఆటోకు అడ్డుగా వచ్చారని వారిపై ఆటోలో ఉన్న వారు దాడి చేసి చేతివేలు కొరకటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గంగూరు గ్రామానికి చెందిన మట్టా వినోద్, మట్టా విజయ్ సోదరులు. వీరు బుధవారం విజయవాడలో షాపింగ్ చేసి బైక్‌పై గంగూరుకు బయలుదేరారు. వారు కానూరు ట్రెండ్‌సెట్ వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన ఆటోకు బైక్ తగిలింది. దీంతో ఆటోలో ఉన్న కానూరుకు చెందిన దుర్గాప్రసాద్, శ్రీనివాసరావులు బైక్‌పై ఉన్న వినోద్, విజయ్‌తో గొడవకు దిగారు. ఇది ఘర్షణకు దారి తీయటంతో వినోద్, విజయ్‌పై దాడి చేశారు. విజయ చేతి వేలు కొరికారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వైభవంగా భగవద్విషయ సమాపన మహోత్సవం



అష్టాక్షరీ జీయర్‌స్వామికి జ్ఞాపికను అందజేస్తున్న పద్మజాకుమారి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం భగవద్విషయ సమాపన మహోత్సవం జరిగింది. కార్యక్రమాన్ని త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి శిష్యులు శ్రీ అష్టాక్షరీ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచినజీయర్ స్వామి శిష్యబృందం అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం శ్రీ అష్టాక్షరీ జీయర్ స్వామి మాట్లాడుతూ భగవంతుని గురించి చెప్పడానికి నియమం లేదని, ఎవరైనా చెప్పవచ్చు, వినవచ్చునన్నారు. ఆచరించే వారు శాస్త్రబద్ధమైన ఆచరణ విధానాన్ని అనుసరించాలన్నారు. భగవద్విషయం అనేది సమాపన ఉత్సవం అని, విశిష్టాద్వైత సంప్రదాయాలలో ఉద్గ్రంథమని, 1102 పాశురాలతో ఉండే గ్రంథమని వివరించారు. అనంతరం నిర్వాహకురాలు పసుపమర్తి పద్మజకుమారి మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ జరగని విధంగా యతిరాజనాథవల్లి గోష్ఠి జరిగిందన్నారు. సంస్కృతంలో ఉన్న వేదాలను నమ్మాళ్వారు తమిళంలో అనుగ్రహించారన్నారు. అందులో సామవేదానికి సమానమైన తిరువాయ్‌మొ దివ్య ప్రబంధం అని, ఆ ప్రబంధాన్ని మూడు సంవత్సరాలుగా యతిరాజనాథవల్లి గోష్ఠివారు ఆన్‌లైన్ విధానంలో నేర్చుకున్నారన్నారు. ఆ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్నట్లు తెలిపారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



రక్తదానం చేస్తున్న పీపుల్స్ మ్యాక్స్ సంస్థ సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): రక్తదానం అనేది ఒక పవిత్ర కార్యక్రమమని, నేటికీ ఎంతో మంది రోగులు సకాలంలో రక్తం అందక చనిపోవడం బాధాకరమని పీపుల్స్ మ్యాక్స్ క్రెడిట్ సొసైటీ చైర్మన్ ఎల్లారావు అన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా లబ్బీపేటలోని ఆ బ్యాంక్ ఆవరణలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం ఎల్లారావు మాట్లాడుతూ తమ సంస్థ ప్రతినెలా ఒక సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ నెల రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కోశాధికారి జ్యోత్స్న మాట్లాడుతూ రక్తదానం ద్వారా కొంత మందికైనా మనం సహాయం చేయగలిగామన్న తృప్తి కలుగుతుందని అన్నారు. ఈ రక్తం యూనిట్లను మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి అందజేయనున్నట్లు తెలిపారు.

రేపు రన్ ఫర్ జీసస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రైస్తవ సంఘాలు శనివారం సమైక్యంగా నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐక్యవేదిక నాయకులు యద్దనపూడి పవన్‌కుమార్, అమృతపూడి కార్తీక్ కోరారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. శనివారం ఉదయం 6 గంటలకు, ఆర్‌సీఎం సెయింట్ పాల్ కేథడ్రల్ నుంచి ప్రారంభమై, సిద్ధార్థ పాలి క్లినిక్ రోడ్, మదర్ థెరిస్సా సర్కిల్, ఉడ్ పేట, శిఖామణి సెంటర్, గిరిపురం మీదుగా సాగి సీఎస్ఐ సెయింట్ పాల్స్ బసిలికా వరకు రన్ ఫర్ జీసస్ ర్యాలీ సాగుతుందని పేర్కొన్నారు.

నగరంలో సంప్రదాయ వస్త్రాల ప్రదర్శన

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేషనల్ సిల్క్ ఎక్స్‌పో వారి ఆధ్వర్యంలో ఎ.కన్వెన్షన్ సెంటర్‌లో విస్తృత శ్రేణి వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. మగువల మనసు దోచే విధంగా ఉన్న ఈ ప్రదర్శన గురువారం ప్రారంభం కాగా, ఏప్రిల్ 1 వరకూ కొనసాగుతుందని మేనేజర్ రాజు తెలిపారు. ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మగ్గంపై నేసిన ఎన్నో రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంచారు. మహారాష్ట్ర పైథాని సిల్క్ చీరలు, బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కషిద సిల్క్ వంటి చీరలు కూడా ఉన్నాయన్నారు. కాటన్ వస్త్రాలపై 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మేనేజర్ రాజు తెలిపారు.

గుడ్‌ఫ్రైడే



క్రీస్తు విధేయతా బలియాగం

క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. దీన్నే సువార్త అంటారు. సువార్త దేవుని సంకల్పంతో ఎప్పుడూ ముడిపడే ఉంటుంది. పూర్వపు దేవుని సంకల్పం చెప్పక దాన్ని దాటవేసే సువార్త అసలు లెస్సయైన లేఖనానుసార సువార్తగా ఎప్పటికీ కానేరదు. సువార్త పుట్టుకకు ఆయువుపట్టు వంటి దేవుని ప్రణాళికను చాలా పకడ్బందీగా, పటిష్ఠంగా వివరించకున్ననూ అది సువార్త కాదు. సత్యవాక్యం అనే రక్షణ భాగ్యపు సువార్త ప్రకటన అపొస్తలుల బోధకు లోబడే ఉండి తీరాలి.

ఈ జగత్తుకు పునాది వేయక పూర్వమే దేవుని ఆలోచనలలో ఉన్న క్రీస్తు బలియాగం అనే 'పథక రచన' గూర్చి ఎంతగా చెప్పుకొన్నా, అది తక్కువే. తన ప్రజల పాప పరిహారార్థం అద్వితీయ జ్ఞానసంపన్నుడైన దేవుడు అనాదిలోనే క్రీస్తు పరిశుద్ధ రక్తానికి రూపకల్పన చేయడం జరిగింది. అప్పటికి ఇంకా మానవ సృష్టి జరగలేదు. భూలోకమే లేదు. భూమి మీద మనుష్యుల జాడే లేదు. పాపమే లేదు. దీన్నే క్రీస్తు కేంద్రంగా చేయబడిన దేవుని నిత్య సంకల్పంగా చెబుతారు. క్రీస్తు లేకుంటే దేవునికి సంకల్పమే లేదు అనేంత ఉన్నతం గా దీన్ని గూర్చి చెప్పుకోవడం మాత్రం అసాధారణం. తండ్రియైన యెహోవా దేవుడు తన నీతిని బట్టి సంతోషం గలవాడై ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం సంబంధిత సంకల్పాన్ని మించిన భావజాలం లేదా భావ సంపద మరొకటి లేదంటారు.

దేవుని దృష్టి కోణంలో దేవుని మనస్సుతో దేవుని గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసే వారికి ఒక విషయం తేటగా అర్థం అవుతుంది. అదేమిటంటే, దేవుడు అన్యాయం చేయుట అసంభవం అనునదే. ఈ సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకొన్నవారే ఆత్మ సంబంధులు. బలిని కాక కనికరమునే కోరే దేవుడు ప్రారంభంలో జంతుబలులను ఏర్పాటు చేసినా కూడా యుక్త కాలాన తన సొంత కుమారుడను బలిగా అర్పించుట ద్వారా ఇలా పాపవ్యాప్తి నివారణకు మేలైన శాశ్వత పరిష్కారం కనుగొని జంతు బలులకు చరమగీతం పలికాడు. యూదులకు చాలా సహజంగా సామాన్యంగా చెప్పే సత్యం ఒకటుంది. రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది నమ్మే యూదులు మెస్సీయ బలిని కనులారా చూడటం ద్వారా విస్మయానికి గురయ్యారు. మహాదేవుని సంకల్పానికి బహు ముగ్ధులై ఐశ్వర్య భయంతో వినయ సంపన్నులైన వారంతా తలలు వంచి దేవుని పాదాల చెంత సాగిలపడ్డారు. మానవాళి అంతా పుట్టారు కాబట్టి చనిపోతారు. యేసుక్రీస్తు మరణించడానికే పుట్టాడంటూ పండిత పెద్దలు పదే పదే చెబుతుంటారు. ఇదే ఆయన జీవితం ప్రత్యేకత. ఇలాంటి జీవితం ఈ భూమి మీద ఏ ఒక్కరికీ లేదన్నదే సుసమాచారం. క్రీస్తు ఈ లోకానికి చెప్పశక్యం కాని ఒక వరంగాను ఆయన సాహసోపేత విధేయత తాలూకు ప్రాణత్యాగం మానవాళి పాలిట శుభవార్తగానూ చరిత్రకెక్కిందనేది గమనార్హం. బాల్యం నుండే కాక, మూడున్నర సంవత్సరాల తన యౌవన కాలమంతా దేవునికి వెచ్చించి విధేయుడైన వాడై తన్ను తాను దేవునికి అర్పణగా సమర్పించుకున్నాడు. 'నీ చిత్తమే సిద్ధించును గాక!' అంటూ మరణానికి ఎదురుగా వెళ్ళిన అరుదైన జీవితం క్రీస్తు ప్రభువుది.

లోక పాపాలను మోసుకొనిపోయే దేవుని గొర్రె పిల్లగా, పస్కా బలి పశువుగా క్రీస్తును అభివర్ణిస్తుంది పరిశుద్ధ బైబిలు. దేవునికి అవిధేయులైన మానవాళి పాపాలు గొర్రె పిల్లపై మోపబడ్డాయి. ఫలితంగా గొర్రెపిల్ల మరణించింది. క్రీస్తుకు ఇందుకొరకే శరీరం ఇవ్వబడింది లేదా అమర్చబడింది. దేవుని ప్రజల పాపాలకు ప్రతిగా వారి పక్షాన సిలువలో క్రీస్తు శరీరాన్ని శిక్షకు గురి చేయడం ద్వారా దేవుని ప్రజలు తమ తమ పాపాల నుండి విమోచించబడి పరిశుద్ధులయ్యారు. క్రీస్తు మరణం వెనుక దాగిన సువిశేష పరమార్థం ఇదే. మానవ ప్రారంభ ఆదాము అనే ఒకని అవిధేయత ద్వారా లోకంలోనికి పాపం ప్రవేశించింది. కడపటి ఆదాము అనే ఒకని విధేయత ద్వారా యావత్తూ అవిధేయ మానవాళికి రక్షణ భాగ్యం సంప్రాప్తించింది. వారంతా కొత్త జన్మతో నూతన సృష్టిగా పరివర్తన చెందారు. ఆ కడపటి ఆదామనే క్రీస్తు సాహసోపేత జీవిత విధానమే ఎల్లరకు పరిశుద్ధ జీవితాలను అనుగ్రహించింది.

ఈ దిగువ గల యెషయా భవిష్యత్ ప్రవచనం దాని వర్ణన అత్యున్నతమైన క్రీస్తు విధేయత జీవిత సారాన్ని అసాధారణ రీతిలో వెల్లడి చేయుట అనేది మనస్సు పెట్టి గమనించదగ్గది. బలి యాగంలో క్రీస్తు చూపిన విధేయత ఇప్పటికీ వేనోళ్ళ కొనియాడబడుతునే ఉండుట బహు ఆశ్చర్యకరం! ఈ ప్రవచనం క్రీస్తు నందు నెరవేరింది.

''అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
వధకు తేబడు గొర్రె పిల్లయు
బొచ్చు కత్తిరించు వాని యెదుట గొర్రెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువ లేదు
అన్యాయపు తీర్పు నొందిన వాడై
అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమును బట్టి
మొత్తబడెను గదా''

ఈ అరుదైన సృష్టిలో, బిడ్డను నవ మాసాలు మోసిన కన్న తల్లి అతన్ని భూమి మీద విడిచి పెట్టి కన్ను మూసింది. అతడు పెద్దవాడై తన తల్లి పట్ల నిత్యమూ కృతజ్ఞతాభావం కలిగిన వాడై ఆమె ఆలోచనలు, ఆశయాలు అన్వేషిస్తూ వాటి సాధనలో నిత్యమూ నిమగ్నమవడమే కాకుండా, తన తల్లి వలె ఏ ఒక్కరూ రక్త హీనతతో చనిపోకుండా పుష్టినిస్తూ బలవృద్ధి కలుగజేసే బహు మేలైన ఉచిత సేంద్రీయ సహజాహార పంపిణీకి దృఢ సంకల్పంతో నడుం కట్టాడు. తన తల్లి మరణాన్ని ఒక పండుగగా, వేడుకగా మలిచే పనిలో సత్క్రియల యందాసక్తితో అతడు సమాజంతో ప్రేమలో పడ్డాడు. 'ఆమె మరణించి మనకు దూరం కాలేదు. ఇదిగో ఇక్కడే ఉంది నవ్వుతూ' అన్న భావనను కుటుంబంలోను, బంధు మిత్రులలోనూ ఆమె కొడుకు కలుగజేసిన వైనం అతనిదైన సృజనాత్మక కళాత్మక పనితనమనే చెప్పాలి. అది చూసి ఊరు ఊరంతా ఆ మహాతల్లి త్యాగం వూరికే పోతుందా అనే వారే అంతటా. తన మాతృమూర్తి ప్రేమను అతడు సెలబ్రేట్ చేయబూనే వైవిధ్య విధానానికి తెరలేపడం వలన అంతా మంత్రముగ్ధులయ్యేలా అది ఊరంతా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమ్మ అజెండా సాధనే ధ్యేయంగా పిల్లవాడి ప్రయాసకు అంతా జత కలిశారు.

యేసు ప్రాణ త్యాగం అచ్చు ఇలాంటిదే. సెలబ్రేట్! జీసస్ సెలబ్రేట్!

– జేతమ్

వారపు ప్రప్రథమ దినం అనే ప్రతి ఆదివారం నాడు యెడతెగక దేవుని ఆరాధనలో భాగంగా జరిగే రొట్టె విరుచుట అనేది క్రీస్తు బలియాగానికి గుర్తు. క్రీస్తు పస్కా బలి పశువుగా, వధకు సిద్ధమైన గొర్రెపిల్లగా అనాదిలోనే దేవుని చేత నిర్ణయించబడినవాడు. అది క్రీస్తు మరణంతో నెరవేరుటను నేడు మనం చూస్తున్నాం. క్రీస్తు వారి నలగగొట్టబడిన శరీరానికి గుర్తుగా రొట్టెను, మానవాళి కొరకు చిందించబడిన పవిత్ర రక్తానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని... ఇలా రెండింటిని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతో తీసుకుంటూ ప్రభువు వచ్చువరకు ఇలా చేస్తూ క్రీస్తు సిలువ యాగాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది క్రీస్తు ప్రభువు వారి సంఘం. నిజానికి ఇది భోజనం, పానం కాదు. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ సంబంధిత ఆత్మానందం ఇహమందు కాక ఈ లోక సంబంధులుగా కాక పరలోక సంబంధులుగా సంఘమనే దేవుని రాజ్యంలో జరుపుకొనే పండుగ. సంఘ భవనంలోనే ఇది జరిగినా కూడ సత్య లేఖనాల సారం ప్రకారంగా ఇది ఇహమందు అద్వితీయ సత్యదేవుడు, ఆయన నియమించిన రాజు ప్రధాన యాజకుడైన క్రీస్తు వారి సమక్షంలో జరిగే అత్యున్నత సంఘ కార్యక్రమం. సంఘం అంటే పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని అర్థం. ఇట్టి ఆదివారపు దేవుని ఆరాధనతో సంఘం పరిశుద్ధంగా, ఆత్మ సంబంధంగా అన్నింటా బలపడుతూ ఉంటుంది.




ఒకనాడు దేవుడు ఆజ్ఞాపించి చేయమన్న ఇహలోక భూ భౌతిక సంబంధ పండుగల కంటె మిన్నగా ఆత్మ సంబంధ పండుగను ఒకటి నిర్ణయించి నేడు ఉన్నతంగా ఆచరించమని తన గ్రంథం ద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. అదే క్రీస్తు పస్కా పండుగ. ఇది హృదయానందానికి సంబంధించినది. ఇది ఎక్కడా ప్రసిద్ధి చెందినట్టుగా బహు ప్రాచుర్యంలో ఉన్నట్టుగా లోకంలో కనబడదు. క్రీస్తు పస్కా పండుగ ఒకటి ఉందనేది లోకానికి తెలియదు. ఎందుకంటే ఇది ఆత్మసంబంధమైనది. దేవుని రాజ్యం దానిని పొందిన వారి అంతరంగానికి మాత్రమే అందే కార్యం. ఇది తన తోటి వారికి, పక్కవారికి, అన్యులకు ఏనాడూ అంతు చిక్కని కార్యం. ఇది జీవం గల దేవుని సంఘంలో క్రీస్తును బట్టి క్రీస్తు ద్వారా క్రీస్తునందు జరిగే ఉన్నతమైన కార్యక్రమం.

● ముత్తు నందిని ప్యాలెస్

ఇష్టాల ఇల్లు

రాజ్ చందర్ పద్మనాభన్, నాగ జయలక్ష్మి దంపతులు తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారిలో నివసించేవారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో వీరు అనుసరించిన విధానం ఇప్పుడు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. పర్యావరణ ప్రేమికులనైతే మరీ ఎక్కువగా ఆకట్టుకుంటోంది. రెండేళ్ల కిందట గృహప్రవేశం చేసుకున్న కొత్త ఇల్లది. అయితే ఆ ఇంట్లో అడుగుపెడితే కాలం గిర్రున సినిమా రీల్‌లాగ వందేళ్ల వెనక్కి తిరిగిపోయిందా అనిపిస్తుంది. ఇంటిని చూడడానికి వచ్చిన వాళ్లను అతిథి మర్యాదలతో ముంచెత్తుతారు ఈ దంపతులు. సేంద్రియ పద్ధతిలో పండించిన దినుసులు, కాయగూరలతో సంప్రదాయ తమిళ, చెట్టినాడు వంటలను వడ్డిస్తారు.





నాగ జయలక్ష్మి, రాజ్ చందర్ పద్మనాభన్

పర్యావరణహిత భవనం ముత్తు నందిని ప్యాలెస్





ఎర్రమట్టి, సున్నపు రాయితో నిర్మించిన ఇంట్లో భూగర్భ జలాలను పరిరక్షించే ఏర్పాటు ఉంది. బంకమట్టి నిర్మాణం కావడంతో ఎండాకాలం చల్లగా ఉంటుంది. నేచర్ ఫ్రెండ్లీ ట్రావెల్‌ను ఇష్టపడే వాళ్ల ఇక్కడ బస చేస్తుంటారు. బస చేయకపోయినా చూసి పోవడానికి వచ్చేవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ కాలంలో ఇంటిని ఇలా ఎందుకు కట్టుకున్నారనే ప్రశ్న దాదాపుగా ప్రతి ఒక్కరి నుంచి ఎదురవుతుంటుంది. జయలక్ష్మి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటుంది.

బాల్యంలోకి వెళ్లారాయన!

''రాజ్‌చందర్ వృత్తిరీత్యా జియో డాటా అనలిస్ట్. ఆయనకు ఇష్టమైన రోజులంటే చిన్నప్పుడు వాళ్ల అమ్మమ్మ గారింట్లో గడిపిన బాల్యమే. పైగా రాజ్ అభిరుచి, విధి నిర్వహణ కూడా పర్యావరణవేత్తలతో కలిసి పని చేయడమే. ఈ రెండు ఇష్టాలను కలుపుతూ చక్కటి ఇల్లు కట్టుకోవాలని ఎప్పుడూ చెప్పేవారు. నాక్కూడా మా సంప్రదాయ నిర్మాణంలో ఉండే సౌందర్యం చాలా ఇష్టం. ఇద్దరి అభిరుచులూ కలవడంతో ఇంటిని ఇలా కట్టుకున్నాం. మా ఇద్దరి ఇష్టాల మేరకు ఎలా కట్టుకోవాలో ఒక ఐడియా వచ్చేసింది. ఎక్కడ కట్టాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కొంచెం కష్టమే అయింది. లొకేషన్ సెర్చింగ్ మొదలు పెట్టాం.

సంజీవని శకలం

కన్యాకుమారికి సమీపంలో పోథయాడి గ్రామాన్ని చూసినప్పుడు కొండలు, పచ్చటి చెట్లతో ప్రదేశం బాగుందనిపించింది. ఆశ్చర్యంగా మరో విషయం తెలిసింది. అదేంటంటే... రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు వైద్యం కోసం హనుమంతుడు ఏకంగా సంజీవని మొక్క ఉన్న పర్వతం అంతటినీ ఎత్తుకొచ్చాడని విన్నాం. వైద్యం చేసిన తర్వాత ఆ పర్వతాన్ని తిరిగి తీసుకెళ్లే క్రమంలో పర్వతంలోని ఒక శకలం విరిగి కింద పడి పోయిందని, ఆ శకలమే ఈ కొండ అని చెప్పారు స్థానికులు. వాళ్ల విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ కొండమీద చుట్టుపక్కల ఉన్న మొక్కలన్నీ ఔషధ మొక్కలే. ప్రకృతితో మమేకమై నివసించడానికి మాకు ఇంతకంటే సౌకర్యవంతమైన ప్రదేశం మరొకటి ఉండదేమో అనిపించింది. అంతే... 2021లో నిర్మాణం మొదలు పెట్టాం. ఒక ఏడాదిలో తమిళ, వేనాడు, చెట్టినాడు సంస్కృతుల సమ్మేళనమైన మా ఇంటి నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ కళాకృతుల సేకరణ నా హాబీ. ఇంటిని తమిళ సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా మలిచాను. ఇంటి ముఖద్వారం నుంచి నేల, గోడ, మెట్లు, పై కప్పు, అలంకరణ వస్తువులు ప్రతి ఒక్కటీ తమ వైభవాన్ని తామే చెప్పుకుంటాయి. పర్యావరణ హితమైన సున్నపు పొడి ఇటుకలు, ఎర్ర మట్టి, ఆవుపేడ, ధాన్యం పొట్టు, కోడిగుడ్లు, బెల్లంతోపాటు అత్తంగుడి నది తీరాన దొరికే ఇసుకతో తయారు చేసే అత్తంగుడి టైల్స్‌ను వాడాం. పై కప్పుకి కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి ఫిల్లర్ స్లాబ్ టెక్నిక్ ఉపయోగించాం. వర్షపు నీటిని నిల్వ చేయడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, కరెంటుకోసం సోలార్ ప్యానెల్స్ పెట్టాం. ఈ మట్టి సౌధంలో 5 బెడ్ రూమ్‌లు, మూడు బాల్కనీలు, మూడు లివింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రెండు వందల మందికి పైగా పర్యాటకులు ఈ హోమ్ స్టేలో బస చేశారు. ఆహారం కూడా తమిళనాట ప్రాంతాల వారీగా విలసిల్లిన విభిన్నమైన రుచులుంటాయి. ఇంటి ఆవరణలో అన్ని రకాల కూరగాయలనూ పండిస్తాం. వంటగదిలో వచ్చే వ్యర్థాలనే ఎరువుగా వేస్తాం'' అని తమ పర్యావరణ హిత భవనం ముత్తు నందిని ప్యాలెస్ గురించి వివరించింది జయలక్ష్మి.

పరివర్తన

ఇప్పుడవి రాళ్లు విసిరే చేతులు కాదు

ఆ అమ్మాయి ఒకప్పుడు గుంపులో రాళ్లు విసిరే కశ్మీరీ అమ్మాయి. ఇప్పుడు జమ్ము-కశ్మీర్‌లో కేవలం బాలికల కోసం ఫుట్‌బాల్ అకాడెమీ నడుపుతున్న ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఆమెలో వచ్చిన మార్పు ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ చేత కూడా మాట్లాడించేలా చేసింది. విరాట్ కోహ్లి కూడా ఆమెను మెచ్చుకున్నాడు. యువతకు సరైన దిశ ఉంటే వారు గెలిచి తీరుతారనడానికి అఫ్షాన్ ఆషిక్ ఒక ఉదాహరణ.

కొన్నేళ్లు వెనక్కు వెళితే 2017 డిసెంబర్‌లో ఒక ఫోటో వైరల్ అయ్యింది. ఒకమ్మాయి... ముఖానికి దుపట్టా కట్టుకుని జమ్ము కశ్మీర్ పోలీసులపైకి రాళ్లు విసురుతున్న ఫొటో అది. ఆ అమ్మాయి పేరు అఫ్షాన్ ఆషిక్. ముఖం కనబడకుండా గుడ్డ కట్టుకోవడంతో తనను ఎవరూ గుర్తుపట్టరని అఫ్షాన్ భావించింది. కానీ తర్వాత ఆమె గురించి అందరికీ తెలిసిపోయింది. సమాజం ఆమెపై 'స్టోన్ పెల్టర్' ముద్ర వేసింది. అప్పటికే ఆ అమ్మాయి ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ కనపరుస్తూ ఉంది. కాని ఈ ఫోటోతో ఆమె తన ఆటకే దూరమయ్యే స్థితి వచ్చింది.

'ఆ రోజు నేను పోలీసుల మీద రాళ్లు రువ్వాను. అది కోపంలో చేసిన పని. దానికి కారణం పోలీసులు అకారణంగా మమ్మల్ని వేధించారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని మేము కాపాడుకోవడానికి రాళ్లు విసరడం మినహా మాకు గత్యంతరం లేదు. నేనేమి ప్రొఫెషనల్ స్టోన్ పెల్టర్‌ను కాదు. కాని నా మీద ముద్ర పడింది. దాని నుంచి బయటపడాలంటే నేను నా చదువు మీద నా ఫుట్‌బాల్ ఆట మీద దృష్టి పెట్టి విజయం సాధించాలని అనుకున్నాను' అంది అఫ్షాన్ ఆషిక్.

ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి నెల రోజులు ఇంటికే పరిమితమైంది. అఫ్షాన్ తండ్రి ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లనీయలేదు. అరగంటపాటు ఆడుకుని వచ్చేస్తానని తల్లికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఒకరోజు చాలా ఏడుస్తుంటే నన్ను చూసిన నాన్న ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఇంట్లో కూర్చుని ఏం చేయాలని ప్రశ్నించాను. ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించడంతో మళ్లీ ఆట మొదలుపెట్టాను' అందామె.

ముంబై వెళ్లి

కశ్మీర్ యువత తమ చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలని భావించిన ప్రభుత్వం అఫ్షాన్‌ను తగిన ప్రోత్సాహం అందించింది. జమ్మూ కశ్మీర్ క్రీడాశాఖ చేయూతతో అఫ్షాన్ ముంబై వెళ్లి ఆటలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నుంచి తొలి ప్రొఫెషనల్ ఫిమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయ్యింది. 'నువ్వు ఆడపిల్లవి. ఫుట్‌బాల్ నేర్చుకుని ఏం చేస్తావ్ అని అందరూ అడిగేవారు. నేను ఆడే సమయానికి ఆడపిల్లలు ఎవరూ మా ప్రాంతం నుంచి ఫుట్‌బాల్‌లోకి రాలేదు. కాని నేను ఆగలేదు. పట్టుదలగా ముందు కెళ్లాను. ఇండియన్ విమెన్స్ లీగ్‌లో ఆడాను. గోల్ కీపర్‌గా విశేష ప్రతిభ కనపరిచాను. ఆ సమయంలో విదేశీ మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లని గమనించాను. వాళ్లకు చాలా మంచిశిక్షణ ఆ దేశాల్లో లభిస్తోంది. మా ప్రాంతం బాలికలకు కూడా లభించాలని భావించాను. అందుకే జమ్ము కశ్మీర్ బాలికల కోసం యునీక్ ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను' అని తెలిపింది అఫ్షాన్.



అఫ్షాన్ ఆషిక్



ఆరోజుల్లో రాళ్లు విసురుతున్న అఫ్షాన్ ఆషిక్

మరింత గుర్తింపు

నేడు జమ్ము కశ్మీర్‌లో మహిళా ఫుట్‌బాల్ పేరు చెప్తే అఫ్షాన్ పేరే అందరికీ గుర్తుకొస్తుంది. ఆమెకు అక్కడ ఒక సెలబ్రిటీ హోదా ఉంది. 'నేను నా గతాన్ని జయించాను. ఇప్పుడు నేను స్టోన్ పెల్టర్‌ని కాను. గోల్ కీపర్‌ని. ఇకపై నన్ను జనం అలాగే గుర్తు పెట్టుకుంటారు' అంటుందామె.